
సంపుటి : 78 సంచిక : 45 పుటలు : 52

# జాగృతి

కలి 5128 - శ్రీ పరాభవ శ్రావణ శుద్ధ ద్వాదశి

24-30 ఆగస్ట్ 2026

వెల : ₹20/-



# సప్తధార నుంచి మానసిక నక్సల్స్ దాకా..

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా https://payit.cc/SYBqNRG267 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

@Jagriti Tv

78 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక

www.jagritiweekly.com





# పుత్తూరులో మహాభారత బ్రహ్మోత్సవాలు..

తిరుపతి జిల్లా పుత్తూరులోని ద్రౌపదీ దేవి సమేత ధర్మరాజు ఆలయంలో మహాభారత బ్రహ్మోత్సవాలను 11 రోజుల పాటు వైభవంగా నిర్వహించారు. పుత్తూరు పట్టణానికి వచ్చే వారు ధర్మరాజుల ఆలయాన్ని దర్శించకుండా తిరిగి వెళ్లరు. దక్షిణ భారతదేశంలో పాండవులకు రథం ఉన్న ఏకైక ఆలయంగా ఈ క్షేత్రానికి ప్రత్యేక గుర్తింపుంది. ఏటా శ్రావణ మాసంలో నిర్వహించే మహాభారత బ్రహ్మోత్సవాల్లో భాగంగా వివిధ వాహన సేవలు, రథోత్సవం, అగ్నిగుండ ప్రవేశం వంటి కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకుంటాయి.

ఈ ఆలయానికి సంబంధించి స్థానికంగా ప్రచారంలో ఉన్న చారిత్రక కథనం ప్రకారం విజయనగర సామ్రాజ్యం పతనానంతరం దక్షిణ భారత ప్రాంతాల్లో రాజకీయ పరిస్థితులు మారిన కాలంలో తమిళనాడులోని చెంగల్‌పట్టు ప్రాంతం నుంచి పలువురు పుత్తూరుకు వలస వచ్చినట్లు చెబుతారు. వారిలో ఏడుగురు అన్నదమ్ములు చౌటూరులో బావి తవ్వే పనిని చేపట్టగా, తవ్వకాల్లో అమ్మవారి చెక్క బొమ్మ లభించిందని స్థానిక కథనం. అప్పటి నుంచి వారు ఆ బొమ్మకు పూజలు చేయడం ప్రారంభించారు. కార్వేటినగరం సాల్వరాజు ఆలయం నిర్మించారని స్థానిక చరిత్ర పేర్కొంటుంది. ఆయన ఆధ్వర్యంలో ఆలయం, ప్రాకారం, గాలిగోపురం నిర్మాణం జరిగిందని చెబుతారు.

ద్రౌపదీ దేవి సమేత ధర్మరాజుల ఆలయానికి ఉన్న భారీ రథం ఈ క్షేత్రానికి ప్రత్యేక ఆకర్షణ. స్థానిక ప్రజలు గతంలో చందాలు సేకరించి సుమారు 40 అడుగుల ఎత్తులో రథాన్ని ఏర్పాటు చేసినట్లు ఆలయ వర్గాలు చెబుతున్నాయి. కాలక్రమంలో రథం పాడవడంతో సుమారు 20 ఏళ్ల క్రితం పునరుద్ధరించారు. అప్పటి నుంచి సంప్రదాయబద్ధంగా రథోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.



భారతీయ సాహితీ ద్రష్ట

భండారు సదాశివరావుగారి స్మారక

# కథల పోటీ-2026

జాగృతి వారపత్రిక దీపావళి సందర్భంగా ప్రఖ్యాత సాహితీవేత్త స్వర్గీయ భండారు సదాశివరావు గారి స్మారక 'కథల పోటీ' నిర్వహిస్తున్నది. రచయితలకు ఆహ్వానం..



**ప్రథమ బహుమతి : రూ. 12000/-**

**ద్వితీయ బహుమతి : రూ. 7000/-**

**తృతీయ బహుమతి : రూ. 5000/-**

## నిబంధనలు :

1. సమకాలీనం, చారిత్రకం, సైన్స్ ఫిక్షన్ ఇతివృత్తంతో కూడిన కథలను పంపవచ్చు. భారతీయ సామాజిక జీవనమే నేపథ్యంగా ఉండాలి. సాధ్యమైనంత వరకు ఆంగ్ల పదాలను పరిహరించండి.
2. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ఎనిమిది కథలకు రూ.1,000 చొప్పున ప్రోత్సాహక బహుమతులు, సాధారణ ప్రచురణకు స్వీకరించిన ప్రతి కథకు పారితోషికం ఉంటుంది.
3. కథ నిడివి 1500 పదాలకు మించరాదు. ఒక రచయిత 2 కథలకు మించి పంపరాదు.
4. కథ స్వంతమేనని, అనువాదం, అనుసరణ కాదని, బ్లాగుల్లోనూ, వెబ్ పత్రికల్లోనూ మరెక్కడా ప్రచురితం, ప్రసారం కాలేదని; పరిశీలనలో లేదని విడిగా హామీపత్రం జతచేయాలి. హామీపత్రంలో రచయిత పేరు, చిరునామా, ఇ-మెయిల్ ఐడి, ఫోన్ నంబర్ తప్పక రాయండి. కథ రాసిన పుటలలో ఎక్కడా రచయిత పేరు గానీ, ఇతర వివరాలేవి ఉండరాదు.
5. కథకులు తమ రచన DTP చేసిన పిదప అక్షర దోషాలు, వాక్య నిర్మాణం, ఫుల్‌స్టాప్, కామా గుర్తులు సరి చూచుకొనగలరు. అలాగే పదాలు, వాక్యాలు అల్లుకుపోకుండా చూసి పంపవలసిందిగా మనవి.
6. కథలను తెలుగులో అను లేదా యూనికోడ్ ఫాంట్‌లో డిటిపి చేసి jagriticompetition@gmail.com కు మెయిల్ చేయాలి.
7. పోస్టు లేదా కొరియర్ ద్వారా పంపాలనుకుంటే 'కథల పోటీ' జాగృతి వారపత్రిక, 3-4-228/4/1, జాగృతి భవన్, కాచిగూడ, హైదరాబాద్-500027 కు పంపొచ్చు. జాగృతికి కథల్ని చేర్చే బాధ్యత రచయితలదే.
8. కథల ఎంపికలో ఉత్తర, ప్రత్యుత్తరాలకు తావులేదు. తుది నిర్ణయం న్యాయ నిర్ణేతలదే.
9. ఈ కథలను దీపావళి సంచిక నుంచి వరుసగా ప్రచురిస్తాం.



**కథలు జాగృతికి చేరడానికి చివరి తేది : 31 ఆగస్టు, 2026**

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.

**Managing Editor : Kurra Durga Reddy.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య ) సంప్రదించండి.**

ఎం. శ్రీనివాస్ : సర్క్యులేషన్ ఇన్‌చార్జ్
**040-27561453 / 9959997013**

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం**
**9959991304**
**(ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య )**

డిజైనర్ : చిగుళ్ల కుమార్

## చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ "To Bank / UPID" ఆప్షన్ వాడండి.

**Link / QR Code** ద్వారా మీ చందా చెల్లించినప్పుడు **Remarks** దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

**విడి ప్రతి రూ.20**

**5 సం॥ల చందా రూ.4000** **సంవత్సర చందా రూ.850**

జాగృతి వారపత్రికను **'మ్యాగజైన్ పోస్ట్'** ద్వారా పొందుటకు: **రూ.1,474 (850+624)**

**బ్యాంకు ఖాతా వివరాలు**

**A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch.**
**IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**

– సర్క్యులేషన్ ఇన్‌చార్జ్, జాగృతి


విశృంఖల స్వేచ్ఛను నియంత్రించే చర్యలు మొదలు కాగానే వామపక్ష మేధావులు, తీవ్రవాద అనుకూల సూడో బుద్ధిజీవి బృందాలు బెంబేలెత్తి పోతున్నాయి. దేశంలోని విశ్వవిద్యాలయాలను అడ్డాగా చేసుకుని దశాబ్దాలుగా యువతరాన్ని పెడదోవ పట్టిస్తున్న వామపక్ష తీవ్రవాద అనుకూల మేధో బృందాలకు ముకుతాడు వేసే చర్యలు ఉధృతం కావడంతో కంగాళీ ప్రచారాన్ని లంకించుకుంటున్నాయి. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఎర్రకోటపై నుంచి చేసిన ప్రసంగంలోని 'దిమాగీ నక్సల్' అనే పదబంధం దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టిస్తోంది.

వామపక్ష మేధోవర్గం, ముఖ్యంగా తీవ్రవాద అనుకూల మేధావులు అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. ప్రధాని మోదీ ఏదైనా కొత్త పదాన్ని, పదబంధాన్ని ఉపయోగించారంటే దాని ప్రతిక్రియలు ప్రమాదకరంగా ఉంటాయని వ్యాఖ్యానాలు చేస్తున్నారు. అయితే, 2013లోనే కాంగ్రెస్ ప్రభుత్వం నక్సలైట్లు, నక్సలిజంపై సుప్రీం కోర్టుకు నివేదించిన అఫిడవిట్‌లో, నగరాల్లో పనిచేస్తున్న మావోయిస్టు 'ప్రజా/ఫ్రంట్ సంస్థలు,' సీపీఐ (మావోయిస్ట్)తో 'సహజసిద్ధంగా ముడిపడి ఉన్నాయి' అంటూ వారిలో విద్యావేత్తలు, కార్యకర్తలు, సిద్ధాంతకర్తలు ఉన్నారంటూ వివరించింది. వీరంతా ప్రభుత్వం చేపట్టే ప్రాజెక్టులను ప్రతికూల దృష్టిలో చూపుతూ తప్పుడు ప్రచారం చేశారని పేర్కొంది. ఈ సిద్ధాంతకర్తలే మావోయిస్టు ఉద్యమాన్ని సజీవంగా ఉంచుతున్నారని, అనేక విధాలుగా వీరు 'పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ'కన్నా ప్రమాదకరమైనవారంటూ కూడా అభివర్ణించింది. అంతేకాదు, వీరికి వ్యతిరేకంగా ప్రభుత్వసంస్థలు చట్టపరమైన చర్యలు చేపట్టినప్పుడు, సిపిఐ (మావోయిస్టు) పార్టీ ప్రాపగాండా యంత్రాంగంవల్ల ప్రతికూల ఫలితాలు వచ్చాయని మొరపెట్టుకుంది.

అంతేనా, ప్రధానంగా 'మానవ హక్కుల ఎన్జీవోల' ముసుగులో పనిచేసే ఈ 'ప్రజా సంస్థలు', సీపీఐ (మావోయిస్టు) పార్టీ నిర్మాణంతో సహజంగా ముడిపడి ఉన్నప్పటికీ, చట్టపరమైనచర్యల నుండి తప్పించుకునే ప్రయత్నంలో ఎన్జీవో అనే ప్రత్యేక గుర్తింపులను కొనసాగిస్తాయని వివరించింది. ఈ 'ప్రజాసంస్థల'కు సాధారణంగా పార్టీ సిద్ధాంతానికి పూర్తిగా కట్టుబడి ఉండే విద్యావేత్తలు, కార్యకర్తలతో సహా

**శాలివాహన 1948 శ్రీ పరాభవ శ్రావణ శుద్ధ ద్వాదశి**

## లోపలి పేజీలలో...




6లో

ముఖపత్ర కథనం


**సప్తధార నుంచి మానసిక నక్సల్స్ దాకా..**

ధారావాహిక నవల

**3** **ఏ వెలుగులకీ ప్రస్థానం ?**

– గన్నవరపు నరసింహా మూర్తి

20లో



మోహన్ జీ భాగవత్ ప్రసంగం

**విస్తరించే బంధాల రక్షాబంధన్**

26లో



# జాగృతి

## సంపాదకీయం

సిద్ధాంతకర్తలు నాయకత్వం వహిస్తారు. ఇలాంటి సంస్థలు పైకి మానవ హక్కులకు సంబంధించిన సమస్యలను అనుసరిస్తున్నట్లు నటిస్తాయి. భద్రతాదళాల చర్యలను బలహీనపరచడానికి, నిర్వీర్యం చేయడానికి చట్టపరమైన ప్రక్రియలను ఉపయోగించడంలోనూ, అలాగే తమ 'విప్లవం' లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లడానికి ప్రచారం, తప్పుడు సమాచారం ద్వారా ప్రభుత్వ సంస్థల ప్రతిష్టను దెబ్బతీయడంలోనూ ఇవి నిపుణులై ఉంటాయంటూ వివరించింది.

ఇంత వివరణాత్మకంగా కాంగ్రెస్ ప్రభుత్వం 'దిమాగీ నక్సల్స్' ఎలా పని చేస్తున్నారో సుప్రీంకోర్టుకు వివరించింది. ఇప్పుడు హఠాత్తుగా తమకు ఆ

## 'దిమాగీ నక్సల్' అంటే ఉలికిపాటా?

విషయాలే తెలియనట్టు, కాంగ్రెస్ నేత పి.చిదంబరం మాట్లాడుతూ, తాను కూడా దిమాగీ నక్సల్ అని ప్రకటించుకోవడం విడ్డూరం. అటువంటివారు, సుప్రీం కోర్టులో అదే దిమాగీ నక్సల్స్‌కు వ్యతిరేకంగా ఎందుకు ఫిర్యాదు చేశారో ప్రశ్నించడం అసమంజసం కాదు. ముఖ్యంగా, ఆ అఫిడవిట్ చూడాలనుకున్నవారికి అందుబాటులో ఉన్న సందర్భంలో వారు ఇలా మాట్లాడటం అంటే, ప్రజల మేధస్సును తక్కువగా అంచనా వేయడమే. అలాగే, ఒకస్థాయిలో మండిపడుతున్న మేధావులు అప్పుడు ఎందుకు ఇటువంటి హడావిడి చేయలేదో ఆశ్చర్యమే!

నిజానికి, ప్రధాని మోదీ ప్రయోగించిన 'దిమాగీ నక్సల్' మాటకు ఇటీవలి పరిణామాలే ప్రాతిపదిక. దేశ రాజధాని వేదికగా జరిగిన ఆందోళనల అంతరార్థమే ఈ పదబంధం పుట్టుకకు మూలం. అంతే కాదు, 'సర్' ప్రక్రియపై, ఎన్నికల కమిషన్ విశ్వసనీయతపై, ఇతర రాజ్యాంగబద్ధ సంస్థలపై నిందలు వేయడం తీవ్రమైన నేపథ్యంలోనే ప్రధాని మోదీ దీనిని సంధించారు. సాధారణ సమయంలో కాక స్వాతంత్ర్య దినోత్సవ వేళ, దేశమంతా ప్రధాని మాటలను ఉత్సుకతతో చెవొగ్గి వింటున్న వేళ, నిర్దిష్ట లక్ష్యాన్ని చెప్పడం కోసమే 'దిమాగీ నక్సల్' మాటను ప్రధాని ప్రయోగించారు. ప్రధాని నరేంద్ర మోదీ గతంలో అర్బన్ నక్సల్, ఆందోళన్ జీవి, టుక్డే టుక్డే గ్యాంగ్, ప్రొఫెషనల్ పెసిమిస్ట్ అనే మాటలను వాడారు. ఈ పదబంధాలన్నీ దేశ వర్తమాన రాజకీయ స్థితిని ప్రతిబింబించేవే తప్ప కేవలం రాజకీయ విమర్శ కోసం చేసినవి కావని.. ఇంగితం ఉన్నవారికి అర్థమవుతుంది. రాజ్యాంగపరమైన రక్షణలు, చట్టపరమైన హక్కులను ఆసరాగా చేసుకుని ఏళ్లుగా దేశంలోని మేధో నక్సల్ బృందాలు, సంస్థలు ఇష్టారీతిన విపరీత భావ ప్రకటనా స్వేచ్ఛను అనుభవిస్తున్నాయి.

కేంద్రం అనుకున్నట్టే ఈ ఏడాది మార్చి 31లోపు వామపక్ష తీవ్రవాదం పీచమణచింది. ఇక రాబోయే రోజుల్లో నగరాలు, పట్టణాలను కేంద్రంగా చేసుకుని, వామపక్ష తీవ్రవాదాన్ని పెంచి, పోషించి, సామాజిక అశాంతికి కారణమవుతున్న మేధో తీవ్రవాదుల ఆటకట్టించేందుకు సిద్ధమవుతోంది. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు 'దిమాగీ నక్సల్' పదబంధం గురించి వివరణ ఇచ్చారు. ఎటువంటి వారిని ఉద్దేశించి ప్రధాని మోదీ ఆ మాటెందుకు వాడారో స్పష్టం చేశారు. దేశ అంతర్గత భద్రతకు సవాలు విసిరే శక్తులు నానాటికీ పేట్రేగిపోతున్నాయి. కేంద్రం ఎన్ని చర్యలు తీసుకున్నప్పటికీ పట్టణాల్లో తిష్ఠవేసిన ఉగ్రవాద, తీవ్రవాద అనుకూల శక్తుల మద్దతుతో జరగాల్సిన నష్టం జరుగుతూనే ఉంది. దేశంలోని ప్రతిపక్షాలు అందుకు సంపూర్ణమైన మద్దతును ప్రకటిస్తున్నాయి. పౌరసమాజం మేల్కొని మేధో తీవ్రవాద ప్రమాదాన్ని అర్థం చేసుకుని, వారిని ఏకాకిని చేయడం ద్వారా దేశాన్ని రక్షించుకోవడం తక్షణ కర్తవ్యం. ★

24 ఆగస్ట్ 2026, సోమవారం

అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్




40లో

కథ

**ఆయుధం**

– పి.ఎస్.నారాయణ





| | | | | | |
|---|---|---|---|---|---|
| కశ్మీరీ పండిట్లకు బెదిరింపు (జాతీయం) | – | 12 | వాడుకభాష వేగుచుక్క 'గిడుగు' (ప్రత్యేక వ్యాసం) | – | 32 |
| 'నిషేధిత' జాబితాతో సతమతం (తెలంగాణ) | – | 14 | సాహిత్య పరిపుష్టికి అనువాదం అవశ్యం (సాహిత్యం) | – | 33 |
| సంక్షోభంలో ఖరీఫ్ సేద్యం (ఆంధ్రప్రదేశ్) | – | 16 | చరిత్ర ధ్రువీకరించిన ద్రష్ట (ఆర్ఎస్ఎస్–100) | – | 34 |
| అజ్ఞాత వీరులు – 'రా' అధికారులు (రక్షణ) | – | 18 | 'కృత్రిమ' గ్రహణం (మహిళ) | – | 42 |
| 'మక్కా' ఒప్పందం: భారత్ వ్యూహాలు (అంతర్జాతీయం) | – | 24 | హాకీ మాంత్రికుని క్రీడోత్సవం (క్రీడ) | – | 43 |
| ....వజ్రాలు చెప్పిన కథలు (గళమెత్తిన గతం) | – | 30 | బాంధవ్యాల విలువ తెలిపే 'విశ్వనాథ్ అండ్ సన్స్' (సినిమా) | – | 50 |



80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆగస్టు 15న ఎర్రకోట బురుజులు సాక్షిగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ యావత్ భరత జాతిని ఉద్దేశించి చేసిన ప్రసంగం ప్రతి ఒక్క భారతీయుణ్ణి రోమాంచితం చేసింది. 2014లో ప్రధాని పదవిని చేపట్టిన తర్వాత 13వసారి పంద్రాగస్టు ప్రసంగం చేశారు. స్వతంత్ర భారత చరిత్రలో తొలిసారి అన్నట్టుగా దేశరాజధానిలో జరిగిన ఈ వేడుకల్లో వందేమాతరం గీతాలాపన జరిగింది. ఎర్రకోటకు మోదీ చేరుకోగానే త్రివిధ దళాలకు చెందిన సంగీత వాయిద్యాల బృందం వందేమాతరాన్ని అత్యంత మృదుమధురంగా పలికించింది.

# సప్తధార నుంచి

గత 12 ఏళ్లలో రక్షణ రంగ ఉత్పత్తి దాదాపు నాలుగు రెట్లు పెరిగింది. ఖాదీ, గ్రామ పరిశ్రమల రంగం ఉత్పత్తి దాదాపు ఐదు రెట్లు పెరిగింది. ఎలక్ట్రానిక్స్ తయారీ దాదాపు ఏడు రెట్లు, ఆధునిక రైల్వే కోచ్‌ల ఉత్పత్తి 21 రెట్లు, మొబైల్ ఫోన్ల ఉత్పత్తి 35 రెట్లు పెరిగింది. ఆధునిక యుగానికి అనుగుణంగా డిజిటల్ టెక్నాలజీ, ఆవిష్కరణల ప్రపంచంలోనూ మనదైన ముద్ర వేశాం. ఇంటర్నెట్ వినియోగదారులు, కస్టమర్ల సంఖ్య దాదాపు నాలుగు రెట్లు పెరిగింది. మంజూరైన పేటెంట్ల సంఖ్య నాలుగు రెట్లు పెరిగింది. డిజిటల్ లావాదేవీలు 100 రెట్లు పెరిగాయి. సాధారణ పౌరుల దైనందిన జీవితాలను మెరుగుపరిచేందుకు మేం కూడా అంతే శ్రద్ధతో పనిచేశాం. గతంతో పోలిస్తే సగటున 15 రెట్లు వేగంగా నల్లా నీటి కనెక్షన్లను ఏటా అందించాం. గ్యాస్ కనెక్షన్లు ఏటా సగటున ఆరు రెట్లు వేగంగా అందిస్తున్నాం. పేదల కోసం మరుగుదొడ్ల నిర్మాణం వార్షిక రేటు కన్నా నాలుగు రెట్లు వేగంగా జరుగుతోంది. పేదలకు ఇళ్లు సమకూర్చే వేగం ఏటా మూడు రెట్లు పెరిగింది.

### 1.75 కోట్ల గృహాలకు పైప్‌లైన్ గ్యాస్

2014కు ముందు, అంటే 12 సంవత్సరాల కిందట, మన దేశంలో కేవలం 70 నగరాల్లో మాత్రమే పైప్‌లైన్‌ల ద్వారా గ్యాస్ పంపిణీ చేసే మౌలిక సదుపాయాలు ఉండేవి. ఈ 12 సంవత్సరాల్లో, మనం ఈ 70 నగరాలను 700 నగరాలకు విస్తరించుకున్నాం. వేగం అంటే ఇలా ఉంటుంది. విస్తరణ అంటే ఇలా ఉంటుంది. 2014కు ముందు, కేవలం 20-22 లక్షల గృహాలకు మాత్రమే పైప్‌లైన్‌ల ద్వారా గ్యాస్ అందేది. ఈ రోజు, దాదాపు 1.75 కోట్ల గృహాలకు పైప్‌లైన్‌ల ద్వారా గ్యాస్ అందించే పనులు జరుగుతున్నాయి.

### ఆయుధాలుగా వనరులు ఆందోళనకరం

ప్రస్తుత సంక్షోభ సమయంలో కొందరు తమ ఆధిపత్యాన్ని చాటుకోవడానికి వనరులను ఆయుధాలుగా మార్చే ఆటలో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం ప్రపంచం తన వద్ద ఉన్న ఆస్తులను ఆయుధాలుగా మార్చడానికి సిద్ధంగా ఉంది. పెట్రోల్, డీజిల్, ఎరువులు, మందులు, టెక్నాలజీ చిప్‌ల వంటి వనరులనూ ఆయుధాలుగా మార్చుకుంటున్నారు. నిజానికి, భూభాగాన్నీ వారు ఆయుధంగా వాడుతున్నారు. ఇలాంటి సమయంలో, గత దశాబ్ద కాలంగా మనం స్వయం-సమృద్ధి మంత్రంతో సరైన దిశలో పయనించకపోయి ఉంటే... అటువంటి సవాళ్లను మనం ఎలా ఎదుర్కొనే వాళ్లమో మీరు ఊహించవచ్చు. మన సన్నాహాలు నిరంతరం పెరుగుతూనే ఉన్నాయి.

### సప్తధారతో సరికొత్త శిఖరానికి భారత్

ఇవాళ, ఎర్రకోట బురుజుల మీద నిలబడి నేను శక్తికి సంబంధించిన ఏడు ప్రవంతులకు (వీటిని 'సప్త ధార' అంటున్నాను) పిలుపునిస్తున్నాను. గత 5-7 దశాబ్దాల్లో సాధించలేనిది రాబోయే 5-7 సంవత్సరాల్లో 'సప్త ధార' సామర్థ్యంతో, శక్తితో దేశాన్ని మనం ఒక కొత్త శిఖరంపై నిలిపి, ఒక కొత్త వేగాన్ని జోడిద్దాం. కొత్త లక్ష్యాల్ని అధిగమించే సామర్థ్యాన్ని సంపాదించుకుందాం. దీంతో పాటు దేశ యువ శక్తిలో ఉన్న సామర్థ్యాల్ని దేశ నిర్మాణానికి పూర్తి స్థాయిలో సద్వినియోగపరుచుకుందాం. దేశనిర్మాణంలో వారి శక్తిని జతచేద్దాం.

### 1. తయారీరంగం

రాబోయే రోజుల్లో, 'సప్త ధార'ను గురించి నేను మాట్లాడినప్పుడల్లా 'సప్త ధార'లో మొదటి శక్తి తయారీ రంగానికి సంబంధించిన శక్తే అవుతుంది. మనం ఉత్పత్తితో పాటు తయారీ రంగంలోనూ ఎంతో ముందుకు వెళ్లాల్సి ఉంది. చిన్న చిన్న కంపోనెంట్ల (భాగాలు) మొదలు పెద్ద పెద్ద ఉత్పాదనల వరకూ.. ప్రతిదీ మనం తయారు చేయాల్సిన అవసరం ఉంది. సరకుల పరంగా చూసినప్పుడు, ప్రతి దశలో మనం రాణించాలి. ముందుకు వెళ్లాలి. మనకు కంపోనెంట్లూ కావాలి. తయారీ ప్రక్రియలన్నింటిపైన కూడా పట్టు ఉండాలి. ఉత్పాదన ప్రక్రియ పూర్తి కావడమూ మన వద్దే జరగాలి. రూపురేఖలను తీర్చడం మొదలు తయారీ దాకా, ప్రపంచ సరఫరా వ్యవస్థలో ఒక విశ్వసనీయ కూడలి (హబ్)గా భారత్ తప్పక ఎదగాలి. ఈ విషయంలో మూడు అంశాల్ని నేను మరీ మరీ చెప్పదలుచుకుంటున్నాను. తయారీ రంగంలో కృషిచేస్తున్న నా సోదరీ, సోదరులారా, ఇది తక్షణావసరం. ఈ అవకాశాన్ని చేజార్చుకోకండి.

అక్కడే ఉన్న అతిథులందరూ గీతాలాపనకు గొంతు కలపడంతో దేశభక్తి వాతావరణం తొణికిసలాడింది. ఆత్మవిశ్వాసానికి నిలువెత్తు నిదర్శనం అన్నట్టుగా ప్రధాని చేసిన ప్రసంగం దేశ ప్రజల కలలను సాకారం చేయడంలో సరికొత్త ప్రయత్నానికి బాటలు వేసింది. దానికే సప్తధార అని ప్రధాని నామకరణం చేశారు. ఉత్పాదక రంగం నుంచి ఆధ్యాత్మిక, సాంస్కృతిక రంగాల దాకా ఇలా ప్రతి దానిలోనూ శక్తిని పెంపొందించుకుంటూ ఏడు శక్తుల సమాహారంతో వికసిత భారత్ లక్ష్య సాధనకు యుక్తిని వినియోగించాలిన్స ఆవశ్యకతను మోదీ ప్రధానంగా ప్రస్తావించారు. అంతరిక్ష పరిశోధనల నుంచి జనగణన దాకా యువత పాత్రను పేర్కొన్నారు. కృత్రిమ మేధ(ఏఐ) ఆవశ్యకతను నొక్కి చెబుతూ వచ్చే ఏడాది కాలంలో కోటి మంది యువతకు ఏఐలో శిక్షణ ఇస్తామని ఎర్రకోట బురుజుల నుంచి ప్రధాని ప్రకటించారు. అదే సమయంలో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి కోచింగ్ రూపేణా అదనపు ఆర్థిక భారాన్ని నివారించడానికి పరీక్షార్థులకు ఆన్‌లైన్‌లో ఉచితంగా శిక్షణ ఇవ్వడానికి రంగం సిద్ధం చేస్తున్నామని యువతకు హామీ ఇచ్చారు. దేశంలో నక్సలిజం లేదా మావోయిజం దాదాపుగా తుడిచిపెట్టుకుపోయినప్పటికీ మానసిక నక్సల్స్(దిమాగి నక్సల్స్) ముప్పు ఇంకా పోలేదని, వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని దేశప్రజలను హెచ్చరించారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం ప్రాతినిధ్యం కల్పించే విషయంలో ప్రభుత్వంతో కలిసి రావాలని దేశంలోని అన్ని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు. ఆ ఘనత ఏదో మీరే తీసుకోండి అని పార్టీల నేతలకు సూచించారు. బానిస మనస్తత్వాన్ని వదిలించుకోవడం ద్వారా వికసిత భారత్ లక్ష్య సాధన వైపు వడివడిగా అడుగులు వేద్దామని దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రధాని ప్రసంగంలోని కీలకమైన భాగాలు యథాతథంగా జాగృతి పాఠకుల కోసం...

# మానసిక నక్సల్స్ దాకా..




ఈ విషయంలో ఖర్చు, రాశి, వాసిల పరంగా అంతర్జాతీయ ప్రమాణాల్ని మనం అందుకోవాల్సి ఉంది. మన ఫ్యాక్టరీలు పోటీతత్వంతో ముందుకు వెళ్లాలి. మనం తయారు చేసే వస్తువులు వినియోగదారులకు సానుకూలంగా ఉండగలగాలి. మన ఉత్పాదనల ప్యాకేజింగ్ ఆకర్షణీయంగా ఉండి, ప్రపంచం నలుమూలలా ప్రజల మెప్పును పొందేదిగా నిలవాలి. తయారీ విధానంలో ఏ కొద్ది లోపానికీ తావు ఇవ్వరనే ప్రశంసే మన గీటురాయి కావాలి. ప్రపంచ మార్కెట్‌లో మనకు లభించే గుర్తింపు నికార్సయిన నాణ్యత, విశ్వసనీయతలపై ఆధారపడాలని ప్రతి తయారీ సంస్థకూ, ప్రతి ఔత్సాహిక పారిశ్రామికవేత్తకూ, ప్రతి ఒక్క ఎమ్ఎస్ఎమ్ఈకీ నేను సూచిస్తున్నాను. నాణ్యత విషయంలో ఎంతమాత్రం రాజీ పడకూడదు. అందువల్ల మనం జపించాల్సిన మంత్రం ఒకటే. అదే.. నాణ్యత, నాణ్యత, నాణ్యత. ఇదే మన అంతర్జాతీయ బ్రాండ్ వేల్యూగా మారుతుంది.

## 2. వ్యవసాయం-ఆహారోత్పత్తి

ఈ 'సప్త ధార'లో రెండో శక్తిగా వ్యవసాయాన్నీ, ఆహారోత్పత్తినీ ప్రస్తావిస్తున్నాను. ఆహార శుద్ధి దిశగా కూడా మనం ముందడుగు వేసి తీరాలి. మన రైతులకు ఇప్పుడు అంతర్జాతీయ మార్కెట్లు అందుబాటులోకి వచ్చాయి. ఎఫ్‌టీఏల కారణంగా, మనం చాలా పెద్ద మార్కెట్లకు చేరుకోగలుగుతున్నాం. ఆ మార్కెట్లను మనం చేజిక్కించుకోవాల్సిందే. ఆ అవకాశాన్ని మనం సద్వినియోగపరుచుకోవాలి. పంట పొలం నుంచి ఎగుమతి మార్కెట్ వైపునకు మనం సాగాలి. మన సాంప్రదాయక ఆహార, పానీయాలు కావొచ్చు, మన సిరిధాన్యాలు కావొచ్చు, మన పండ్లు లేదా పూలు కావొచ్చు.. అనేకం మన దగ్గర ఉన్నాయి. ఇవన్నీ అంతర్జాతీయ బ్రాండ్లుగా రూపొందాలి. రసాయనాలను ఉపయోగించని పంటలపై మన రైతులు దృష్టిని కేంద్రీకరించాలి. ఎందుకంటే, ప్రపంచ వ్యాప్తంగా అలాంటి ఉత్పాదనలకే గిరాకీ అంతకంతకూ పెరుగుతోంది. మన వ్యవసాయ ఉత్పాదనలు ప్రతి విషయంలో ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా రూపొందితే, మనం సులభంగా అంతర్జాతీయ మార్కెట్లను మెప్పించగలుగుతాం.

## 3. సాంకేతికత - నూతన ఆవిష్కరణలు

నేను సూచిస్తున్న 'సప్త ధార'లో మూడో శక్తి విషయానికి వస్తే, ఆ శక్తి.. సాంకేతిక విజ్ఞానం, నూతన ఆవిష్కరణలు. నేడు కృత్రిమ మేధ, క్వాంటం టెక్నాలజీ, అంతరిక్షం, రోబోటిక్స్. డేటా సెంటర్ల యుగం నుడుస్తోంది. ఒక సరికొత్త రంగం

ఆవిష్కృతమైంది. అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు ప్రతి క్షణం మనకు సవాళ్లు విసురుతున్నాయి. అందువల్ల మనం మన దేశాన్ని కేవలం ప్రపంచానికి ఒక మార్కెట్‌గా మార్చడమే కాకుండా, ఆవిష్కరణలకు కేంద్రంగా మారాలి. యూపీఐ, డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాల ద్వారా మనం ఇప్పటికే మన సామర్థ్యాలను నిరూపించుకున్నాం. మన శక్తి ఏంటో ప్రపంచానికి చాటిచెప్పాం. ఇప్పుడు భారత్ తన డిజిటల్ ప్రజా సాంకేతికతలను ప్రపంచంలోని నలుమూలలకూ తీసుకెళ్లాలి. తదుపరి తరం కమ్యూనికేషన్ సాంకేతికతలలో భారత్ అగ్రగామిగా నిలవాలి. మేడ్ ఇన్ ఇండియా 6జీ సేవలు ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి వచ్చేలా చూడటమే మన లక్ష్యం కావాలి. ఈ దిశగా మన ప్రయత్నాలను వేగవంతం చేయాలి. ఈ నిబద్ధత ఎప్పటికీ తగ్గకూడదు.

**4. గతిశక్తితో అనుసంధానం**

సప్తధారలో నాలుగో బలం గతి శక్తి. గతి శక్తి కింద దేశవ్యాప్తంగా వేగవంతమైన, అంతరాయం లేని అనుసంధానంపై దృష్టి సారించాలి. హై స్పీడ్ రైళ్ల ద్వారా మన నగరాలను అనుసంధానించాలి. ఆధునిక జాతీయ రహదారులు, అంతర్గత జలమార్గాలు, విమానాశ్రయాలు, బహుళ రవాణా వ్యవస్థలు మనకు అత్యవసరం. మన నౌకాశ్రయాలను కేవలం సరకులు దిగుమతి, ఎగుమతి చేసుకునే లేదా నౌకలు నిలిపే ప్రాంతాలుగా మాత్రమే చూడకూడదు. ఓడరేవుల ఆధారిత అభివృద్ధి దిశగా మన నౌకాశ్రయాలను ముందుకు తీసుకెళ్లాలి.

**5. రక్షణ సాంకేతికతలో నాయకత్వం**

సప్తధారలో ఐదో బలం, రక్షా శక్తి (రక్షణ రంగ బలం). అన్నివిధాలా ఈ రక్షా శక్తి ప్రాముఖ్యత అత్యంత అపారమైనది. రక్షణ రంగంలో స్వయంసమృద్ధి సాధించడానికి ప్రత్యామ్నాయం లేదని భారత్‌తో పాటు ప్రపంచం కూడా అనుభవపూర్వకంగా గ్రహించింది. ప్రపంచ దేశాలన్నీ తమ సొంత ప్రయోజనాల గురించే ఆలోచిస్తున్న తరుణంలో, భారత్ కేవలం ఒక మార్కెట్‌గా మిగిలిపోలేదు. రక్షణ రంగంలో మనం సంపూర్ణ ఆత్మనిర్భరతను సాధించాలి. తదుపరితరం రక్షణ సాంకేతికతలను అభివృద్ధి చేస్తూ, ప్రపంచానికి రక్షణ పరికరాలను సరఫరా చేసే స్థాయికి ఎదగడమే మన లక్ష్యంగా పెట్టుకోవాలి. డ్రోన్లు, కౌంటర్ డ్రోన్ వ్యవస్థలను సొంతంగా అభివృద్ధి చేసుకోవడంతో పాటు, హైపర్ సోనిక్ రక్షణ సాంకేతికతల్లో భారత్ నాయకత్వం వహించాలి. నేడు ప్రతి ఇంట్లోనూ సైబర్ భద్రత ఒక ప్రధాన ఆందోళనకర అంశంగా మారుతోంది. ఇది కూడా రక్షణ రంగంలో ఒక భాగమే. ఇందులో మన యువత నైపుణ్యాలను దేశం, ప్రపంచ సంక్షేమం కోసం వినియోగించుకోవచ్చు.

**6. హరిత-సముద్ర ఆర్థిక వ్యవస్థ**

మన సప్తధారలో ఆరో బలం హరిత ఆర్థిక వ్యవస్థ, సముద్ర ఆర్థిక వ్యవస్థ. ఇవి పర్యావరణహిత ఉద్యోగాలను సృష్టిస్తాయి. హరిత హైడ్రోజన్, పునరుత్పాదక ఇంధనం, శక్తి నిల్వ, హరిత రవాణా, హరిత తయారీ రంగాలలో మనం అంతర్జాతీయ స్థాయిలో విజయాలను సాధించాలి. ప్రపంచం వాతావరణ మార్పు గురించి చర్చలు జరుపుతున్న సమయంలో, భారత్ వాటికి పరిష్కారాలను అన్వేషిస్తూ, సమాధానాలు ఇస్తోంది. హరిత విప్లవంలో భారత్ అపారమైన సామర్థ్యంతో ఈ ప్రయాణాన్ని ప్రారంభించింది. అలాగే బ్లూ ఎకానమీలో (సముద్ర ఆర్థిక వ్యవస్థ) కూడా భారత్‌కు అపారమైన అవకాశాలు ఉన్నాయి. మనకు సుదీర్ఘమైన సముద్ర తీరం ఉంది. మత్స్య రంగం, తీరప్రాంత పర్యాటకం, సముద్ర సాంకేతికత వంటి అనేక రంగాలలో అద్భుతమైన అవకాశాలు ఉన్నాయి. వీటి ద్వారా మనం మరింత వేగంగా ముందుకు సాగవచ్చు.

**7. ఆధ్యాత్మిక, సాంస్కృతిక శక్తి**

భారత్ సప్తధార దార్శనికతతో ముందుకు సాగుతున్న వేళ ఏడో ధార ప్రపంచానికి అత్యంత ప్రాముఖ్యమైనది. అదే దేశ 'సాఫ్ట్ పవర్' (ఆధ్యాత్మిక, సాంస్కృతిక బలం). మన సాఫ్ట్ పవర్ సామర్థ్యం అత్యంత అపారమైనది. నేడు యోగా ప్రపంచాన్ని భారత్‌తో అనుసంధానించింది. యోగా ప్రపంచానికి శక్తి మూలంగా మారడమే కాకుండా, ప్రజలకు భారత్‌పై నమ్మకం పెరగడానికి ఒక ముఖ్య కారణమైంది. భారత్‌లో అనేక ఆధ్యాత్మిక క్షేత్రాలు, ఆయుర్వేదం, సమగ్ర వైద్య విధానం ఉన్నాయి. వీటితో పాటు 'హీల్ ఇన్ ఇండియా' ఉద్యమం ద్వారా మన నైపుణ్యాలను ప్రపంచానికి తీసుకెళ్లవచ్చు. చేతివృత్తులు, సంస్కృతి, మన సినిమాలు, సృజనాత్మక రంగం, వీఎఫ్ఎక్స్, యానిమేషన్, గేమింగ్ లేదా డిజిటల్ కంటెంట్ ఏదైనా సరే... అంతర్జాతీయ సృజనాత్మక ఆర్థిక వ్యవస్థలో భారత్ తన ఉనికిని సగర్వంగా చాటుకోగలదు. దీనిని ఒక ప్రపంచ శక్తిగా తీర్చిదిద్దాలి. నేడు వేవ్స్ సదస్సుకు భారత్ అద్భుతమైన వేగాన్ని అందించింది. ఇప్పుడు భారత్ నిర్వహించే ఈ ప్రపంచ ఆడియో విజువల్, వినోద సదస్సు కోసం ప్రపంచం ఆసక్తిగా ఎదురు చూస్తోంది. ఇది భారత సాఫ్ట్ పవర్‌ను, సృజనాత్మక రంగాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తుంది. దేశంలో అపారమైన అటవీ సంపద ఉంది. మన వద్ద 100 కంటే ఎక్కువ జాతీయ పార్కులు ఉన్నాయి. మన సామర్థ్యం ఎంతో గొప్పది, కానీ విదేశీ పర్యాటకులను ఆకర్షించే విషయంలో మనం ఇప్పటివరకు అనుకున్నంత స్థాయిలో విజయం సాధించలేకపోయాం. మన సాఫ్ట్ పవర్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న పర్యాటకులను భారత్‌కు ఆకర్షించే గొప్ప అవకాశం మనకుంది. మన నైపుణ్యాలను, అందాలను ప్రపంచానికి చాటిచెప్పాలి. ఈ దిశగా అత్యంత వేగంగా చర్యలు చేపట్టాలి. నేడు క్రీడలు కూడా భారత్ వైపు ప్రపంచాన్ని ఆకర్షించే ప్రధాన వేదికగా మారుతున్నాయి. అంతర్జాతీయ స్థాయి పెద్ద పెద్ద క్రీడా పోటీలు భారత్‌లోనే ఎందుకు జరగకూడదు? సంగీత కచేరీల రంగం వేగంగా ఎదుగుతోంది. ఇది దేశ యువతను విశేషంగా ఆకట్టుకుంటోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ కళాకారులు ఏదో ఒక సమయంలో భారత గడ్డపై తమ ప్రదర్శన ఇవ్వాలని కోరుకుంటున్నారు. ఇది ఒక పెద్ద అవకాశం. ఈ అవకాశాన్ని అంది పుచ్చుకోవడానికి కావలసిన మౌలిక వసతులను, వ్యవస్థలను మనం నిర్మించుకోవాలి. సప్తధారలోని ఈ ఏడు బలాలు కేవలం ఒక్కో రంగానికి



పరిమితమైన పురోగతి మాత్రమే కాదు. ఒక సమగ్ర విధానంతో, మనం దేశం కోసం నిర్దేశించుకున్న లక్ష్యాలను, ఆశయాలను మించి సాధించే దిశగా కృషి చేయాలి.

**ఫార్చ్యూన్ 500 జాబితాలో మన స్థానం**

మనం తరచుగా 'ఫార్చ్యూన్ 500' కంపెనీల గురించి వింటూ ఉంటాం. రాబోయే దశాబ్ద కాలంలో ఈ ఫార్చ్యూన్ 500 జాబితాలో 50 కంపెనీలు మన భారత్ నుండే ఎందుకు ఉండకూడదు? అనేది మన లక్ష్యంగా మారాలి. నేడు మన బ్యాంకింగ్ రంగం ఎంతో ప్రగతిపథంలో పయనిస్తోంది. ప్రపంచంలోని అగ్రశ్రేణి బ్యాంకుల సరసన ఒక భారతీయ బ్యాంకు జెండా ఎందుకు ఎగరకూడదు? ప్రపంచంలోనే అత్యుత్తమ 5 బ్యాంకుల జాబితాలో కనీసం ఒక భారతీయ బ్యాంకు

తప్పకుండా స్థానం సంపాదించాలి. అలాగే దేశ ఔషధ రంగం ఇప్పటికే గణనీయమైన ప్రగతిని సాధించింది. అయితే ప్రపంచంలోని 5 అతిపెద్ద ఔషధ కంపెనీల జాబితాలో ఒకటి లేదా రెండు భారతీయ కంపెనీల పేర్లు మార్మోగడమే నేటి సమయపు ప్రధాన డిమాండ్. భారత్ అక్కడ తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సుస్థిరం చేసుకోవాలి. ఇక అంతర్జాతీయ లా సంస్థలు, రేటింగ్ ఏజెన్సీలు ఉన్నాయి. వీటిలో ప్రపంచ నాయకత్వం ఇప్పుడు మన చేతుల్లోకి రావాల్సిన అవసరం లేదా? మన దగ్గర తగినంత నైపుణ్యం ఉంది. సామర్థ్యం ఉంది. సుదీర్ఘమైన నిరూపితమైన చరిత్ర ఉంది. విభిన్న భాషలపై పట్టు ఉంది. మనం కచ్చితంగా ప్రపంచ స్థాయికి చేరుకోవాలి. ప్రపంచంలోని అగ్రగామి సంస్థలలో ఒక భారతీయ కన్సల్టింగ్ లేదా



అకౌంటింగ్ సంస్థ ఎందుకు ఉండకూడదు? మన సాంకేతిక కంపెనీలు ప్రపంచానికే నాయకత్వం వహించాలి. అది మాత్రమే మన ప్రధాన ధ్యేయం కావాలి. ప్రపంచాన్ని ఆకర్షించే బ్రాండ్లు మన దగ్గర ఉండాలి. మన బ్రాండ్లు మన దేశానికి గుర్తింపుగా మారి, భారత్‌ను ప్రపంచానికి ఒక ప్రధాన గమ్యస్థానంగా తీర్చిదిద్దాలి. మనం ఆ దిశగా నిరంతరం శ్రమించాలి. ఈ లక్ష్య సాధన కోసం నేను రాష్ట్ర ప్రభుత్వాలకు, స్థానిక స్వపరిపాలన సంస్థలకు విజ్ఞప్తి చేస్తున్నాను. అలాగే ఇది భారత ప్రభుత్వ బాధ్యత కూడా, మనం మన సంస్కరణల వేగాన్ని మరింత పెంచాలి. 2047 నాటి వికసిత భారత్ లక్ష్యానికి అనుగుణంగా మన వ్యవస్థలను వేగంగా అభివృద్ధి చేసుకోవాలి. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు, పారిశ్రామిక రంగం.. అన్నీ కలిసికట్టుగా పనిచేస్తూ ముందుకు నడవాలి.

**యువతకు పెద్ద పీట**

నేను వికసిత భారత్ గురించి మాట్లాడినా, దేశాన్ని వేగవంతమైన పురోగతి వైపు నడిపించడం గురించి మాట్లాడినా – ఈ ప్రయత్నాలన్నింటి ద్వారా అత్యంత లబ్ధి పొందేది ఎవరు? ఈ శ్రమను నడిపించే అతిపెద్ద శక్తి ఎవరు? వారు ఎవరో కాదు, మన దేశ యువతే. దేశ యువశక్తే. వికసిత భారత్ వైపు సాగుతున్న ఈ ప్రయాణంలో యువత వహించాల్సిన పాత్ర అత్యంత కీలకమైనది. అంతేకాదు, వికసిత భారత్ ద్వారా అత్యధిక ప్రయోజనం పొందేది కూడా నా దేశ యువతే. కాబట్టి, మన యువత ఆకాంక్షలు, భాగస్వామ్యాన్ని జోడిస్తూ వికసిత భారత్ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లాలి. యువతకే అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ మనం ముందుకు సాగాలి. గడిచిన 10,12 ఏళ్లలో ఈ దిశగా ఎంతో పురోగతి సాధించాం.

**అందరికి అందుబాటులో అంతరిక్షం**

స్టార్టప్ ఇండియా కింద ప్రస్తుతం దేశవ్యాప్తంగా 2.5 లక్షలకు పైగా రిజిస్టర్డ్ స్టార్టప్‌లు అందుబాటులోకి వచ్చాయి. మన దేశ యువత తమ కోసం తాము పని చేయడమే కాకుండా మరెంతో మందికి ఉపాధి అవకాశాలను కూడా కల్పిస్తున్నారు. పరిశోధనలు, ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం రూ. లక్ష కోట్లతో కార్పస్ ఫండ్‌ను ప్రకటించింది. నేను దేశ యువతకు ఒకటే చెప్పాలనుకుంటున్నాను: మీ కలలతో ముందుకు రండి. మీకు వనరుల కొరత లేకుండా మేం చూసుకుంటాం. మీ ఆలోచనలకు, సంకల్పాలకు మరింత బలాన్ని చేకూర్చేందుకు రూ. లక్ష కోట్లతో ఒక బలమైన వ్యవస్థను అందుబాటులోకి తెచ్చాం. పరిశోధనల కోసం నూతన అవకాశాలు వెలువడ్డాయి. డిజిటల్ ఇండియా ద్వారా అందుబాటులోకి వచ్చిన చవకైన డేటా మన యువ శక్తిని మరింత సాధికారత వైపు నడిపించింది. స్కిల్ ఇండియాను ఒక జాతీయ కార్యక్రమంగా తీర్చిదిద్దాం. అంతరిక్ష రంగాన్ని అందరికీ అందుబాటులోకి తెచ్చాం. జాతీయ డ్రోన్ విధానాన్ని రూపొందించాం. ఖేలో ఇండియా విధానాన్ని తీసుకొచ్చాం. 35 ఏళ్లుగా ఎలాంటి నూతన విద్యా విధానం లేదు. మేం నూతన విద్యా విధానాన్ని అమలులోకి తెచ్చాం. దీని ద్వారా మధ్యతరగతి కుటుంబాలు ఎంతో ప్రయోజనం పొందాయి.

**వెయ్యి విశ్వవిద్యాలయాలు స్థాపిద్దాం**

2004 నుంచి 2014 మధ్యకాలానికి సంబంధించిన వివరాలను నేను మీకు అందించాలి. 2004 నుంచి 2014 వరకు మన దేశంలో 350 లోపు విశ్వవిద్యాలయాలు మాత్రమే ఉండేవి. కానీ ఈ రోజు, ఈ 10, 12 ఏళ్ల కాలంలోనే దాదాపు 650 కొత్త విశ్వవిద్యాలయాలు అందుబాటులోకి వచ్చాయి. మనం 1,000 మార్కును చేరుకునే దిశగా పయనిస్తున్నాం. 2014కు ముందు కేవలం 400 వైద్య కళాశాలలు (మెడికల్ కాలేజీలు) మాత్రమే ఉండగా, నేడు ఆ సంఖ్య దాదాపు 850కి చేరుకుంది. అంతేకాదు, విదేశీ విశ్వవిద్యాలయాలు కూడా ఇప్పుడు భారత్‌కు వస్తున్నాయి. మన యువత భారత్‌లోనే ఉంటూ విదేశీ విశ్వవిద్యాలయాల డిగ్రీలను పొందేలా ఏర్పాట్లు చేశాం. మన దేశంలోని యువత చిన్ననాటి నుంచే సాంకేతికత వైపు ఆకర్షితులయ్యేలా చేయడానికి మేం కృషి చేస్తున్నాం. అందుకే 10,000కు పైగా అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను యువ విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చాం. తద్వారా వారిలో ఆవిష్కరణలు, సాంకేతికతపై ఆసక్తిని పెంపొందించవచ్చు. మేం అనేక అవకాశాలను కల్పించాం స్టార్టప్ రంగాన్ని కూడా అందుబాటులోకి తీసుకువచ్చాం. మన దేశంలోని సగటున 28 ఏళ్ల వయస్సున్న యువకులు నేతృత్వం వహిస్తున్న ప్రైవేట్ స్టార్టప్‌లు తమ స్వంత ఉపగ్రహాలను, రాకెట్లను ప్రయోగించి తొలి ప్రయత్నంలోనే విజయం సాధించడాన్ని మీరు చూసే ఉంటారు. ఈ ఘనత ద్వారా మన దేశ యువత అంతరిక్ష రంగంలో తమ సత్తా ఏంటో ప్రపంచానికి చాటిచెప్పారు. అంతరిక్ష రంగంలో మన యువత సాధిస్తున్న ఈ విజయాలు భారత భవిష్యత్తుకు సరికొత్త దిశానిర్దేశం చేస్తున్నాయి.

**కోటి మందికి కృత్రిమ మేధలో శిక్షణ**

నేడు దేశంలో 2.5 లక్షలకు పైగా గుర్తింపు పొందిన స్టార్టప్‌లు ఉన్నాయి. ఇటీవల మేం కృత్రిమ మేధ(ఏఐ) ఇంపాక్ట్ సమ్మిట్‌ను నిర్వహించాం. ఏఐ విస్తరణ అత్యంత వేగంగా జరుగుతోంది. దేశంలోని యువత కోసం ఎర్రకోట నుంచి నేను ఒక ప్రకటన చేయాలనుకుంటున్నాను. రాబోయే ఏడాది కాలంలో కోటి మంది యువతకు ఏఐ నైపుణ్యాల్లో శిక్షణ ఇవ్వాలని మేం నిర్ణయించాం. తద్వారా ఏఐ రంగంలో కూడా మన దేశ యువత ప్రపంచానికి నాయకత్వం వహించే సామర్థ్యాన్ని సొంతం చేసుకుంటారు.

**రూ.20 లక్షల కోట్లకు బయో ఎకానమీ**

బయోఎకానమీ ఒక నూతన రంగం. 2014 కంటే ముందు బయోఎకానమీ విలువ కేవలం రూ.60,000 కోట్లు మాత్రమే ఉండేది. నా దేశ యువజనులారా – మీరు సాధించిన ఘనతను ఒక్కసారి చూడండి. విధానాలు సరైనవిగా ఉండి, లక్ష్యాలు స్పష్టంగా ఉన్నప్పుడు యువత ఎలాంటి ఫలితాలను సాధించగలరో మీరు చూడవచ్చు. బయోఎకానమీ రంగంలో దేశ యువశక్తి తన సామర్థ్యాన్ని చాటిచెప్పింది. 2014కి ముందు ఈ రంగం టర్నోవర్ రూ. 60,000 కోట్లుగా ఉండగా,

నేడు బయోఎకానమీ విలువ రూ. 20 లక్షల కోట్లకు చేరింది. 2009-10లో కేవలం 1.5 లక్షల ఎలక్ట్రిక్ వాహనాలను మాత్రమే విక్రయించగా, 2025-26లో ఏకంగా 25 లక్షల ఎలక్ట్రిక్ వాహనాలు అమ్ముడయ్యాయి.

### డ్రోన్లతో 3.25 కోట్ల గ్రామీణ కుటుంబాలకు లబ్ధి

మేడ్-ఇన్ - ఇండియా విమానాల తయారీ దిశగా అడుగులు వేస్తూ మనం గొప్ప విజయాన్ని సాధించాం. స్వదేశీ సాంకేతికతతో తయారైన రక్షణ రవాణా విమానం 'సీ295' ఇప్పటికే నింగిలోకి ఎగిరి, విజయవంతంగా తన ప్రయోగాత్మక విమాన యానాన్ని పూర్తి చేసుకుంది. ఇది దేశ యువత సాధించిన ఒక మహత్తరమైన విజయం. డ్రోన్లు కూడా మన ప్రగతిలో అత్యంత కీలకమైన పాత్రను పోషించాయి. గ్రామాల్లో డ్రోన్ల ద్వారా స్వమిత్వ పథకం అత్యంత విజయవంతంగా అమలవుతోంది. ఈ పథకం ద్వారా దాదాపు 3.25 కోట్ల కుటుంబాలు ప్రయోజనం పొందాయి.

### పోటీ పరీక్షార్థులకు ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ

కోచింగ్ క్లాసుల భారం మన మధ్యతరగతి కుటుంబాలకు ఒక పెద్ద సమస్యగా మారింది. తమ పిల్లలను కోచింగ్ క్లాసులకు పంపకపోతే సమాజ ఆకాంక్షలకు అనుగుణంగా నడుచుకోవడం లేదేమోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ పేద, మధ్యతరగతి కుటుంబాల ఆందోళనలను దృష్టిలో ఉంచుకుని, వారు వెచ్చిస్తున్న వేల కోట్ల రూపాయలను ఆదా చేయాలని, వారి పిల్లలు ఇళ్లకు దగ్గరగానే ఉంటూ, సరైన సంరక్షణ పొందేలా చూడాలని, కుటుంబంపై ఆర్థిక భారం పడకుండా నివారించాలని మేం భావిస్తున్నాం. అందుకే, వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత కోసం ఉచిత ఆన్‌లైన్ కోచింగ్‌ను అందించాలని మేం నిర్ణయించాం.

మన వద్ద డిజిటల్ మౌలిక సదుపాయాలు ఉన్నాయి. అద్భుతమైన నైపుణ్యం కలిగిన ప్రతిభావంతులు ఉన్నారు. మంచి ఉపాధ్యాయులు ఉన్నారు. ఈ వనరులన్నింటినీ సమన్వయం చేయడం ద్వారా దేశంలోని యువతకు ఉచిత శిక్షణను అందించడానికి మేం ఒక విస్తృతమైన వ్యవస్థను నిర్మించనున్నాం.

### ఒలింపిక్స్‌లో ఆడేవారికి స్వాగతం

ప్రపంచవ్యాప్తంగా జరిగే ఒలింపిక్ క్రీడల్లో సుమారు 40 రకాల క్రీడలు, దాదాపు 325 నుంచి 350 విభాగాలు ఉంటాయి. ఈ 325కు పైగా విభాగాల్లో దాదాపు మూడింట రెండొంతుల క్రీడా విభాగాల్లో భారత్ అసలు పాల్గొనడం లేదు. మనం అక్కడ ఉండటం లేదు. అర్హత సాధించలేక పోతున్నాం. నేను మీకు సవాల్ విసురుతున్నాను. మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాను. మీ మద్దతును కోరుతున్నాను. 2036 ఒలింపిక్స్‌ను భారత్‌లో



నిర్వహించాలని నిర్ణయించాం. 2036 నాటికి, ప్రస్తుతం భారత్ పాల్గొనని లేదా అర్హత సాధించని క్రీడా విభాగాల్లో, అలాగే భారత్ ఇప్పటివరకు దూరంగా ఉన్న ఈవెంట్లలో, నాలుగింట మూడు వంతుల అవకాశాలు మన కోసం ఎదురు చూస్తున్నాయి. భారత్ ఈ రంగాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. ఇందుకోసం ప్రతిభా అన్వేషణ కార్యక్రమాన్ని కూడా ప్రారంభించాలని భావిస్తున్నాం. 2036లో మనకు క్రీడాకారులు కావాలంటే, నేడు 5, 10 లేదా 15 ఏళ్ల వయసున్న బాలబాలికలపై దృష్టి సారించాలి. మన ఆడపిల్లలపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలి. అందువల్ల దేశవ్యాప్తంగా గ్రామాలు, పట్టణాలు, పాఠశాలల్లో 5 నుంచి 15 ఏళ్ల వయసున్న చిన్నారుల్లో క్రీడా ప్రతిభను గుర్తించేందుకు ప్రతిభా అన్వేషణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నాం. వారి సామర్థ్యాలను అంచనా వేసి వారికి ప్రత్యేక శిక్షణ అందిస్తాం. తద్వారా వారిని దేశానికి ప్రాతినిధ్యం వహించగల ప్రతిభావంతులైన క్రీడాకారులుగా తీర్చిదిద్దుతాం.

### మాదక ద్రవ్య రహిత భారత్ సాధిద్దాం

మాదకద్రవ్యాల దుర్వినియోగం మన దేశానికి, యువతకు పెద్ద ముప్పుగా మారుతోంది. 'నషా ముక్త్ భారత్' లేదా మాదకద్రవ్య రహిత భారత్ నిర్మాణం మనందరి ఉమ్మడి బాధ్యత కావాలి. మన ఉజ్వల భవిష్యత్తు కోసం యువతరం బలంగా ఉండాలి. యువశక్తిని దేశ ప్రగతి కోసం ఉపయోగించాలి. అందుకే ఇటీవల వై భారత్ వాలంటీర్లు, దేశవ్యాప్తంగా ఉన్న ఎన్జీవోలు, సామాజిక-సాంస్కృతిక సంస్థలు, ఆధ్యాత్మిక గురువులు అందరూ కలసి మాదకద్రవ్యాలు లేని భారత్ కోసం 100 వారాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ప్రచారం 100 వారాల పాటు సాగుతుంది. మీరు కూడా ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలి. ఇందులో చేరి నషా ముక్త్ భారత్ కలను నిజం చేయడానికి ముందుకు రావాలి అని ప్రతి కుటుంబానికి నేను చెబుతున్నాను.

### నక్సల్ రహిత నేలపై ముువన్నెల జెండా రెపరెపలు

దశాబ్దాలుగా వేధిస్తున్న సవాళ్లను సమూలంగా అంతం చేయడం ఈ 21 వ శతాబ్దంలో అత్యంత అవసరం. నక్సలిజం, మావోయిజం లక్షలాది యువత భవిష్యత్తును నాశనం చేశాయి. ఎందరో తల్లులకు గర్వకారణమైన బిడ్డల జీవితాలను నాశనం చేశాయి. తల్లిదండ్రుల కలలను ఛిద్రం చేశాయి. భారతదేశంలోని పెద్ద మొత్తంలో భూభాగాన్ని, పెద్ద సంఖ్యలో ప్రజలను నాలుగు దశాబ్దాల పాటు నక్సలిజం తన గుప్పిట్లో ఉంచుకుంది. రాజ్యాంగాన్ని తుంగలో తొక్కింది. దేశంలోని సామాన్య పౌరులను కాపాడే క్రమంలో 3,500 మందికి పైగా మన పోలీసు, భద్రతా సిబ్బంది వీరమరణం పొందారు. సామాన్య పౌరులు సురక్షితంగా జీవించేందుకు యుద్ధాల్లో వీరమరణం పొందిన సైనికుల కంటే ఎక్కువ మంది పోలీసు సిబ్బంది ప్రాణత్యాగం చేయాల్సి వచ్చింది. నక్సలిజం ఈ నేలను రక్తసిక్తం చేసింది. 2014లో మీరు మాకు సేవ చేసే అవకాశం ఇచ్చినప్పుడే ఈ దేశానికి నక్సలిజం నుంచి విముక్తి కల్పించాలని సంకల్పించుకున్నాం. ఈ రోజు నక్సలైట్-మావోయిస్ట్ హింసకు చివరి శ్వాస తీసుకునే శక్తి కూడా లేదని చెప్పడానికి సంతోషిస్తు న్నాను. దాన్ని పూర్తిగా తుడిచిపెట్టే దిశగా ముందుకు సాగుతున్నాం. ఒకప్పుడు నక్సలైట్లు తుపాకులు పేల్చి నేలను రక్తంతో తడిపిన అదే ప్రాంతాల్లో, వారి ప్రభావం తొలగిపోవడంతో ఇప్పుడు అభివృద్ధి, విశ్వాసం, సంకల్పాల మువ్వన్నెల జెండా రెపరెపలాడుతోంది.

**దిమాగి నక్సల్స్‌తో తస్మాత్ జాగ్రత్త**

మావోయిజం లేదా నక్సలిజం సమస్యను మనం తక్కువగా అంచనా వేయకూడదు. దీని విషయంలో మనం మరింత అప్రమత్తంగా ఉండాలి. ఎన్నో ఏళ్లుగా మావోయిస్టు భావజాలం ఉన్న వ్యక్తులు దేశ అధికార వ్యవస్థల్లోకి చొరబడ్డారు. ప్రభుత్వ కమిటీల్లో సలహాదారులుగా కూడా ఉన్నారు. ఈ మావోయిస్టు భావజాలం విధాన నిర్ణయాలను కూడా ప్రభావితం చేసింది. అడవుల నుంచి సాయుధ నక్సలైట్లను తొలగించడంలో, ఈ ముప్పు నుంచి దేశానికి విముక్తి కల్పించడంలో మనం విజయం సాధించాం. అయితే, సాయుధ నక్సలైట్లు లేకపోయినా, మానసికంగా నక్సలైట్లుగా ఉన్నవారు(దిమాగి నక్సల్స్) ఇంకా మిగిలే ఉన్నారు. వారు అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. హింసకు, అరాచకానికి మార్గాలను వెతుకుతున్నారు. సమాజాన్ని తప్పుదారి పట్టించేం దుకు రకరకాల ఎత్తుగడలు వేస్తున్నారు. మనం ఇలాంటి వారిని గుర్తించి, వేరుచేసి, భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే ప్రధాన ప్రయత్నం దిశగా దేశ యువతను ముందుకు నడిపించాలి.

**యుద్ధాల స్వభావంలో మార్పు**

సురక్షితమైన భారతదేశాన్ని నిర్మించడం మనందరి బాధ్యత. సమస్య సరిహద్దుల లోపల ఉన్నా లేదా వెలుపల ఉన్నా, ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు భారత్ సిద్ధంగా ఉంది. ప్రస్తుతం యుద్ధాల స్వభావం మారుతోంది. ఇక మీదట ఘర్షణలు సరిహద్దులకే పరిమితమవుతాయనే హామీ లేదు. ఆధునిక యుద్ధాలు చమురు శుద్ధి కర్మాగారాలను, బ్యాంకింగ్ రంగం లేదా డేటా సెంటర్లను లక్ష్యంగా చేసుకోవచ్చు. ఒక రకంగా ఇది మౌలిక సదుపాయాలు, కర్మాగారాలను నాశనం చేసే సరికొత్త పోరాట రూపం. కొన్నేళ్ల క్రితం మనం 'మిషన్ సుదర్శన్ చక్ర'ను ప్రకటించాం. దానికి సంబంధించిన పనులు వేగంగా ముందుకు సాగుతున్నాయి.

**దేశ భద్రతకు భారీ పౌర రక్షణ బలగం**

ఇప్పుడు మన రక్షణ రంగ ఎగుమతులు దాదాపు 50 రెట్లు మేర పెరిగాయి. మన రక్షణ ఆయుధాలు సుమారు 100 దేశాలకు చేరుతున్నాయి. ప్రపంచ వేదికపై భారతదేశ పరపతి క్రమంగా పెరుగుతోంది. మారుతున్న ఈ కాలంలో మనం రక్షణ పరికరాలపై దృష్టి సారించాలి. మన సాయుధ దళాల సామర్థ్యాలను పెంచాలి. అదే సమయంలో పౌరులు కూడా సన్నద్ధంగా ఉండాలి. గత శతాబ్దపు యుద్ధాలకు అనుగుణంగా మన దేశంలో రూపొందించిన పౌర రక్షణ వ్యవస్థలు కాలం చెల్లిపోయాయి. అందుకే రానున్న రోజుల్లో ఒక పటిష్టమైన పౌర రక్షణ వ్యవస్థకు శ్రీకారం చుట్టనున్నామని ఈ రోజు ఎర్రకోట నుంచి ప్రకటిస్తున్నాను. ఆధునిక వ్యవస్థలపై వారికి అవగాహన కల్పిస్తాం. ఆధునిక సంక్షోభాల నుంచి పౌరులను రక్షించడానికి ఎలాంటి ఏర్పాట్లు చేయొచ్చు? ఆధునిక సవాళ్లను అధిగమించడానికి ఒక భారీ స్వచ్ఛంద పౌర రక్షణ బలగాన్ని ఏర్పాటు చేయనున్నాం.

**మహిళలకు 33 శాతం కోటా ఇద్దాం**

నేడు పంచాయతీలు, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో పెద్ద సంఖ్యలో మహిళలు ప్రజాప్రతినిధులుగా మారుతున్నారు. దేశాన్ని నడిపిస్తూ, సమస్యలను పరిష్కరిస్తూ ఎంతో సమర్థ వంతమైన నాయకత్వాన్ని అందిస్తున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకునే మేము పార్లమెంటులో నారీ శక్తి వందన్ చట్టాన్ని ఆమోదింపజేశాం. అయినప్పటికీ, గత 40 ఏళ్లుగా ఈ కల పదేపదే రాజకీయ కారణాలతో వాయిదా పడుతూ వస్తోంది. ఈ రోజు ఎర్రకోట బురుజులపై, త్రివర్ణ పతాకం నీడలో నిల్చుని, దేశంలోని అన్ని రాజకీయ పార్టీలనూ నేను వేడుకుంటున్నాను. రండి... స్త్రీశక్తి ఆరాధకులుగా మారదాం. వారి గౌరవాన్ని కాపాడేందుకు ముందుకు వద్దాం. భారతదేశ విధానాలను రూపొందించడంలో భాగస్వామ్యం పంచుకొనేలా శాసనసభలు, లోక్‌సభలో మన మాతృమూర్తులు, సోదరీమణులకు వీలైనంత త్వరగా 33% ప్రాతినిధ్యం దక్కేలా చూద్దాం. ఇది నేటి అవసరం. మరోసారి అన్ని రాజకీయ పార్టీలనూ నేను కోరుతున్నాను. మహిళా రిజర్వేషన్లను అమలు చేయడం ద్వారా వారి గౌరవాన్ని కాపాడటంలో భాగస్వాములు కండి. ఆ ఘనతను మీరే తీసుకోండి, ఆ కీర్తిని మీరే పొందండి, కానీ నా మాతృమూర్తులు, సోదరీమణులకు వారి హక్కులను అందించండి.

**జనగణనలో యువత పాత్ర**

సాంకేతికత అందుబాటులోకి రావడంతో, మీ జనాభా లెక్కల వివరాలను మీరే మొబైల్ ఫోన్ ద్వారా నమోదు చేసుకునే వెసులుబాటు కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నాం. తర్వాత ఎవరైనా ఉద్యోగి లేదా ప్రతినిధి వచ్చి మీతో ఆ వివరాలను చర్చిస్తారు. మీ కుటుంబం అంతా కలిసి కూర్చుని, స్పెల్లింగ్‌లో గానీ లేదా సమాచారంలో గానీ ఎలాంటి తప్పులు లేకుండా డిజిటల్ పద్ధతిలో నమోదు చేసినట్లయితే ఆ కచ్చితమైన సమాచారం దేశ ప్రగతికి ఎంతగానో ఉపయోగపడుతుంది. అందుకే దేశ యువత తమ కుటుంబాలతో కలిసి కూర్చుని, సంబంధిత ఫారాన్ని పూర్తిగా అర్థం చేసుకోవాలని కోరుతున్నాను. మొదట కాగితంపై రాసి చూసుకోండి. ఏవైనా తప్పులుంటే సరిదిద్దుకొని, ఆ తర్వాత సాంకేతికత ద్వారా డిజిటల్‌గా అప్‌లోడ్ చేయండి. ఒక్కసారి ఆలోచించండి. దేశం ఈ బృహత్తర కార్యాన్ని పూర్తి



చేస్తుంది. దేశ సమయం, శ్రమ ఒక నిర్మాణాత్మక ప్రయోజనం కోసం ఉపయోగపడుతుంది. అందుకే నా దేశ యువత ఈ జనాభా లెక్కల సేకరణ ప్రక్రియలో చురుగ్గా పాల్గొనాలని కోరుతున్నాను. మీరు కేటాయించే ఒకటి రెండు గంటల సమయమే దేశానికి ఎంతో బలాన్ని చేకూరుస్తుంది.

**బానిస మనస్తత్వాన్ని వదలించుకుందాం**

నేను ఎర్రకోట నుంచి (గత సంవత్సరం) 'పంచ ప్రాణ్' (అయిదు ప్రతిజ్ఞలు) గురించి మాట్లాడాను. ఈ అయిదు ప్రతిజ్ఞలు దేశానికి అపారమైన బలాన్ని అందించాయి. ఆత్మగౌరవంతో ముందుకు సాగడానికి, నిర్దేశించుకున్న లక్ష్యాలను అధిగమించే సామర్థ్యాన్ని సాధించడానికి దేశాన్ని శక్తిమంతం చేశాయి. బానిస మనస్తత్వాన్ని మనం ప్రతి క్షణం నిర్మూలిస్తూనే ఉండాలి. నేతాజీ సుభాష్ చంద్రబోస్, బాబాసాహెబ్ అంబేద్కర్, పండిట్ నెహ్రూ, సర్దార్ పటేల్, భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు, డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ, భగవాన్ బిర్సాముండా, జ్యోతీరావ్‌పూలే కలలుగన్న భారతదేశ దృక్పథం నుంచి స్ఫూర్తి పొందుతూ మనం ముందుకు సాగుదాం. మన స్వప్రయోజనాల కంటే దేశ ప్రయోజనమే ప్రాధాన్యం కావాలన్న, కర్తవ్య నిర్వహణే మన గుర్తింపు కావాలన్న సంకల్పాన్ని మరోసారి పునరుద్ఘాటిద్దాం. దేశప్రజలందరికీ నేను చెప్పేది ఒక్కటే. ఇది మన సమయం. ఇది మనకు లభించిన సువర్ణావకాశం. ఇది మన సంకల్పం. కలలను సంకల్పంగా, సంకల్పాన్ని శక్తిగా, శక్తిని విజయంగా మలుచుకుందాం. ప్రతి అడుగునూ అభివృద్ధి దిశగా వేద్దాం, అడుగులో అడుగు వేద్దాం. మనసులను ఏకం చేద్దాం. లక్ష్యం వైపు దృష్టి సారిద్దాం. ఒక దీపం వేల దీపాలను వెలిగిస్తుంది. అందరం కలిసి వికసిత భారత్‌ను నిర్మిద్దాం. ★

# కశ్మీరీ పండిట్ల

**ప్రశాంతంగా ఉన్న జమ్మూ కశ్మీర్‌లో మళ్లీ చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నాయి ఉగ్రవాద సంస్థలు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలతో హిందూ పండిట్ల కుటుంబాలు తమ స్వస్థలాలకు రావడాన్ని ఉగ్రవాదులు, వారి సానుభూతి పరులు జీర్ణించుకోలేకపోతున్నారు. మూడు దశాబ్దాలకు పైగా తాము నిర్మించుకున్న ఆజాదీ పేకమేడలు కూలిపోవడాన్ని తట్టుకోలేకపోతున్నారు. ఈ క్రమంలో ఉద్యోగులైన కొందరు పండిట్‌లను బెదిరిస్తూ లేఖను విడుదల చేసింది లష్కరే తోయిబా ముసుగు సంస్థ యూఎల్‌సీ. ఈ నేపథ్యంలో ఉద్యోగుల భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది.**

2019 ఆగస్టు 5న ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూ కశ్మీర్‌లో వచ్చిన అద్భుత మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. జమ్మూ కశ్మీర్, లడఖ్ ప్రాంతాలను కేంద్రపాలిత ప్రాంతాలుగా విడదీసిన తర్వాత దేశంలోని అన్ని ప్రాంతాలతో సమాన హోదాను పొందాయి. భారత రాజ్యాంగం పూర్తి స్థాయిలో వర్తింపజేయడం, ప్రత్యేక జెండా రద్దు, కేంద్ర చట్టాల అమలు, శాంతిభద్రతలు మెరుగవడం, పర్యాటకరంగ వికాసం, మౌలిక వసతులు అభివృద్ధి చెందడం వంటి కీలక మార్పులు వచ్చాయి. దేశంలోని ఇతర రాష్ట్రాల ప్రజల మాదిరిగానే కశ్మీర్ లోనూ అందరికీ సమాన హక్కులు, ఆస్తులు కొనుగోలు చేసే వెసులుబాటు, మహిళలకు సమాన ఆస్తి హక్కులు దక్కాయి.

**అభివృద్ధి పథంలో..**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పారిశ్రామిక విధానాలు, భారీ పెట్టుబడుల వల్ల ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరిగాయి. ప్రైవేట్ పెట్టు బడులు, పర్యాటకరంగం పుంజుకోవడం, ప్రభుత్వ నియామకాల ద్వారా స్థానిక యువతకు విస్తృత అవకాశాలు లభిస్తున్నాయి. జమ్మూ కశ్మీర్‌కు దాదాపు రూ. 80,000 కోట్ల విలువైన పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయి. గడిచిన కొన్ని ఏళ్లలోనే దాదాపు రూ.15,000 కోట్ల మేర ప్రైవేట్ పెట్టుబడులు క్షేత్రస్థాయిలో అమలయ్యాయి, దీని ద్వారా సుమారు 65,000మందికి పైగా యువతకు పారిశ్రా మిక రంగంలో నేరుగా ఉద్యోగాలు లభించాయి. జమ్మూ కశ్మీర్ సర్వీసెస్ సెల క్షన్ బోర్డ్ ద్వారా దాదాపు 36,000 పైగా ప్రభుత్వ ఉద్యోగాలను పారదర్శకంగా భర్తీ చేశారు. అదనంగా ప్రభుత్వ విభాగాల్లో అవసరమైన సేవలకు వివిధ కంపెనీల ద్వారా వేలాది పోస్టులను అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేస్తున్నారు. యువతను కేవలం ఉద్యోగాలు కోరుకునేవారిగా కాకుండా, ఉద్యోగాలు ఇచ్చేవారిగా మార్చడానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు, లోన్ గ్యారెంటీలను అందిస్తోంది.

**మహిళా సాధికారత**

మహిళలు నేతృత్వం వహించే స్టార్టప్‌లకు, స్వయం సహాయక సంఘాలకు సబ్సిడీలతో కూడిన రుణాలు ఇస్తుండటంతో గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఉపాధి పెరిగింది. జమ్మూ కశ్మీర్ పర్యాటక రంగం కూడా కొత్త పుంతలు తొక్కుతోంది. రాష్ట్రంలో శాంతియుత వాతావరణం ఏర్పడటంతో ఏటా 2 కోట్లకు పైగా పర్యాటకులు సందర్శిస్తున్నారు. భద్రత మెరుగవ్వడంతో దేశవిదేశాల నుంచి పర్యాటకులు తరలివస్తున్నారు. జీ-20 వంటి అంతర్జాతీయ సదస్సులు కూడా అక్కడ నిర్వహించారు. హోటళ్లు, రవాణా, హౌస్‌బోట్లు, గైడ్‌లతో పాటు స్థానిక హస్తకళల విక్రయాలు పెరగడంవల్ల లక్షలాదిమందికి పరోక్ష ఉపాధి దొరుకుతోంది. కొత్త 'ఫిల్మ్ పాలసీ' ద్వారా సినిమా షూటింగ్‌లు కూడా పెరిగి మరిన్ని అవకాశాలు వస్తున్నాయి.

కశ్మీర్ లోయను అనుసంధానించే చినాబ్ రైల్వే బ్రిడ్జి వంటి భారీ ప్రాజెక్టులు, జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేల నిర్మాణంవల్ల వేలాదిమంది స్థానిక కార్మికులు, ఇంజనీర్లకు ఉపాధి దొరికింది. ఐఐటీ , ఎయిమ్స్ వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలు అక్కడ ఏర్పాటు కావడంతో స్థానిక యువత నైపుణ్యాలు పెరిగి, జాతీయ-అంతర్జాతీయ స్థాయి కంపెనీలలో కూడా సులభంగా ఉద్యోగాలు సాధించగలుగుతున్నారు

**ఉగ్రవాదం తగ్గుముఖం..**

ఆర్టికల్ 370 రద్దుతో జమ్మూ కశ్మీర్ భారత దేశంలో శాశ్వత అంతర్భాగంగా మారిందనే స్పష్టత రావడంతో, వేర్పాటువాద భావజాలం క్రమంగా నీరుగారింది. ఆల్‌పార్టీ హురియత్ కాన్ఫరెన్స్‌వంటి వేర్పాటువాద సంస్థల అగ్ర నాయకులను గృహ నిర్బంధం చేయడం లేదా జైలుకు పంపడంతో లోయలో అల్లర్లు సృష్టించే శక్తులు బలహీనపడ్డాయి. జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలు 75 %, రాళ్ల దాడులు 90% తగ్గుముఖం పట్టాయని అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. కేంద్రం అనుసరించిన కఠినమైన వ్యూహాలు, స్థానిక పరిస్థితులలో వచ్చిన మార్పుల కారణంగా ఇది సాధ్యమైంది. కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదంపై 'జీరో టాలరెన్స్' విధానాన్ని ప్రకటించింది. ఉగ్రవాదుల ఏరివేతకు నిరంతరం కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు. నియంత్రణ రేఖ వెంట నిఘా పరికరాలు, అధునాతన డ్రోన్ల సహాయంతో సరిహద్దు దాటి వచ్చే చొరబాట్లను గట్టిగా అడ్డుకుంటున్నారు.

ఉగ్రవాదులకు, వేర్పాటువాదులకు అందుతున్న విదేశీ నిధుల మూలాలను ఎన్ఐఏ, ఈడీ పూర్తిగా అడ్డుకున్నాయి. దేశ వ్యతిరేక కార్యకలా పాలకు పాల్పడే సంస్థల, వ్యక్తుల ఆస్తులను జప్తు చేయడం ద్వారా ఉగ్రవాద నెట్‌వర్క్‌ల ఆర్థిక వెన్నుముకను విరిచారు.

**కశ్మీరీ పండిట్లకు బెదిరింపు లేఖలు**

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన చర్యల కారణంగా జమ్మూ కశ్మీర్ పునాదులు కోల్పోయిన ఉగ్రవాదులు తిరిగి ఉనికిని చాటుకోవడానికి తాపత్రయ పడుతున్నారు. ఈ క్రమంలో కశ్మీర్‌లోయలో పనిచేస్తున్న కశ్మీరీ పండిట్ ఉద్యోగులు తమ పద్ధతులు మార్చుకోవాలని హెచ్చరిస్తూ యునైటెడ్ లిబరేషన్ కౌన్సిల్



(యూఎల్‌సీ) సంస్థ పేరిట ఓ ఆన్‌లైన్ బెదిరింపు లేఖ విడుదలైంది. ఈ లేఖలో రెవిన్యూ శాఖకు చెందిన ఆరుగురు కశ్మీరీ పండిత ఉద్యోగుల పేర్లు, ఫోన్ నెంబర్లు ఉన్నాయి.

బెదిరింపు లేఖతో పాటు వారి ఫోన్లకు మెసేజీలు కూడా వస్తున్నాయి. కాశ్మీరీ పండిట్లు, ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసులు, ఉన్నతాధికారులను లక్ష్యంగా చేసుకుంటామని ఈ సంస్థ హెచ్చరించింది. వారు కశ్మీర్ నుంచి జమ్మూకు వెళ్లినా తమను తప్పించుకోలేరని హెచ్చరించినట్లు తెలుస్తోంది. కొంత కాలంగా ఇస్లామిక్ ఉగ్రవాదుల ఆస్తుల విషయంలో ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. ఈ చర్యలతో ఈ ఉద్యోగులకు సంబంధం ఉందని,

# కు బెదిరింపు

అందుకే వారికి ఇస్లామిక్ ఉగ్రవాదులు బెదిరింపులు పంపుతున్నట్లు పోలీసులు ప్రాథమికంగా పేర్కొంటున్నారు.

ఉగ్రవాదులకు, తమ సంస్థకు మద్దతు ఇస్తున్న వారిని, వారి కుటుంబ సభ్యులను వేధిస్తున్నారని లేఖలో ఆరోపించినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా, కశ్మీర్‌లోని మసీదు నిర్వాహకులు హిందువులను ఇస్లాంలోకి మార్చాలని, లేదా వారు రాష్ట్రాన్ని విడిచివెళ్లేలా చేయాలని బెదిరించినట్లు సమాచారం. ఈ నిబంధనలను పాటించని వారిపై హింసకు పాల్పడతామని హెచ్చరించినట్లు తెలుస్తోంది. జమ్మూ కశ్మీర్‌లో పనిచేస్తున్న పోలీసులను కూడా యూఎల్‌సీ




హెచ్చరించినట్లు సమాచారం. వేర్పాటువాదులు, ఉగ్రవాదులకు సంబంధించిన ఆస్తులను జప్తు చేయడంవంటి చర్యలు తీసుకుంటున్న జమ్మూ కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్‌తో పాటు డీజీపీని కూడా లేఖలో హెచ్చరించినట్లు సమాచారం. ఈ లేఖను 'అహ్మద్ బిలాల్' పేరుతో విడుదల చేశారని తెలుస్తోంది. అతడిని యూఎల్‌సీ మీడియా కోఆర్డినేటర్‌గా, 'సోల్జర్ ఆఫ్ రెసిస్టెన్స్'గా పేర్కొన్నారు.

**లష్కరే తోయిబా ముసుగు సంస్థ**

యునైటెడ్ లిబరేషన్ కౌన్సిల్ అనేది లష్కరే తోయ్యిబా ముసుగు సంస్థగా నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. హిజ్బుల్ ముజాహిదీన్ కమాండర్ బుర్హాన్ వానీ వర్ధంతి సందర్భంగా ఒక పోస్టర్‌ను విడుదల చేసినప్పుడు ఈ బృందం తొలిసారిగా వెలుగులోకి వచ్చిందని అధికారులు పేర్కొంటున్నారు. గత నెలలో దక్షిణ కశ్మీర్‌లోని కుల్గామ్‌లో ఉన్న ఒక ఇటుక బట్టీ వద్ద ఇద్దరు వలస కార్మికులు మరణించిన వారం రోజుల తర్వాత ఈ పరిణామం చోటుచేసుకుంది. ఈ ఘటన తర్వాత జమ్మూ కశ్మీర్ ప్రభుత్వం అప్రమత్తమైంది. కశ్మీర్ లోయలో పనిచేస్తున్న పండిట్ ఉద్యోగులకు వచ్చిన ఉగ్ర బెదిరింపులపై ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆందోళన వ్యక్తంచేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, పండిట్ ఉద్యోగుల భద్రతను తక్షణమే సమీక్షించి తగినచర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో ముందస్తు జాగ్రత్త చర్యగా ఉద్యోగులకు ఆగస్టు 25 వరకు అడ్మినిస్ట్రేటివ్ సెలవులు మంజూరు చేశారు. గతంలో సాగిన లక్షిత దాడులను దృష్టిలో ఉంచుకుని, ఈ లేఖలో పేర్లున్నవారిని ఇప్పటికే జమ్మూకు తరలించారు.

**పునరాగమనాన్ని అడ్డుకునే కుట్ర!**

జమ్మూ కశ్మీర్‌లో పండిట్ల పునరావాసం, పునరాగమనాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం కొన్నేళ్లుగా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి ప్రత్యేక ఉపాధి ప్యాకేజీ కింద సుమారు 6,000 మంది కాశ్మీరీ పండిట్లకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించారు. 1990లో వేర్పాటు వాద ఉద్యమం కారణంగా నిర్వాసితులైన పండిట్ల పునరాగమనం, పునరావాసానికి వీలు కల్పించడం దీని లక్ష్యం. కాగా, 2022లో ఉగ్రవాదులు జరిపిన దాడుల్లో ఐదుగురు పండిట్ ఉద్యోగులు ప్రాణాలు కోల్పోవడంతో వారిని జమ్మూ ప్రాంతానికి బదిలీచేయాలని భారీ నిరసనలు వ్యక్తమయ్యాయి. ఆ తర్వాత వారిని శ్రీనగర్, ఇతర ప్రధాన పట్టణాల్లోని సురక్షిత ప్రాంతాలకు మార్చారు.


కశ్మీర్ లోయలో మూడు దశాబ్దాల పాటు హిందూ పండిట్లను ఇస్లామిక్ తీవ్రవాదులు, ఉగ్రవాద సంస్థలు, ముష్కరులు చిత్ర హింసలు పెట్టారు. అనేక మందిని బలవంతంగా మతం మార్చేశారు. ఈ ఘోరాలను చూడలేక పెద్ద ఎత్తున పండిట్లు సొంత నేలను వదిలేసి కట్టుబట్టలతో బయటకు వచ్చారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత ఏర్పడ్డ సానుకూల వాతావరణం నేపథ్యంలో అనేక పండిట్ కుటుంబాలు తిరిగి లోయకు చేరుకుంటున్నాయి.

ఇటీవల 'ప్రగాష్ హెరిటేజ్ టూర్' కింద విదేశాలతో పాటు ముంబై, ఢిల్లీ తదితర నగరాల్లో ఉన్న కాశ్మీరీ పండిట్ల ప్రతినిధి బృందం అనంతనాగ్‌లోని చారిత్రాత్మక మార్తాండ్ సూర్యదేవాలయాన్ని సందర్శించింది. ఈ పర్యటనలు తరాల మధ్య బంధాలను బలోపేతం చేయడానికి, సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవడానికి ఎంతో ఉపయోగపడతాయని వారు పేర్కొన్నారు.

**కశ్మీర్ లోయలో మూడు దశాబ్దాల పాటు హిందూ పండిట్లను ఇస్లామిక్ తీవ్రవాదులు, ఉగ్రవాద సంస్థలు, ముష్కరులు చిత్ర హింసలు పెట్టారు. అనేక మందిని బలవంతంగా మతం మార్చేశారు. ఈ ఘోరాలను చూడలేక పెద్ద ఎత్తున పండిట్లు సొంత నేలను వదిలేసి కట్టుబట్టలతో బయటకు వచ్చారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత ఏర్పడ్డ సానుకూల వాతావరణం నేపథ్యంలో అనేక పండిట్ కుటుంబాలు తిరిగి లోయకు చేరుకుంటున్నాయి.**

**ఉనికి కోల్పోతామనే భయం**

కశ్మీరీ పండిట్లు తిరిగి లోయలోకి రావడం వల్ల సాధారణ పరిస్థితులు నెలకొంటాయని, ఇది తమ ఉనికికి, వేర్పాటువాద అజెండాకు ముప్పు అని ఉగ్రవాద సంస్థలు భావిస్తున్నాయి. అందుకే వారి పునరావాసాన్ని అడ్డుకోవడానికి, సమాజంలో భయం సృష్టించడానికి ఆ సంస్థలు పండిట్లను లక్ష్యంగా చేసుకుని హెచ్చరికలు, బెదిరింపులకు పాల్పడుతున్నాయి. కశ్మీరీ పండిట్లు స్వస్థలాలకు తిరిగి వచ్చి ఇక్కడే జీవించడం, ఉపాధి అవకాశాలు పొందడం లోయలో తిరిగి ప్రశాంత వాతావరణం ఏర్పడిందనేందుకు సంకేతం. ప్రభుత్వ చర్యలపై నమ్మకం ఏర్పడి మరి కొంత మంది పండిట్లు వస్తే తమ కార్యాచరణను దెబ్బ తీస్తుందని ఉగ్రవాద సంస్థలు సహించలేకపోతున్నాయి. ప్రభుత్వ పునరావాస ప్యాకేజీలు విజయవంతం కావడం వారికి మింగుడు పడటం లేదు. పండిట్లు తిరిగి స్థిరపడితే మతపరమైన విభజన రాజకీయాలు, ఉగ్రవాద అజెండా బలహీన పడతాయని ఉగ్రవాదులు, వారి మద్దతుదారులు భయపడుతున్నారు. ఈ కారణంగానే ఉద్యోగుల పేర్లు, వ్యక్తిగత వివరాలతో కూడిన లేఖలు విడుదల చేసి, వారిలో భయం పుట్టించి లోయను వీడేలా చేయాలని చూస్తున్నాయి. భద్రతా బలగాలతో నేరుగా పోరాడలేక, నిరాయుధులైన పౌరులను టార్గెట్ చేయడం ద్వారా తమ ఉనికిని చాటుకోవాలని ప్రయత్నిస్తున్నాయి. లష్కరే తోయ్యిబా బెదిరింపుల వెనుక కశ్మీరీ హిందూ కుటుంబాల్లో భయాందోళనలు సృష్టించి, వారు తిరిగి కాశ్మీర్ లోయకు రావడాన్ని నిరుత్సాహపరిచే ఉద్దేశం ఉండొచ్చని స్పష్టమైపోయింది.



**క్రాంతిదేవ్ మిత్ర**
సీనియర్ జర్నలిస్ట్

రాష్ట్ర ప్రజలను ఇప్పుడు మరో సమస్య వెంటాడుతోంది. భూములున్న సామాన్యులు లక్షలాది మంది ఆందోళనలో పడిపోయారు. దశాబ్దాల క్రితం సక్రమంగా, చట్టబద్ధంగా కొనుగోలు చేసిన స్థలాలు, తరతరాలుగా అనుభవిస్తున్న పొలాలు, తమ పేరిట ఉన్న ఆస్తులు ఉన్నట్టుండి 'నిషేధిత జాబితా' (22-ఏ)లో కనిపిస్తున్నాయి. పిల్లల చదువులు, పెళ్లి ఖర్చులు, అత్యవసర వైద్య ఖర్చుల కోసమో భూములను అమ్ముకోవాలనుకునే వాళ్లకు రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అనుకోని అడ్డంకి ఎదురవుతోంది. ఆయా భూములు బదలాయించేది లేదని, నిరభ్యంతర ధ్రువీకరణ పత్రాలు (ఎన్ఓసీ) ఉంటే తప్ప రిజిస్ట్రేషన్లు చేసేది లేదని రిజిస్ట్రేషన్ కార్యాలయాల అధికారులు చెబుతుండటంతో అవసరార్థులకు ఎటూ పాలు పోవడం లేదు. సబ్ రిజిస్ట్రార్, ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నారు. ప్రజా ప్రతినిధులను ఈ సమస్య పరిష్కరించాలంటూ వేడుకుంటున్నారు.




# 'నిషేధిత'

రిజిస్ట్రేషన్ల చట్టం 1908లో లేని ఈ నిబంధనను 1999లో అప్పటి ప్రభుత్వం సవరణ ద్వారా చేర్చింది. అయితే హైకోర్టు దాన్ని కొట్టివేసింది. ఆ తర్వాత 2007లో మళ్లీ చట్ట సవరణ ద్వారా సెక్షన్ 22-ఏను తీసుకొచ్చారు. దీని ప్రకారం రాష్ట్ర ప్రభుత్వానికి ఏదైనా భూ క్రయవిక్రయాలను నిషేధించే అధికారం ఉంటుంది. ఒక సర్వే నంబరులోని భూములను ఈ జాబితాలో చేరిస్తే, ఆయా భూములకు సంబంధించి అమ్మకం, కొనుగోలు, పవర్ ఆఫ్ అటార్నీ, తాకట్టు, గిఫ్ట్ డీడ్ వంటివి ఏవీ జరగవు. ప్రభుత్వ భూములు, దేవదాయ ఆస్తులు, వక్ఫ్ భూములు, పేదలకు, దళితులకు ఇచ్చిన అసైన్డ్ భూములు, మిగులు భూములు, కోర్టు వివాదాల్లో ఉన్న భూములు వంటి వాటిని రక్షించే ఉద్దేశ్యంతో అప్పుడు ఈ సెక్షన్‌ను చేర్చారు.

ప్రభుత్వ భూములు కబ్జాల పాలై రిజిస్ట్రేషన్ల ద్వారా చేతులు మారు తున్నట్టు గుర్తించిన హైకోర్టు, నిషేధిత జాబితాను నవీకరించాలని 2015 డిసెంబరులో రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. 2024లో మరోసారి ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు గత ఏడాది చివరిలో రెవెన్యూ శాఖ ప్రభుత్వ భూముల వివరాలను నవీకరించి, తహసీల్దారు మొదలు కలెక్టర్ వరకు అధికారుల సంతకాలతో కూడిన జాబితాలను రిజిస్ట్రేషన్ల శాఖ వెబ్‌సైట్‌లో పెట్టింది. ఈ కసరత్తు జరిగిన తీరులోనే అసలు సమస్య దాగి ఉంది. వ్యవసాయ, వ్యవసాయేతర, నిషేధిత జాబితాలను ఒకేసారి అనుసంధానం చేయడంతో.. ఈ విలీన ప్రక్రియలో సాధారణ ప్రైవేటు భూములు కూడా తప్పుగా ఈ జాబితాలోకి వెళ్లిపోయాయి. పెద్ద సర్వే నంబర్లలో కొంత భాగం మాత్రమే ప్రభుత్వానికి చెందినదైనా లేదంటే కొంతభాగం కోర్టు వివాదంలో ఉన్నా, అదే నంబరు కింద ఉన్న మిగతా ప్రైవేటు భూమి మొత్తాన్నీ నిషేధిత జాబితాలో పెట్టేశారు.


**గందరగోళానికి అసలు కారణం...**


ప్రభుత్వం వేలం ద్వారా విక్రయించిన భూములు, క్రమబద్ధీకరణ ద్వారా పట్టాలు పొందిన స్థలాలు వాస్తవానికి ప్రైవేటు ఆస్తులే.

కానీ, రెవెన్యూ రికార్డుల్లో వాటి మూల సర్వే నంబర్లు ఇప్పటికీ ప్రభుత్వ భూములుగానే నమోదై ఉన్నాయి. రిజిస్ట్రేషన్ల శాఖ వద్ద మాత్రం బై నంబర్లతో, లేఅవుట్ నంబర్లతో రిజిస్టర్ అయి చేతులు మారుతూనే ఉన్నాయి. ఇప్పుడు మూల సర్వే నంబర్లన్నింటినీ ఏకమొత్తంగా 22ఏలో చేర్చడంతో వాటితో లింక్ ఉన్న భూములన్నీ నిషేధిత జాబితాలోకి చేరిపోయాయి. హైదరాబాద్ చుట్టుపక్కల జిల్లాల్లో అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యూఎల్సీ) భూములు మరో పెద్ద తలనొప్పిగా మారాయి. పట్టా భూముల్లో యూఎల్సీ భూమి ముక్క ఉంటే చాలు, ఆ మొత్తం స్థలానికే ముప్పు వాటిల్లుతోంది. ఇనాం, అసైన్డ్, చెరువు శిఖం, బఫర్ జోన్ భూములతో కలిసి ఉన్న ప్రైవేటు స్థలాలను వేరు చేయకపోవడం కూడా సమస్యకు మరో కారణంగా మారింది. కోర్టు ఆదేశాలతో రిజిస్ట్రేషన్లు పూర్తయినా రెవెన్యూ రికార్డుల్లో మార్పులు జరగకపోవడం, 166, 59 జీవోల ద్వారా క్రమబద్ధీకరణ పూర్తయిన స్థలాల సర్వే నంబర్లను జాబితా నుంచి తొలగించకపోవడం వంటి పరిపాలనాపరమైన లోపాలు కూడా ఈ గందరగోళాన్ని మరింత పెంచుతున్నాయి.

**ఆగిపోయిన రిజిస్ట్రేషన్లు**

హైదరాబాద్ మహా నగరపాలక సంస్థ (జీహెచ్ఎంసీ) పరిధిలోని సరూర్‌నగర్ మండలంలో ఒక స్థలం సర్వే నంబరు యూఎల్సీ భూమి కిందికి వస్తుందంటూ రిజిస్ట్రేషన్‌ను తిరస్కరించారు. అదే మండలంలో 19/పి నుంచి 46 వరకు మధ్యలో ఉన్న అనేక ఉప సర్వే నంబర్లు 22ఏలో చేరిపోయాయి. వికారాబాద్ జిల్లాలోని ఎన్నేపల్లి, ఆలంపల్లి, శివారెడ్డిపేట, లంకా ప్రతాప్‌రెడ్డి కాలనీల్లో పలు వెంచర్లు, నివాస స్థలాలు నిషేధిత జాబితాలోకి వెళ్లాయి. ఉప్పల్, నారపల్లి సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల పరిధిలో మేడిపల్లి, నారపల్లి, ఉప్పల్ భగాయత్, రామంతాపూర్ ప్రాంతాల్లోని అనేక సర్వే నంబర్ల ఆస్తులు రిజిస్ట్రేషన్ కాకుండా నిలిచి పోయాయి. మేడ్చల్, రంగారెడ్డి, వికారాబాద్, భువనగిరి జిల్లాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇలాంటి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. రాష్ట్రవ్యాప్తంగా చాలాచోట్ల గతంలో ప్రభుత్వం ఇచ్చిన అసైన్డ్, భూదాన్, భూ పంపిణీ, సీలింగ్ భూముల సర్వే నంబర్లతో పాటే ఉన్న పట్టా భూములకు కూడా ఈ సమస్య ఎదురవుతున్నట్టు అధికారులు కూడా గుర్తించారు.








# జాబితాతో సతమతం

**పోర్టల్ మారినా సమస్య మామూలే..**

గత బీఆర్ఎస్ ప్రభుత్వం 'ధరణి' పేరుతో భూముల పోర్టల్‌ను తీసుకొచ్చింది. అది అమలులోకి రాక ముందు కేవలం 16 లక్షల ఎకరాల భూమి మాత్రమే నిషేధిత జాబితాలో ఉండేదని, ఆ పోర్టల్ వచ్చిన తర్వాత 1955నాటి ఖాస్రా పహాణీ ఆధారంగా 22ఏను రూపొందించడంతో అనేక పొరపాట్లు దొర్లాయని నిపుణులు చెబుతున్నారు. 1955 తర్వాత కొందరు ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని సాగు చేసుకుంటున్నవి, ఇళ్లు కట్టుకున్నవి కూడా ఈ జాబితాలో చేరిపోయాయని, గత ప్రభుత్వాలు పంపిణీ చేసిన పట్టాలు సైతం సక్రమంగా రికార్డుల్లోకి ఎక్కకుండా నిషేధిత జాబితాలో కనిపిస్తున్నాయని అంటున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ధరణి పోర్టల్‌ను ఎత్తివేసి 'భూభారతి' పేరుతో మరో కొత్త పోర్టల్‌ను అమల్లోకి తెచ్చింది. అయినా అదే తరహా పొరపాట్లు పునరావృతమవుతున్నాయని, ఇప్పుడు మొత్తం నిషేధిత జాబితా పరిధి రాష్ట్రవ్యాప్తంగా కోటి ఎకరాలకు పైగానే చేరుకుందని అంచనా వేస్తున్నారు.

ఈ వ్యవహారంలో ప్రభుత్వ తీరుపై ప్రతిపక్షాలు తీవ్రంగా మండిపడు తున్నాయి. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన సెక్షన్ 22ఏ, రెవెన్యూ అధికారులకు, రాజకీయ నాయకులకు ఒక ప్రైవేటు ఏటీఎంగా మారిందని ఆయా పార్టీల నేతలు ఆరోపిస్తున్నారు. వాస్తవ ప్రభుత్వ స్థలాలను వదిలేసి, దశాబ్దాలుగా రైతులు అనుభవిస్తున్న పట్టా భూములను ఉద్దేశ పూర్వకంగా జాబితాలో చేరుస్తున్నారని, డబ్బు ముట్టజెప్పిన వారి భూములను ఆ జాబితా నుంచి వేగంగా తొలగిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. ఎన్‌వోసీ దరఖాస్తుల స్థితిని ఆన్‌లైన్‌లో ట్రాక్ చేసే విధానం తేవాలని, జాప్యానికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని, ఎన్‌వోసీ జారీకి గరిష్ఠంగా 30 రోజుల గడువు విధించాలని విపక్షాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. గతంలో పది శాతంగా ఉన్న 22ఏ భూముల విస్తీర్ణం ఇప్పుడు 30 నుంచి 40 శాతానికి పెరిగి కోటి ఎకరాలకు చేరుకుందని, రైతుల భూములను ఉద్దేశపూర్వకంగా జాబితాలో చేర్చి, ముడుపులు తీసుకుంటేనే తొలగిస్తున్నారని బీజేపీ శాసనసభా పక్షనేత ఏలేటి మహేశ్వర రెడ్డి విమర్శించారు. అసైన్డ్, దేవదాయ, వక్ఫ్, అటవీ భూముల సమగ్ర వివరాలను ప్రభుత్వం కోర్టుకు సైతం సమర్పించకుండా దాచిపెడుతోందని ఆయన ఆరోపించారు.

**భూ యజమానులు ఏం చేయాలి?**

ప్రస్తుతం నెలకొన్ని పరిస్థితుల నేపథ్యంలో భూముల యజమానులు తమ భూమి 22ఏ జాబితాలో ఉందో లేదో ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో సరిచూసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. వ్యవసాయ భూములైతే 'భూభారతి' పోర్టల్‌లో, పట్టణ ప్రాంత భూములైతే ఐజీఆర్ఎస్ రిజిస్టర్ ద్వారా వివరాలు తెలుసుకోవచ్చని చెబుతున్నారు. పట్టాదారు పాసు పుస్తకాలు, పాత రిజిస్ట్రేషన్ పత్రాలు, లింక్ డాక్యుమెంట్లు, లేఅవుట్ అనుమతి పత్రాలు, కోర్టు తీర్పు కాపీలు వంటివన్నీ భద్రంగా ఉంచుకోవడం అవసరమని, ఏ కారణంతో, ఏ జీవో ఆధారంగా తమ భూమిని నిషేధిత జాబితాలో చేర్చారో తెలియ జేయాలంటూ సంబంధిత సబ్ రిజిస్ట్రార్ లేదా కలెక్టర్ కార్యాలయానికి లేఖ ఇవ్వాలని, తమ వద్ద ఉన్న ఆధారాలతో సహా జాబితా నుంచి తొలగింపు కోరుతూ దరఖాస్తు సమర్పించాలని సలహా ఇస్తున్నారు. భూములకు సంబంధించి సెక్షన్ 22ఏ (1)(ఎ), (బి), (డి) కింద వచ్చే ఫిర్యాదులకు జిల్లా కలెక్టర్‌ను, (సి) కింద వచ్చే వాటికి వక్ఫ్ బోర్డు సీఈఓ లేదా దేవదాయ శాఖ కమిషనర్‌ను, (ఇ) కింద వచ్చే వాటికి భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) ఏర్పాటుచేసిన కమిటీని సంప్రదించాలని సూచిస్తు న్నారు. కోర్టు ఉత్తర్వులవల్ల నిషేధిత జాబితాలో చేరితే, న్యాయవాది సాయంతో కోర్టు ద్వారానే పరిష్కారం పొందాల్సి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

భూముల అమ్మకాలు, కొనుగోళ్ల విషయంలో ఈ 22ఏ సెక్షన్ వివాదం తీవ్రతరం కావడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. పొరపాటున నిషేధిత జాబితాలో చేరిన ప్రైవేటు భూములపై యజమానులు ఆందోళన చెందవద్దని సూచించారు. నిషేధిత జాబితాలో ఉన్న భూములకు సంబంధించిన సర్వే నంబర్లలో కోర్టు వివాదాల్లో ఉన్న లేదా నిజంగా ప్రభుత్వానికి చెందిన భాగాన్ని మాత్రమే మినహాయించి, మిగతా పట్టా భూములకు రిజిస్ట్రేషన్లు అనుమతించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇస్తున్నారు. ఈ క్రమంలోనే కలెక్టర్లు ప్రతిరోజూ నిషేధిత జాబితా దరఖాస్తులను పరిశీలించాలని, ఆన్‌లైన్ రికార్డులను సరిచూసి తగిన నిర్ణయాలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. తమ ప్రభుత్వం కొత్తగా ఏ భూమిని నిషేధిత జాబితాలో చేర్చలేదని, గత ప్రభుత్వం నుంచి వస్తున్న సాంకేతిక చిక్కులను పరిష్కరించి బాధితులకు ఊరట కల్పిస్తామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కూడా ప్రకటించారు. సబ్ రిజిస్ట్రార్లకు విచక్షణాధికారాలు ఉండకూడదని, ఆన్‌లైన్‌లో ఉన్నదానికే ఆమోదం తెలిపేలా వారి పరిధిని కుదించాలని అధికారులను ఆదేశించారు. నిషేధిత జాబితాలోని దరఖాస్తులను గుడ్డిగా తిరస్కరించ కుండా, తిరస్కరణకు కారణాలను మూడు రోజుల్లోగా తెలియజేయాలని, ప్రతి దరఖాస్తునూ తహసీల్దారుకు పంపకుండా నేరుగా కలెక్టర్‌కే పంపాలని సూచించారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించాలన్న సదుద్దేశంతో తీసుకొచ్చిన సెక్షన్ 22ఏ విమర్శల పాలవుతోందని, తగినంత క్షేత్రస్థాయి పరిశీలన లేకపోవడంతో ఈ స్థాయిలో సామాన్య పౌరులు ఇబ్బంది పడుతున్నారని విమర్శలు ఉన్నాయి. హైకోర్టు ఆదేశాల అమలులో వేగంగా స్పందించిన ప్రభుత్వం.. ఆ ప్రక్రియ సామాన్యులపై ఎలాంటి ప్రభావం చూపుతుందో అంచనా వేయకపోయిందని ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పుడు తప్పులను సరిదిద్దే ప్రక్రియ మొదలైనా, అది ఎంత వేగంగా, ఎంత పారదర్శకంగా జరుగుతుందనే దానిపైనే బాధితులకు న్యాయం జరుగుతుందా లేదా అన్నది ఆధారపడి ఉంటుందంటున్నారు. గ్రామం లేదా మండలాన్ని యూనిట్‌గా తీసుకుని యుద్ధ ప్రాతిపదికన క్షేత్రస్థాయి పరిశీలన చేపడితేనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని నిపుణులు సూచిస్తున్నారు.

**సుజాత గోపగోని**
సీనియర్ జర్నలిస్ట్, 6302164068



# సంక్షోభంలో

**ఖరీఫ్ సీజన్ సగం ముగిసినా తగిన మేరకు వర్షాలు పడక అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.నైరుతి రుతుపవనాలు వచ్చి నెలలు గడుస్తున్నా రాష్ట్రంలో చాలా చోట్ల వానలు లేవు. అడపాదడపా పడే చిరుజల్లులు భూమిలో తేమను పెంచడానికి, పంటలు ఆరోగ్యంగా ఎదగడానికి ఏమాత్రం సరిపోవడం లేదు. జూన్ పూర్తిగా నిరాశపరిచినా జూలైలో కురిసిన కొద్దిపాటి వానలు రైతుల్లో ఆశలు రేపినా, ఆగస్టు రెండు వారాలు గడుస్తున్నా వాతావరణం అనుకూలించలేదు.**

వానల కోసం ఆకాశం వైపు, సాగునీటి కోసం రిజర్వాయర్ల వైపు రైతులు నిరాశగా ఎదురు చూస్తున్నారు. నారు పోసిన వారు, అలాగే నాట్లు వేసిన రైతులందరూ తమ పైరు ఎండిపోతుందేమోనని తీవ్ర భయాందోళనలతో ఉన్నారు. పసిఫిక్ మహాసముద్రంలో వేగంగా బలం పుంజుకుంటున్న 'ఎల్‌నినో''వాతావరణ మార్పుల వల్లే వానలు తగ్గుముఖం పట్టాయి. ఈ పరిణామమే రైతుల ప్రస్తుత సంక్షోభానికి మూల కారణం.

భూమధ్యరేఖకు ఇరువైపులా విస్తరించిన మధ్య, తూర్పు పసిఫిక్ మహాసముద్ర జలాల ఉపరితల ఉష్ణోగ్రత సాధారణం కంటే ఎక్కువగా పెరగడాన్నే వాతావరణ శాస్త్రవేత్తలు ఎల్‌నినోగా పిలుస్తారు. సముద్ర జలాల్లో చోటుచేసుకునే ఈ మార్పు, భూమిపై వాతావరణ పీడన స్థితిగతులను తారుమారు చేసి, గాలుల ప్రవాహ దిశనే మలుపు తిప్పేస్తుంది. దీని ఫలితంగా భారత ఉపఖండంపై రుతుపవనాల బలం తగ్గిపోయి, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో వర్షపాతం గణనీయంగా పడిపోతుంది. కొన్నేళ్లకోసారి పునరావృతమయ్యే ఈ ప్రకృతి పరిణామం అంతర్జాతీయంగా అనేక దేశాల్లో వాతావరణ గతిని మారుస్తుండగా, ఈసారి ఆంధ్రప్రదేశ్‌లో ఖరీఫ్ సేద్యాన్ని బాగా దెబ్బతీస్తోంది.

**జూన్‌లో దారుణ పరిస్థితి**

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ రైతులకు నిరాశ కలిగించింది. జూన్‌లో సగటు వర్షపాతం కంటే 38 శాతం తక్కువ వర్షాలు నమోదయ్యాయి. సాధారణంగా జూన్‌లో సుమారు మూడు అల్పపీడన వ్యవస్థలు ఏర్పడి సగటున 11 రోజుల పాటు వర్షాలు పడతాయి. కానీ ఈ ఏడాది జూన్‌లో ఒక్క అల్పపీడన వ్యవస్థ కూడా ఏర్పడలేదు. దీంతో 1901 తర్వాత దేశంలో అత్యంత తక్కువ వర్షపాతం నమోదైన జూన్‌గా ఇది ఆరో స్థానంలో నిలిచింది. మొత్తం 688 మండలాలకు గాను, 586 మండలాలు వర్షాభావాన్ని ఎదుర్కొంటుండగా, ఇందులో సుమారు 157 మండలాల్లో అత్యల్ప వర్షపాతం, 429 మండలాల్లో మోస్తరు లోటు నమోదైంది. 102 మండలాల్లో మాత్రమే సాధారణ వర్షపాతం నమోదైంది. రాయలసీమ జిల్లాలు అత్యధికంగా నష్టపోగా, కోస్తా జిల్లాల్లోనూ పరిస్థితి పెద్దగా మెరుగ్గా లేదు. అన్నమయ్య, చిత్తూరు, ప్రకాశం జిల్లాల్లో వర్షపాత లోటు యాభై శాతానికిపైగా నమోదవగా, పశ్చిమగోదావరి, కోనసీమ, తూర్పుగోదావరి, విశాఖపట్నం జిల్లాల్లోనూ డెబ్భై శాతం వరకు లోటు ఏర్పడింది. కోస్తాంధ్రలో సగటున నలభై నాలుగు శాతం, రాయలసీమలో నలభై ఆరు శాతం, రాష్ట్ర వ్యాప్తంగా సగటున నలభై ఎనిమిది శాతం వర్షపాత లోటు నమోదవడం సమస్య తీవ్రతకు అద్దం పడుతోంది.




**వరిసాగుపై ప్రభావం**

ఈ వర్షాభావ ప్రభావం ప్రధానంగా వరి సాగుపై పడింది. కృష్ణా, గోదావరి డెల్టా ప్రాంతాల్లో పదమూడు లక్షల ఎకరాలకుపైగా వరికి నీటి లభ్యతపై స్పష్టత కొరవడింది. నదులకు ఎగువ ప్రాంతాల నుంచి చెప్పుకోదగ్గ ప్రవాహం లేకపోవడంతో ప్రాజెక్టుల్లో నిల్వలు ఆశాజనకంగా లేవు. ఈ ప్రభావం కర్నూలు జిల్లాపై మరింత ఎక్కువగా పడింది. దేశవ్యాప్తంగా పేరుగాంచిన కర్నూలు సోనా బియ్యం రకం ఈసారి తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. కేసీ కెనాల్, తెలుగుగంగ వంటి ప్రధాన కాలువల కింద వరి సాగును పూర్తిగా నిలిపివేసి, తక్కువ నీటితో పండే మొక్కజొన్న, మినుము వంటి పంటల వైపు మళ్లాలని రైతులకు అధికారులు సూచిస్తున్నారు. దీనితో ఆ ప్రాంతంలో సాధారణంగా సాగయ్యే విస్తీర్ణంలో ఒక్క శాతం కూడా ఈసారి నాట్లు పడలేదు.

**ప్రత్యామ్నాయ పంటలవైపు చూపు**

మరోవైపు, నీటి లభ్యత సందిగ్ధంగా ఉన్న ప్రాంతాల్లో రైతులు వరికి ప్రత్యామ్నాయంగా పత్తి, కంది వంటి మెట్ట పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. గతేడాదితో పోలిస్తే ఈసారి పత్తి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. కర్నూలు జిల్లా ఈ మార్పులో ముందంజలో ఉండగా, పల్నాడు, ఎన్టీఆర్, అనంతపురం, గుంటూరు జిల్లాలు సైతం పత్తి సాగు వైపు అడుగులు వేస్తున్నాయి. అయితే పత్తి సాగు కూడా చాలావరకు వర్షాధారమే గనుక,



# ఖరీఫ్ సేద్యం

తగినంత వర్షం లేకపోతే మొలక,ఎదుగుదల దశల్లోనే పంట దెబ్బతినే అవకాశం ఉందని వ్యవసాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. మార్కెట్‌లో డిమాండ్, పెట్టుబడి–ఆదాయ లెక్కలను బేరీజు వేసుకుని రైతులు ఈ నిర్ణయం తీసుకుంటున్నప్పటికీ, వర్షాలు సకాలంలో కురవకపోతే ఈ ప్రత్యామ్నాయం కూడా వారిని నిరాశపరిచే ప్రమాదం ఉంది.

క్షేత్రస్థాయిలో రైతుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. నారుమళ్లు ఎండిపోకుండా కాపాడుకునేందుకు కొందరు దూరప్రాంతాల్లోని బోర్లు, చెరువుల నుంచి బిందెలు, డ్రమ్ముల్లో నీళ్లు మోసుకొస్తుంటే, మరికొందరు మురుగు కాలువల్లో నిలిచిన కొద్దిపాటి నీటిని మోటార్లతో తోడి పంటలకు అందిస్తున్నారు. వర్షం కోసం పలుచోట్ల ప్రత్యేక పూజలు, సంప్రదాయ ఆచారాలు సైతం నిర్వహిస్తుండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. రాష్ట్రవ్యాప్తంగా చూస్తే, నిర్దేశిత లక్ష్యంలో నలభై శాతం విస్తీర్ణంలో మాత్రమే ఇప్పటివరకు పంటలు సాగులోకి వచ్చాయి. వేరుశనగ వంటి పంటలైతే లక్ష హెక్టార్లలో ఇంకా విత్తనం కూడా పడని దుస్థితి నెలకొంది.

**జూలైలో కాస్త మెరుగు**

ఇదిలా ఉంటే జూలైలో పరిస్థితి కాస్త మారింది. నైరుతి రుతుపవనాలు ఒక్కసారిగా పుంజుకోవడంతో వర్షాలు ఊపందుకున్నాయి. ఫలితంగా ఖరీఫ్ సాగు లోటు కొంత తగ్గింది. అయితే ఇంతటితో ముప్పు తొలగిపోయినట్లు కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా రబీ పంటలపై ఎల్‌నినో ప్రభావం ఉండే అవకాశం ఆందోళన కలిగిస్తోంది. వ్యవసాయమే వెన్నెముకగా ఉన్న రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై ఈ పరిణామాలు దీర్ఘకాలిక ప్రభావం చూపే అవకాశం ఉంది. పంట దిగుబడులు తగ్గితే గ్రామీణ ఆదాయాలు క్షీణించి, రైతులు తీసుకున్న పంట రుణాల చెల్లింపులపైనా ఒత్తిడి పెరుగుతుంది. దుకాణాలు, చిన్న వ్యాపారాలు, రవాణా వంటి అనుబంధ రంగాలపైనా దీని ప్రభావం పరోక్షంగా పడుతుంది. ఒక సీజన్ కుంటుపడితే దాని పర్యవసానాలు వచ్చే ఏడాది సాగు ప్రణాళికలపైనా కనిపిస్తాయని ఆర్థిక నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.

ఇంతటి సంక్షోభాన్ని అధిగమించేందుకు రైతులకు ప్రభుత్వ తోడ్పాటు అత్యవసరం. ప్రత్యామ్నాయ పంటలు వేసుకునే రైతులకు తక్కువ ధరకే నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించడంతో పాటు, కాలువలపై ఆధారపడ్డ కౌలు రైతులకు ప్రత్యేక పరిహారం ప్రకటించాల్సిన అవసరం ఉంది. వర్షపాత లోటు తీవ్రంగా ఉన్న మండలాలను అధికారికంగా కరవు ప్రాంతాలుగా ప్రకటించి, తక్షణ సాయం అందించాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

జులై చివరి వారం లేదా ఆగస్టు మధ్య వర్షపాత పరిస్థితిని అంచనా వేసి కరవు మండలాల ప్రకటనపై నిర్ణయం తీసుకునే యోచనలో ప్రభుత్వం ఉంది. పంటల బీమా పథకాన్ని మరింత మందికి చేరువ చేయడం, నష్టపోయిన రైతులకు వేగంగా పరిహారం అందేలా చూడటం కూడా ప్రస్తుత తరుణంలో కీలకం. దీర్ఘకాలిక పరిష్కారంగా బిందు, తుంపర సేద్యం వంటి నీటి పొదుపు పద్ధతులను మరింతగా ప్రోత్సహించడంతో పాటు, చెరువులు, కుంటల పూడికతీత ద్వారా వర్షపు నీటిని ఒడిసిపట్టుకునే మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం కూడా ముఖ్యమే.

ప్రస్తుతానికి అన్నదాతల ఆశలన్నీ రాబోయే వారాల్లో కురిసే వర్షాలపైనే ఆధారపడి ఉన్నాయి.


> **ఇంతటి సంక్షోభాన్ని అధిగమించేందుకు రైతులకు ప్రభుత్వ తోడ్పాటు అత్యవసరం. ప్రత్యామ్నాయ పంటలు వేసుకునే రైతులకు తక్కువ ధరకే నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించడంతో పాటు, కాలువలపై ఆధారపడ్డ కౌలు రైతులకు ప్రత్యేక పరిహారం ప్రకటించాల్సిన అవసరం ఉంది.**

ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో మెరుగైన వర్షపాతం నమోదైతే తప్ప, ఈ ఖరీఫ్ సీజన్ గట్టెక్కడం కష్టమేనని వాతావరణ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. అయినప్పటికీ, నేలతల్లిని నమ్ముకుని ప్రతికూల పరిస్థితుల్లోనూ ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కుంటున్న రైతన్నల పట్టుదల, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగానికి కొండంత అండగా నిలుస్తోంది. ప్రభుత్వం, రైతులు, స్థానిక సంస్థలు కలిసికట్టుగా అడుగులు వేస్తే, ఎల్‌నినో సవాళ్లను సైతం అధిగమించి ఈ కష్టకాలం నుంచి రాష్ట్రం త్వరగా బయటపడగలదన్న విశ్వాసం రైతాంగంలో ఇంకా సజీవంగానే ఉంది. చినుకు కోసం ఎదురుచూపులు కొనసాగుతున్నా, ఆ నమ్మకమే వారిని ముందుకు నడిపిస్తోంది.




**తురగా నాగభూషణం**

సీనియర్ జర్నలిస్ట్

# అజ్ఞాత వీరులు – 'రా'

భారతదేశాన్ని రక్షిస్తున్నవారు ఎవరు? ఈ ప్రశ్నకు మనలో చాలామంది వెంటనే మన సైనికులు, పోలీసులు, సరిహద్దు భద్రతా దళాలు అని సమాధానం చెబుతారు. సరిహద్దుల్లో నిలబడి శత్రువులను ఎదుర్కొనే మన సైనికుల త్యాగాలు వర్ణనాతీతం. అయితే, ఈ దళాల వెనుక ఎవరికీ కనిపించని మరో బలమైన అదృశ్య రక్షణ కవచం ఉంది. అదే రీసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్ (రా). ఈ సంస్థలో పనిచేసే అధికారులు భారతదేశానికి నిజమైన అజ్ఞాత వీరులు. వారి జీవితం, సేవలు, విజయాలు, చివరికి వారి మరణం కూడా. రహస్యంగానే ముగిసిపోతాయి.

**అదృశ్య రక్షణ వ్యవస్థ – 'రా'**

ప్రపంచంలో శక్తివంతమైన ప్రతి దేశానికి విదేశీ నిఘా సమాచారాన్ని సేకరించే ప్రత్యేక




సంస్థ ఉంటుంది. మన దేశానికి ఆ బాధ్యతను 'రా' నిర్వర్తిస్తున్నది. విదేశీ నేలపై భారతదేశ భద్రతకు ముప్పు కలిగించే ఉగ్రవాద సంస్థలను పసి గట్టడం, శత్రు దేశాల వ్యూహాలను తిప్పికొట్టడం, గూఢచర్య కార్యకలాపాలను అడ్డుకోవడం, సైబర్ దాడులను నిరోధించడం, అంతర్జాతీయ రాజకీయ పరిణామాలపై నిఘా ఉంచడం 'రా' ప్రధాన బాధ్యత. సరిహద్దులకు ఆవల ఏం జరుగుతుందో ముందే తెలుసుకుని, అత్యంత కీలకమైన సమాచారాన్ని భారత ప్రభుత్వానికి అందించడం ద్వారా వీరు రాబోయే ముప్పులను ముందే అడ్డుకుంటారు.

**గుర్తింపు లేని మహోన్నత త్యాగం**

మన దేశంలో ఇంటెలిజెన్స్ బ్యూరో, కేంద్ర నిఘా సంస్థలు, రాష్ట్ర పోలీసులు, ఆర్మీవంటి వ్యవస్థలు చట్టబద్ధంగా, అధికారికంగా పనిచేస్తాయి. ప్రభుత్వం వీరికి అధికారిక గుర్తింపు కార్డులు ఇస్తుంది. వీరు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోతే, ప్రభుత్వం సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తుంది. దేశ అత్యున్నత నాయకులు వారి భౌతికకాయానికి నివాళులు అర్పిస్తారు. వారి కుటుంబాలకు పరిహారంతో పాటు సమాజంలో గొప్ప గౌరవం లభిస్తుంది.

కానీ, 'రా' అధికారుల జీవితం పూర్తిగా భిన్నమైనది. వీరు విదేశీ నేలపై తమ అసలు పేరును, గుర్తింపును మరచిపోయి, కల్పిత పేర్లతో జీవిస్తారు. వారి నిజమైన పేరు, చిరునామా, కుటుంబ నేపథ్యం, చేసే ఉద్యోగం ఈ ప్రపంచానికి తెలియవు. శత్రువులు మధ్యన జీవిస్తూ సంవత్సరాల తరబడి దేశం కోసం గూఢచార కార్యకలాపాలు నిర్వహిస్తారు.

తాము భారతీయులమని గర్వంగా చెప్పుకునే హక్కు కూడా వారికి ఉండదు. కన్నతల్లి ఆఖరి చూపులకు నోచుకోక, భార్యాపిల్లలకు దూరమై, పండుగలకు కూడా సొంత ఇంటికి రాలేక మానసిక వేదన అనుభవిస్తారు. వారి జీవితంలో ప్రతి క్షణం ప్రమాదాలతో నిండి ఉంటుంది. ఒక్క చిన్న పొరపాటు జరిగినా వారి అసలు గుర్తింపు బయట పడుతుంది. శత్రు దేశాల నిఘా సంస్థలు లేదా పోలీసులు వారిని అరెస్టు చేస్తే, క్రూరమైన విచారణలు, చిత్రహింసలు, జీవిత ఖైదు, ఆఖరికి మరణం కూడా ఎదురవుతాయి. అటువంటి పరిస్థితుల్లో కూడా దేశ రహస్యాలను బయటకు చెప్పకుండా, నరకాన్ని అనుభవిస్తూ ప్రాణాలను వదిలేస్తారు.

ఒకవేళ ఒక 'రా' అధికారి విదేశాల్లో శత్రువులకు పట్టుబడితే, భారత ప్రభుత్వం "అతను మా అధికారి" అని అధికారికంగా ప్రకటించదు. దేశ భద్రత, ఇతర రహస్య ఆపరేషన్లు, అక్కడ పనిచేస్తున్న ఇతర గూఢచారుల ప్రాణాలను కాపాడడం కోసం ప్రభుత్వం మౌనంగా ఉండవలసి వస్తుంది.

దేశం కోసం ప్రాణాలు అర్పించిన ఆ వీరుడికి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు చేయరు. వారి భౌతికకాయంపై త్రివర్ణ పతాకం కప్పరు. ప్రభుత్వం జాతీయ సంతాపం ప్రకటించదు. టీవీలలో, పత్రికల్లో వారి వార్తలు రావు. వారి పేరు చరిత్ర పుస్తకాలలో కూడా రాయరు. తమ రక్తాన్ని ధారపోసిన మాతృభూమి ఒడిలో కాకుండా, ఏ అపరిచిత నేలపైనో వారి శవం కాలిపోతుంది. కనీసం సొంత కుటుంబ సభ్యులకు కూడా తమ మనిషి ఎలా చనిపోయారో తెలియదు. ఇంతకంటే గొప్ప త్యాగం, ఇంతకంటే కన్నీరు పెట్టించే దేశభక్తి వేరొకటి ఉండదు.

తమ జీవితకాలంలో ఎలాంటి ప్రశంసలు ఉండవు. ఉద్యోగ విరమణ తర్వాత కూడా ఎలాంటి ప్రచారం ఉండదు. చనిపోయినా ఈ లోకానికి తెలియదు. అయినప్పటికీ, వారు దేశసేవను వదిలిపెట్టరు. ఎందుకంటే వారి దేశభక్తి పతకాల కోసమో, పత్రికల్లో ఫోటోల కోసమో కాదు. వారి గుండెల్లో రగిలే దేశభక్తి కేవలం భారతమాత భద్రత కోసం మాత్రమే.

'రా' సాధించిన విజయాల గురించి ప్రజలకు చాలా తక్కువ తెలుస్తుంది. నిజానికి, ఒక నిఘా సంస్థ అసలు విజయం జరిగిన సంఘటనలలో ఉండదు, జరగకుండా అడ్డుకున్న ప్రమాదాలలో ఉంటుంది. భారతదేశంలో జరగాల్సిన ఎన్నో భారీ ఉగ్రవాద దాడులను ముందే విఫలం చేయడం, శత్రువుల వ్యూహాలు ముందుగానే పసిగట్టి మన ఆర్మీని అప్రమత్తం చేయడం వంటి అనేక విజయాల వెనుక ఈ అజ్ఞాతవీరుల శ్రమ ఉంది. వారు ప్రాణాలను పణంగా పెట్టి సమాచారం అందించడం వల్లే మన దేశం సురక్షితంగా ఉంది.

నేడు భారతదేశం ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన దేశంగా ఎదుగుతున్నది. ఈ సమయంలో 'రా' పాత్ర మరింత కీలకమైంది. నేటి యుద్ధాలు కేవలం సరిహద్దుల్లో తుపాకులతో

# అధికారులు


మాత్రమే జరగడం లేదు. సాంకేతిక పరిజ్ఞానం, సైబర్ యుద్ధాలు, అంతర్జాతీయ ఉగ్రవాదం, ఆర్థిక గూఢచర్యం వంటి కొత్త తరహా సవాళ్లు ఎదురవుతున్నాయి. ఈ సవాళ్లను ఎదుర్కొంటూ, మన 'రా' అధికారులు రాత్రింబవళ్లు కంటిమీద కునుకు లేకుండా శ్రమిస్తున్నారు. మనం మన ఇళ్లల్లో ప్రశాంతంగా నిద్రపోతున్నామంటే, ప్రపంచంలో ఏ మూలనో 'రా' అధికారులు మేల్కొని ఉండడమే కారణం.

**మన బాధ్యత - వారికి మనమిచ్చే గౌరవం**

ఈ అజ్ఞాత వీరుల సేవలకు మనం ప్రత్యక్షంగా ఎలాంటి ప్రతిఫలాన్ని ఇవ్వలేము. వారి ముఖాలు మనకు తెలియవు, వారి పేర్లు మనకు వినపడవు. కానీ, ఒక భారతీయుడిగా మనం చేయగలిగిందల్లా వారి త్యాగాన్ని మనస్ఫూర్తిగా గుర్తించడమే.

దేశభక్తి అంటే కేవలం పండుగల రోజుల్లో జెండా ఎగరవేయడం లేదా జాతీయ గీతం పాడడం మాత్రమే కాదు. దేశం కోసం తమ పేరును, కుటుంబ సుఖాలను, వ్యక్తిగత జీవితాన్ని, ఆఖరికి ప్రాణాలను కూడా నిశ్శబ్దంగా త్యాగం చేసే వారిని గుండెల్లో నిలుపుకోవడమే నిజమైన దేశభక్తి.

వారి పేర్లు చరిత్ర పుటల్లో నమోదు కావు. కానీ వారి త్యాగాలు ఈ దేశ మట్టిలో మిగిలిపోతాయి. సరిహద్దుల్లో నిలబడిన సైనికుడికి మనం ఎలాగైతే తలవంచి ప్రణామం చేస్తామో, ప్రపంచంలో ఏ మూలనో తన గుర్తింపును సైతం కోల్పోయి, భారతమాత కోసం నిశ్శబ్దంగా పోరాడుతున్న ప్రతి 'రా' అధికారికీ అంతే గౌరవంతో వందనం చేయాలి. వారు మనకు కనబడని కవచాలు. వారి త్యాగం చిరస్మరణీయం, వారి సేవలు అమూల్యం.



**పి. వేణుగోపాల్ రెడ్డి**
**సీనియర్ ప్రచారక్**
**ఏకలవ్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు**

# ఐరాస వేదికపై భారత నారీ శక్తి జయకేతనం

ప్రపంచ వేదికపై భారతదేశ ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి చేర్చుతూ, భారత నారీ శక్తి మరోసారి తన సత్తాను చాటింది. ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షక దళంలో విశిష్ట సేవలందించిన భారత సైన్యాధికారి మేజర్ అభిలాష బరాక్‌కు ప్రతిష్ఠాత్మక 2025 "మిలిటరీ జెండర్ అడ్వకేట్ ఆఫ్ ది ఇయర్" అవార్డు లభించింది. అంతర్జాతీయ ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షకుల దినోత్సవం సందర్భంగా 2026 మే 29న ఈ అవార్డును ప్రకటించారు. భారత సైన్యంలో తొలి మహిళా కంబాట్ హెలికాప్టర్ పైలట్‌గా చరిత్ర సృష్టించిన మేజర్ అభిలాష బరాక్, ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో దేశానికి మరో గౌరవాన్ని తీసుకొచ్చారు.

హరియాణాలోని రోహ్‌తక్‌కు చెందిన అభిలాష బరాక్, రిటైర్డ్ కల్నల్ ఎస్. ఓం సింగ్ కుమార్తె. ఢిల్లీలోని దిల్లీ టెక్నలాజికల్ యూనివర్సిటీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ఆమె, 2017లో చెన్నైలోని ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో శిక్షణ పొందారు. తండ్రికి ఉన్న సైనిక నేపథ్యం, దేశసేవ పట్ల ఆయనకున్న అంకితభావం అభిలాషను సైనిక జీవితాన్ని ఎంచుకునేలా ప్రేరేపించాయి. 2022లో భారత సైన్యంలో తొలి మహిళా కంబాట్ ఏవియేటర్‌గా గుర్తింపు పొందిన ఆమె, ప్రీ–ఆర్మీ పైలట్ కోర్సులో ప్రథమ స్థానంలో నిలిచి ప్రతిష్ఠాత్మక ట్రోఫీని అందుకున్నారు.






**లెబనాన్‌లో భారత 'నారీ శక్తి' ఘనత**

ప్రస్తుతం లెబనాన్‌లోని ఐక్యరాజ్యసమితి తాత్కాలిక దళంలో సేవలందిస్తున్న మేజర్ అభిలాష బరాక్, భారత బెటాలియన్ మహిళా ఎంగేజ్‌మెంట్ టీమ్ కమాండర్‌గా విశేష నాయకత్వాన్ని ప్రదర్శించారు. ఘర్షణ ప్రాంతాల్లో లింగ సమానత్వం, మహిళల భద్రత, సాధికారత కోసం ఆమె చేసిన కృషిని ఐరాస ప్రత్యేకంగా ప్రశంసించింది. మేజర్ అభిలాష కేవలం శాంతి పరిరక్షణకే పరిమితం కాకుండా, స్థానిక సమాజ అభ్యున్నతికి కూడా కృషి చేశారు. లెబనాన్‌లోని 5,000 మందికి పైగా మహిళలు, యువతుల కోసం వృత్తి విద్యా శిక్షణ, విద్యా కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించి ప్రశంసలందుకున్నారు.

**భారత్‌కు విజయ పరంపర**

ఐక్యరాజ్యసమితి ప్రతిష్ఠాత్మక "మిలిటరీ జెండర్ అడ్వకేట్ ఆఫ్ ది ఇయర్" అవార్డును భారతీయ మహిళా సైనికాధికారులు మూడుసార్లు గెలుచుకోవడం దేశానికి గర్వకారణం. ఇది ప్రపంచ శాంతి పరిరక్షణలో భారత మహిళల అంకితభావం, నాయకత్వం, సేవా తత్పరతకు నిదర్శనం.

***మేజర్ సుమన్ గవాణి (2019)***

ఈ అవార్డును అందుకున్న తొలి భారతీయ మహిళా అధికారి మేజర్ సుమన్ గవాణి. దక్షిణ సూడాన్‌లో ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షణ మిషన్‌లో సేవలందించిన ఆమె, మహిళలు, బాలికలపై జరుగుతున్న హింసను అరికట్టేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, వారి భద్రత కోసం కీలకచర్యలు చేపట్టారు.

**మేజర్ రాధికా సేన్ (2024)**

2024 సంవత్సరానికి ఈ అవార్డును అందుకున్న మేజర్ రాధికా సేన్, కాంగో ప్రజాస్వామ్య గణరాజ్యంలో ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షణ దళంలో కీలక బాధ్యతలు నిర్వహించారు. ఘర్షణలతో బాధపడుతున్న ప్రాంతాల్లో మహిళలు, చిన్నారుల రక్షణకు ఆమె విశేష కృషి చేశారు. మహిళలపై జరిగే లైంగిక హింసను నిరోధించేందుకు, మహిళల సాధికారత కోసం అనేక కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రపంచంలోనే ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షణ కార్యక్రమాలకు అత్యధికంగా సైనికులను అందించిన దేశాల్లో భారత్ ఒకటి. దశాబ్దాలుగా భారత సైనికులు అనేక దేశాల్లో శాంతి, భద్రతల పరిరక్షణ కోసం సేవలందిస్తూ విశ్వసనీయతను చాటుతున్నారు.

భారత నారీ శక్తికి వందనం.

**– ఆనంద్, 7406074050**



# ఏ వెలుగులకీ ప్రస్థానం?

3

"అసలు విషయం ఇప్పుడు చెబితేనే మంచిది. నిజం తాత్కాలికంగా బాధ పెట్టినా దానికి భవిష్యత్తులో మంచి చేస్తుంది. ఇంక ఆలస్యం మంచిది కాదు." అన్నాడు నిర్వేదంగా శ్రీధర్.

"మరి ఎప్పుడు చెబుతారు? ఎలా చెబుతారు?" కళ్లు తుడుచుకుంటూ అడిగింది కౌసల్య.

"నిజం చెబితే అది దూరం అవుతుందని నీ పెంచిన మమకారం ఆందోళన చెందుతోంది. అయినా ఇది ఎప్పుడో అప్పుడు చెప్పక తప్పదు. ఎల్లుండి ఆదివారం నాడు దాన్ని బయటకు తీసికెళ్లి అక్కడ అన్ని వివరాలు చెబుతాను" అన్నాడు శ్రీధర్.


అతని మాటలకు ఏం చెప్పాలో అర్థం కాక కౌసల్య మౌనం దాల్చింది.

* * *

ఆదివారం నాడు శ్రీధర్ కుటుంబంతో ఊరికి దగ్గర్లోని బౌద్ధారామానికి దగ్గరికి వెళ్లాడు. ఆదివారం కనుక అక్కడికి చాలా మంది విహారయాత్రకి వస్తుంటారు. ఆ బౌద్ధారామానికి గొప్ప చరిత్ర ఉంది. దానికి సంబంధించిన వివరాలను పురావస్తు శాఖ ఒక బోర్డు మీద మూడు భాషల్లో విపులంగా రాసింది.

అక్కడ ఒక ఎత్తైన ప్రదేశంలో ఏడు మీటర్ల ఎత్తున్న ప్రధాన స్థూపం, పక్కనే బౌద్ధ విహారాలు ఉన్నాయి. ఆరామం చుట్టూ ప్రహరీ గోడ, నలు దిక్కులా ధ్యానముద్రలో ఉన్న బుద్ధ విగ్రహాలు ఉన్నాయి.

శ్రీధర్ కూతురు ప్రియతో బౌద్ధారామం గురించి చెబుతుంటే, కౌసల్య వాటిని ఆసక్తిగా గమనించ సాగింది. ఇంతలో వాళ్ల దగ్గరికి ఒక గైడ్ వచ్చాడు. అతని మెడలో పురావస్తు శాఖ వారిచ్చిన గుర్తింపు కార్డు ఉంది.



గన్నవరపు నరసింహమూర్తి

"సార్! ఈ బౌద్ధారామం చాలా గొప్పది. దీని గురించి తెలుసుకోవాలంటే నాలాంటి గైడ్ ఉండాలి. చూపించమంటారా?" అడిగాడు.

శ్రీధర్ అతని వైపు ఆసక్తిగా చూస్తూ "మీ ఫీజు ఎంత?" అడిగాడు.

"రెండు వందలు. డబ్బు గురించి చూడకండి. మీ అమ్మాయికి కూడా వీటి గురించి బాగా తెలుస్తుంది. పిల్లలు చరిత్ర గురించి తెలుసుకోవడం చాలా ముఖ్యం"అన్నాడతను.

"సరే! చూపించండి" అన్నాడు శ్రీధర్.

అతను వాళ్లను ఆరామం వైపు తీసికెళ్లాడు.

శ్రీధర్ అతనితో 'అసలు ఈ బౌద్ధ ఆరామాలు అంటే ఏమిటి? ఎందుకు వీటిని కట్టారో చెప్పండి" అడిగాడు.

అతను కొద్దిసేపు ఆలోచించి "సార్! అసలు ఆరామాలు కంటే బౌద్ధమతం గురించి తెలుసు కోవటం ముఖ్యం. ప్రపంచంలో బౌద్ధమతం ఎంతో ముఖ్యమైనది. 50 కోట్ల మంది దీన్ని అనుసరిస్తు న్నారు. గౌతమ బుద్ధుడు బోధించిన ధర్మ సూత్రాలు బౌద్ధానికి మూలం. 'త్రిపిటకములు' అనే శాస్త్ర గ్రంథం బౌద్ధానికి ప్రధాన ఆధామని చరిత్ర చెబుతోంది. ఇందులో మహాయానం, హీనయానం (థెరవాద) అని ఉంటాయి. తూర్పు ఆసియా, టిబెట్టులలో మహాయానం అధికంగా ప్రాచుర్యంలో ఉంది.

అతను చెబుతుంటే ప్రియ "అంకుల్! గౌతమ బుద్ధుడు ఎవరో చెప్పండి?' ' అడిగింది.

అతను ప్రియవైపు తిరిగి "చాలామంచి ప్రశ్న అడిగావు. ఆయన గురించి చెబుతాను" అంటూ చెప్పడం ప్రారంభించాడు.


"గౌతమ బుద్ధుడు బౌద్ధ ధర్మానికి మూల పురుషుడు. ఇతన్ని సిద్ధార్థుడు అనీ పిలుస్తారు. ఆయన కపిలవస్తు దేశానికి చెందిన లుంబినీ పట్నంలో క్రీ.పూ. 563లో జన్మించాడు. ఇది ప్రస్తుత నేపాల్ దేశంలో ఉంది. సిద్ధార్థునికి 16 ఏండ్ల ప్రాయంలో యశోధరతో వివాహమైంది. వీరికి రాహులుడు అనే కుమారుడు పుట్టాడు. సిద్ధార్థుడు 29 ఏళ్ల వరకు రాజభోగాలను అనుభవించాడు.

ఆయనకు ప్రపంచంలోని కష్టసుఖాలు తెలియ కూడదని ఆయన తండ్రి శుద్ధోధనుడు ఎంత ప్రయ త్నించినా ఒకరోజు సిద్ధార్థుడు ఒక ముసలి వ్యక్తిని, ఒక రోగ పీడితుడిని, కుళ్లి పోతున్న శవాన్ని, ఒక సన్యాసిని చూశాడు. వీటిని నాలుగు దృశ్యాలు అంటారు.

అప్పుడు సిద్ధార్థుడు తన రథసారథి చెన్నుడు ద్వారా, 'ప్రతి మానవుడూ ముసలితనం నుంచి తప్పించుకోలేడు'అని తెలిసి తీవ్రంగా కలత చెందాడు. ముసలితనాన్ని, రోగాన్ని, మరణాన్ని జయించాలనే సంకల్పంతో సన్యాస జీవితం గడపాలనుకున్నాడు.

ఎవరికీ చెప్పకుండా రాజమందిరం విడిచి వెళ్లిపోయాడు. దీన్నే మహాభి నిష్క్రమణ అంటారు. ఆ తరువాత సన్యాసిగా ఎన్నో ప్రదేశాలు తిరిగాడు. చివరకు బుద్ధ గయలో ఒక బోధివృక్షం నీడలో పరమ సత్యం తెలుసుకునేందుకు భగవధ్యానం చేశాడు.

తన 35వ ఏట, 49 రోజుల ధ్యానం తరువాత సిద్ధార్థునకు జ్ఞానోదయం అయింది. మానవుని అజ్ఞానానికి, కష్టాలకు కారణాలను, వాటి నుండి విముక్తి పొందడానికి మార్గాలను తెలుసుకోగలిగాడు సిద్ధార్థుడు. దీన్నే బౌద్ధంలో నిర్వాణ మంటారు.



**'జాగృతి' నిర్వహించిన స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక నవలల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన రచన**

తాను నిర్యాణం చెందేవరకు గంగానదీ పరివాహక ప్రాంతాలైన ఉత్తర ప్రదేశ్, బిహార్‌లలో పర్యటించి ప్రజలకు తన సిద్ధాంతాలను వివరించాడు.

తన 80వ ఏట బుద్ధుడు "All composite things pass away. Strive for your own liberation with digilence" అని చెప్పి నిర్యాణం చెందాడు.

బుద్ధుని శరీరానికి అంత్యక్రియలు జరిపిన తరువాత ఆయన అస్థికలను వివిధ బౌద్ధస్థూపాలలో భద్రపరిచారు. శ్రీలంకలోని దలదమారిగావ స్థూపంలో బుద్ధుని కుడి పన్ను భద్రపరచారు. దీన్నే 'టెంపుల్ ఆఫ్ టూత్' అంటారు. అలాగే అతని కర్ణాభరణం ఇప్పటికీ నాగార్జున కొండ ప్రదర్శన శాలలో బంగారు డబ్బీలో భద్రపరచపడింది. బుద్ధుడు పాళీ భాషలో మాట్లాడేవాడనీ చెబుతారు" అని వివరించాడు.

"ఇప్పుడు బౌద్ధమతం,ఆరామాల గురించి చెప్పండి. అసలు ఈ స్థూపాలు ఎందుకు నిర్మిస్తారు?" అడిగాడు శ్రీధర్.

"ప్రపంచంలో క్రైస్తవ, ఇస్లాం, హిందూ మతాల తరువాత నాలుగవ పెద్ద మతం బౌద్ధం. బుద్ధుడు, మానవులందరూ సమానమని ప్రవచించి, కుల వ్యవస్థలోని అంతరాలను నిరసించాడు. ఒక వ్యక్తి జన్మవలన కాకుండా కర్మ కారణంగా మాత్రమే బ్రాహ్మణుడు లేదా ఛండాలుడుగా నిర్ణయించ బడతాడని చెప్పాడు.


బౌద్ధమతంలో నాలుగు పరమ సత్యాలు చెప్పారు. దుఃఖం నుంచి విముక్తిని పొందే మార్గం. ఇవి బుద్ధుడు తన జ్ఞానోదయం తరువాత తన సహచరులైన శ్రమణులకు చెప్పిన బోధనలు.

ఆంధ్రదేశంలో గుంటుపల్లి, భట్టిప్రోలు బౌద్ధ క్షేత్రాలు. క్రీ.పూ. 300 కాలం నాటివి. బుద్ధుడు స్వయంగా భట్టిప్రోలును సందర్శించాడు.అమరావతి స్థూపంలో బుద్ధుడి ధాతువులను నిక్షిప్తం చేసినట్లు చరిత్ర చెబుతోంది. భట్టిప్రోలు, అమరావతి, నాగార్జున కొండ, ఘంటశాల, శాలిహుండం, రామతీర్థం, కోటిలింగాల మొదలైన ప్రాంతాల్లో బౌద్ధ స్థూపాలు బయటపడ్డాయి. అశోకుడి శిలాశాసనాలు కర్నూలు జిల్లాలోని ఎర్రగుడిలో లభించాయి" వివరంగా చెప్పాడు గైడ్.

అప్పటికి సమయం ఒంటిగంటైంది. అతనికి డబ్బిచ్చి పంపి వేశాడు శ్రీధర్.

ఆ తరువాత అక్కడికి దగ్గరలోని రావి చెట్టు కింద కూర్చొని ముగ్గురూ ఇంటి నుంచి తెచ్చుకున్న పులిహోర, దద్ధ్యోజనం తినడం మొదలు పెట్టారు.

"ప్రియా! ఎలా ఉంది బౌద్ధ ఆరామం? ఇప్పుడు



బౌద్ధమతం గురించి, స్థూపాలు గురించి తెలిసిందా?" అడిగాడు శ్రీధర్.

"గైడ్ వాటి గురించి బాగా చెప్పాడు నాన్నగారూ! తెలియని ఎన్నో విషయాలు తెలిశాయి. రేపు నా ఫ్రెండ్సందరికీ వాటి గురించి చెబుతాను" అంది ప్రియ.

ఆ తరువాత కొద్దిసేపు మౌనం తరువాత....

"ప్రియా! నేను నిన్ను ఇక్కడికెందుకు తీసుకు వచ్చానో తెలుసా? కేవలం ఈ బౌద్ధ ఆరామాన్ని చూడటానికి మాత్రమే కాదు. మొన్న నువ్వు నన్ను "నేను మీ పిల్లనేనా?'అని అడిగావు. ఆ ప్రశ్నకు సమాధానం చెప్పడానికే నిన్ను పిలిచాను. వాస్తవానికి, ఈ నిజాన్ని నీకు చెప్పవలసిన అవసరం లేదు. కానీ భవిష్యత్తులో అది నీ మీద ప్రభావం చూపించే అవకాశం ఉంది. అందుకే నీ గురించిన కొన్ని విషయాలు చెబుతాను. అది పూర్తిగా వింటే నీకు సరియైన అవగాహన వస్తుంది. నీ అనుమానాలు, సందేహాలు తొలగిపోయి నువ్వు ప్రశాంతంగా ఉండొచ్చు"అన్నాడు శ్రీధర్.

తండ్రి మాటలకు ప్రియ ఆశ్చర్యపోయి, తండ్రి ఏం చెబుతాడోననీ ఆమెకు ఆసక్తిగా ఉంది.

శ్రీధర్ జరిగింది చెప్పడం మొదలు పెట్టాడు. కౌసల్య, ప్రియ ఇద్దరూ ఏకాగ్రతతో వినసాగారు.

* * *

నేను డిగ్రీ విజయనగరంలో పాసయ్యాను. ఆ తరువాత బి.ఈడీ చేశాను. నాకు లెక్చరర్ కావాలని ఉండేది. దానికి కారణం మా లెక్చరర్లు. మరీ ముఖ్యంగా ఇంగ్లీషు లెక్చరర్ అనంతరామ్ గారు. ఆయన పాఠం చెబుతుంటే.. పాఠాన్ని కాక ఆయన హావభావాలను, ఆయన డ్రెస్సును, ఆయన మాట్లాడే భాషను ఎక్కువగా గమనించేవాడిని. ఆయన చెబుతుంటే తరగతి గదిలో సూది మొన పడితే వినిపించేటంతటి నిశ్శబ్దం ఉండేది.

అప్పట్లో మా కాలేజీ కుర్రవాళ్లకు ఆయన హీమాన్. అందరూ ఆయనలా దుస్తులు ధరించే వారు. చెప్పులు వేసుకొనే వాళ్లు.

అలా ఆయనను చూసి నేను లెక్చరర్ కావాలనుకున్నాను. బీఏ అయిపోగానే ఎమ్.ఎ. ఇంగ్లీషు లిటరేచర్ చదువుతానని మా నాన్నగారితో చెబితే 'నాకు ఇంక చదివించే స్తోమత లేదు. నీకు ఇద్దరు చెల్లెళ్లున్నారు. వాళ్లకి పెళ్లిళ్లు చేయాలి. అందుకు నీ సహాయం అవసరం. బి.ఈడీ చేస్తే టీచరుగా ఉద్యోగం వస్తుంది"అన్నారు..

ఆ మాటలతో నాలో ఉత్సాహం నీరు కారిపోయింది. చేసేదేంలేక బి.ఈడీ చేసాను. అదృష్టవశాత్తూ నేను పాస్ అయిన వెంటనే డీయస్సీ ద్వారా టీచర్‌గా ఎంపికయ్యాను. అరకు దగ్గర ఏజన్సీలో పోస్టింగ్ ఇచ్చారు.

పాడేరుకి 40 కిలోమీటర్ల దూరంగా గిరిజన పాఠశాలలో ఏకోపాధ్యాయుడిగా వేసారు. అక్కడికి చేరాలంటే 10 కిలోమీటర్లు కొండ ఎక్కాలి.

అది ఏజెన్సీ ప్రాంతం... అంటే కొండ ప్రాంతం. అది తూరుపు కనుమల్లో ఉంది. అక్కడ చిన్న చిన్న గిరిజన తండాలుంటాయి. రోడ్డు మార్గం ఉండదు. మనిషికి అనారోగ్యం చేస్తే అతన్ని మంచం మీద పడుకోబెట్టి మనుషులు మోస్తూ కొండ దిగి హాస్పిటల్‌కి తీసికెళ్లాలి. నీటి సదుపాయం కూడా ఉండదు. కొండల్లో పారే గెడ్డ నీరే తాగాలి. గిరిజనులు పోడు వ్యవసాయం చేసుకుంటూ బతుకుతారు.

అక్కడ నాలుగేసి గ్రామాలకు ఒక ఏకోపాధ్యాయ పాఠశాలలు ఐటీడీఏ ఆధ్వర్యంలో నడుస్తుంటాయి. ఆ పాఠశాలలో విద్యార్థుల హాజరు చాలా తక్కువగా ఉంటుంది. దానికి కారణం ఉపాధ్యాయులు అక్కడ ఉండరు. మైదానం ప్రాంతంలో పట్నాల్లో ఉంటూ వారానికి ఒకటి, రెండు రోజులు వస్తుంటారు.

అలాగే వైద్య సౌకర్యాలు కూడా తక్కువే. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నా డాక్టర్లు ఉండరు. వారు కింద పట్నాల్లో ప్రైవేట్‌గా ప్రాక్టీసు చేసుకుంటూ ఉంటారు. నర్సులే వైద్యం చేస్తుంటారు.

ఉద్యోగస్తులు హాజరు కాకపోవడానికి వాళ్లు చెప్పే కారణం విచిత్రంగా ఉంటుంది. నక్సలైట్లు ప్రభుత్వ ఉద్యోగులకు వ్యతిరేకమని, వాళ్ల వల్ల తమ ప్రాణాలకు ముప్పు ఉండటం వల్ల అక్కడ ఉండటం ప్రమాదం అని ఉద్యోగులు చెబుతుంటారు.

ప్రభుత్వ ఉద్యోగస్తులు, అధికారుల అవినీతి వల్లే మేము గిరిజనులకు సహాయం చెయ్యవలసి వస్తోందని నక్సలైటు నాయకులు చెబుతుంటారు. పోలీసులు తమని విచక్షణారహితంగా చంపుతుంటారనీ నక్సలైట్లు అంటే... ప్రభుత్వ ఉద్యోగులుగా శాంతి భద్రతలను కాపాడటం తమ బాధ్యత అన్నది పోలీసుల వాదన..

ఈ పిల్లీ ఎలుకల పోరాటంలో నలిగి పోయేది, బాధలు పడేది మాత్రం అమాయకులైన గిరిజనులే.

అందుకే ప్రభుత్వం భారీగా నిధులు ఖర్చు పెడుతున్నా..గిరిజనుల జీవితల్లో పెద్దగా మార్పు లేదు. ఇప్పటికీ వాళ్లకి సరియైన విద్య, వైద్యం అందుబాటులో లేవు. వర్షాకాలంలో కలుషితమైన నీరు తాగడం వల్ల చాలామంది డయేరియాతో చనిపోతుంటారు.

ఇక చదువుల్లో, ఉద్యోగాల్లో ప్రభుత్వం వాళ్లకి 7.5 శాతం రిజర్వేషన్లు కల్పించినా వాటిని మైదాన ప్రాంతానికి చెందిన గిరిజన విద్యావంతులే అనుభవిస్తూ ఉండటం వల్ల కొండల్లో అతి దీనావస్థలో నివసిస్తున్న గిరిజనులకు అన్యాయం జరుగుతుంటుంది.

నన్ను కెంగువ అనే గిరిజన గ్రామంలోని ఏకోపాధ్యాయ పాఠశాలలో నియమించారు. ఆ ఊరు వెళ్లాలంటే..పాడేరులో దిగి కొండల్లో 20 కిలోమీటర్లు నడవాలి. పదిహేను కిలోమీటర్ల వరకు ఆటోలు వెళతాయి. అక్కడ నుంచి కొండ ఎక్కాలి.

ఆ ఊరికి నేను వెళ్లేసరికి మిట్టమధ్యాహ్నం అయింది. ఊరి సర్పంచ్ పేరు బిడ్డికదొర. నేను ఆయన ఇంటికి వెళ్లేసరికి పూటుగా తాగి మంచం మీద పడుకుని ఉన్నాడు.

ఊళ్లోని పిల్లలు అతన్ని లేపి నేను స్కూల్లో చేరడానికి వచ్చానని చెప్పారు. అతను లేచి తూగుతూ స్కూలు దగ్గరకు వచ్చాడు. ఆ ఊళ్లో 20 ఇళ్లు ఉన్నాయి. అన్ని పెంకులతో వేసినవే. ఆ పెంకులు ఎగిరి పోకుండా వాటిమీద రాళ్లు పెట్టి తాళ్లతో కట్టారు. అన్ని ఇళ్లూ ఒక వరసలో లేవు. అక్కడక్కడ కొండవాలులో విసిరేసినట్లున్నాయి. ఊరి మధ్యలో చింతచెట్లు. దారిలో మురికి నీరు. అక్కడే కొందరు పిల్లలు మామిడి టెంకలతో ఆడుతూ కనిపించారు.

స్కూలు ఊరికి చివర్లో ఉంది. ఆ స్కూలు 8 నెలల నుంచి మూతపడి ఉందనీ అక్కడి పిల్లలు చెప్పారు. ఉపాధ్యాయుడు ఉద్యోగం మానేయడంతో ఆ స్కూలు మూతపడింది. మళ్లీ ఇన్నాళ్లకు నన్ను వేశారు. స్కూలు అన్న పేరే గానీ చాలా ఘోరంగా ఉంది.

ఏస్బెస్టాస్ రేకుల షెడ్డు అది. లోపల గోడలన్నీ బూజుపట్టి ఉన్నాయి. ఇది వరకటి ఉపాధ్యాయుడు అందులోనే ఉండేవాడనీ, వంట కూడా ఆ గదిలోనే చేసుకునేవాడని పిల్లలు చెప్పారు.

తలుపు కూడా చాలా ఘోరమైన స్థితిలో ఉంది. లోపల ఏ పాములుంటా యోనని భయం వేసింది. తలుపు తియ్యగానే అందులోంచి గబ్బిలాలు ఎగురు కుంటూ బయట కొచ్చాయి. తలుపుని గట్టిగా లాగగానే అది ఊడిపోయింది. ఆ స్కూలుని చూడగానే నాకు చాలా నిరుత్సాహం కలిగింది.

నేను వచ్చాననీ తెలిసింది కాబోలు ఊళ్లోని మరి కొంతమంది అక్కడికి వచ్చారు. నన్ను అందులోనే ఉండమని సర్పంచు బిడ్డిక దొర చెప్పి వెళ్లిపోయాడు.

ఆ తరువాత పిల్లల సాయంతో స్కూలుని చీపుళ్లతో శుభ్రంగా తుడిపించాను. తలుపును బాగు చేయించి మళ్లీ ద్వారానికి బిగించాను. దగ్గర్లోని కొండగెడ్డ దగ్గరికి వెళ్లి స్నానం చేసి వచ్చాను. ఇంతలో ఇద్దరమ్మాయిలు స్టీలు బిందెలతో నీళ్లు తెచ్చారు.

ఆ రోజంతా స్కూలుని శుభ్రం చెయ్యడంతోనే గడిచిపోయింది. రాత్రి పక్కింటి నుంచి ఒక వైరుతో బల్బు పెట్టాను. ఆ వెలుగులో వండుకున్నాను. అక్కడ ఏమీ దొరకవని ముందుగానే ఊహించి బియ్యం, కూరగాయలు నాతోపాటు తెచ్చుకున్నాను.

ఆ మర్నాడు ఊళ్లోకి వెళ్లి పిల్లల్ని స్కూలుకి పంపవలసిందిగా తల్లితండ్రులకు చెప్పాను. ఆరోజు ఓ పదిమంది పిల్లలు స్కూలుకి వచ్చారు. బోర్డుని శుభ్రం చేసి వాళ్లకి అ,ఆలు, ఏబీసీడీలు చెప్పాను.

**(సశేషం)**

భాగం-50

# మార్క్సిజం-శ్రీరామరాజ్యం



# మార్క్సవాదం

**మార్క్స వాదాన్ని ద్వంద్వాత్మక భౌతికవాదం అని పిలుస్తారు. ఆ సిద్ధాంతం మార్క్స నిజజీవితంలో అనుభవించిన పరిస్థితులకు ప్రతిబింబంగా నిలిచింది. మార్క్సిస్టుల ప్రకారమే ఆ వాదం స్థిరమైనది కాదు. కాలానుగుణంగా అనేక మార్పులు చెందుతూ ఉంటుంది. అందువల్లనే మార్క్స తరువాత లెనిన్ వంటివారు మార్క్స సిద్ధాంతాన్ని పునర్నిర్వచించారు.**

కార్ల్ మార్క్స (1818–1883) 'కాపిటల్' వంటి అనేక గ్రంథాల ద్వారా సమాజవాదం, సామ్యవాదాలకు పరిష్కృత రూప వ్యాఖ్యలు అందిం చాడు. సమాజవాదం, సామ్యవాదాలు మార్క్స కంటే చాలా పూర్వంనుంచి ప్రచారంలో ఉన్నాయి. ప్లేటో, మోర్ మొదలైనవారు, వారికంటే పూర్వులైన ధార్మిక వ్యక్తులు సామ్యవాద సమాజ చిత్రణలు చేశారు. 'వసుధైవ కుటుంబకం' అనేది చాలా పాతకాలం నుంచి ఉన్న భావనే. కానీ మార్క్స సామ్యవాదం లేదా సమష్టి వాదాన్ని అవసరమే కాదు, తప్పనిసరి అని చెప్పాడు.

అతను చారిత్రక విశ్లేషణకు కొత్త పద్ధతిని సృష్టించాడు. పెట్టుబడిదారీ వ్యవస్థను గట్టిగా విమర్శించాడు. ఈ కార్యక్రమంలో ఫ్రెడరిక్ ఎంగెల్స్ నుంచి అతనికి ఎంతో సహకారం లభించింది. ఈ తత్త్వం ఆధారంగా 1917లో లెనిన్ నాయకత్వంలో రష్యన్ విప్లవం జరిగింది. లెనిన్ తర్వాత స్టాలిన్ సామ్యవాద నాయకత్వాన్ని తన చేతిలోకి తీసుకున్నాడు. చైనాలో మావో జెడాంగ్ సామ్య వాదాన్ని ముందుకు తీసుకెళ్లారు. వారు కొత్త పరిస్థితులకు తగినట్లు మార్క్సిజాన్ని వివరించారు.

మార్క్స మధ్యతరగతి కుటుంబంలో పుట్టాడు. మొదట న్యాయవాద విద్య చదివాడు, తర్వాత పాత్రికేయుడిగా మారాడు. 'హెగెలియనిజం'ను అధ్యయనం చేశాడు. మానవతావాదం నుండి స్ఫూర్తిపొంది కార్మిక ఉద్యమంలో చేరాడు, త్వరలోనే దానికి నాయకుడయ్యాడు. అతని జీవికకు అతని రచనలు, ఎంగెల్స్ చేసిన సహాయాలే ఆధారాలయ్యాయి. పేదరికంలో కూడా తన లక్ష్యాన్ని వీడలేదు. ప్లేటో, అరిస్టాటిల్, హెగెల్‌లాంటి గొప్ప తత్త్వవేత్తల స్థాయిలో అతను ఉన్నాడు. అతని ప్రసిద్ధ రచనలు: 'పావర్టీ ఆఫ్ ఫిలాసఫీ,' 'మేనిఫెస్టో ఆఫ్ కమ్యూనిస్ట్ పార్టీ,' 'ఎయిటీన్త్ బ్రూమేయర్ ఆఫ్ లూయీ బోనపార్టే' 'ఏ కంట్రిబ్యూషన్ టు ది క్రిటిక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ,' 'దాస్ కాపిటల్,' 'సివిల్ వార్ ఇన్ ఫ్రాన్స్,' 'ది గోథా ప్రోగ్రస్,' 'క్లాస్ స్ట్రగుల్ ఇన్ ఫ్రాన్స్,' 'రివల్యూషన్ అండ్ కౌంటర్ రివల్యూషన్.'

ఎంగెల్స్ సంపన్న వ్యాపార కుటుంబంలో పుట్టాడు. అతని తండ్రి ప్రష్యాలో వ్యాపారి. యుద్ధ సమయంలో బ్రిటన్లోని మాంచెస్టర్లో స్థిరపడ్డాడు. అతను ఒక మిల్ యజమాని. మార్క్సుకు ఆర్థికంగా, బౌద్ధికంగా జీవితాంతం సహాయం చేశాడు. మార్క్స చనిపోయిన తర్వాత కమ్యూనిస్ట్ ఉద్యమాన్ని నడిపించాడు. మార్క్స సిద్ధాంతాలను విజ్ఞానం, తత్త్వశాస్త్రంతో ముడిపెట్టాడు. అతని అనేక పుస్తకాలు ప్రఖ్యాతి గాంచాయి.

లెనిన్ బోల్షెవిక్ విప్లవ దళాన్ని ప్రారంభించాడు. 20వ శతాబ్దంలో రష్యాకు చెందిన సోషలిస్ట్ డెమోక్రటిక్ పార్టీ బోల్షెవిక్, మెన్షెవిక్ అనే రెండు భాగాలుగా విడిపోయింది. బోల్షెవిక్ దళం విప్లవాత్మకమైనది, లెనిన్ దాని నాయకుడు. అనేక పోరాటాల తర్వాత 1917లో అతని నేతృత్వంలో సోషలిస్ట్ విప్లవం జరిగింది. జీవితమంతా అతను సోవియట్ పాలనకు కీలక వ్యక్తిగా ఉన్నాడు. అతని రచనలు 11 గ్రంథాలుగా లభిస్తున్నాయి.

మార్క్స తత్త్వాన్ని ద్వంద్వాత్మక భౌతికవాదం లేదా ఐతిహాసిక భౌతికవాదం ( డైలెక్టికల్ మెటీరియలిజం లేదా హిస్టారికల్ మెటీరియలిజం) అని పిలుస్తారు. ఇది ద్వంద్వాత్మక దృక్పథంతో ప్రాకృతిక సంఘటనలను విశ్లేషిస్తుంది. భౌతికవాద దృష్టితో వాటిని వివరిస్తుంది, ఊహిస్తుంది, సిద్ధాంతీకరిస్తుంది. స్టాలిన్ ప్రకారం, 'మార్క్సిజం అంధవిశ్వాసం కాదు.' కాబట్టి దాని వివరణ కాలానుగుణంగా మారుతుంది. సామ్రాజ్యవాద, కార్మిక విప్లవయుగంలో లెనిన్ దాన్ని తిరిగి వ్యాఖ్యానించాడు. అందుకే లెనినిజాన్ని ప్రధానంగా శ్రామికవర్గ అధినాయకత్వ తత్త్వంగా పిలుస్తారు. చరిత్ర, సామాజిక, ఆర్థిక వివరణ, విలువ – అదనపు విలువల సిద్ధాంతం, వర్గ పోరాటం, కార్మిక అధినాయకత్వం దానిలోని ప్రధాన విషయాలు.

**మార్క్స ఈ కింది విషయాలను రుజువు చేశాడు:**

1. వర్గాల (క్లాసెస్) అస్తిత్వం ఉత్పత్తి వ్యవస్థకు తగినట్లుగా ఉంటాయి. బానిసత్వ యుగంలో వర్గాల అస్తిత్వం, వాటి మధ్య పోరాటం ఆ యుగ ఉత్పత్తికి సరి పోయాయి. అలాగే భూస్వామ్య, పెట్టుబడిదారీ యుగాల్లో వర్గాలు ఆ యుగాల ఉత్పత్తికి అనుగుణంగా ఉన్నాయి.

2. వర్గపోరాటం కార్మికవర్గ అధినాయకత్వానికి తప్పనిసరిగా దారి తీస్తుంది.

3. ఈ అధినాయకత్వం తాత్కాలికమైనది, తర్వాత వర్గరహిత సమాజం ఏర్పడుతుంది.

హెగెల్ చెప్పిన ద్వంద్వవాదం, బ్రిటిష్ ఆర్థికశాస్త్రం, ఫ్రెంచ్ సోషలిస్ట్ తత్త్వం వంటివాటి అధ్యయనంతో అతను ద్వంద్వాత్మక భౌతికవాదం అనేపేరుతో కొత్త తత్త్వశాస్త్రాన్ని సృజించాడు. హెగెల్ చెప్పిన ద్వంద్వవాదంలో ఆలోచనకు ప్రధాన స్థానం ఉంది. 'బాహ్యప్రపంచం అంతర్గత ఆలోచనల ప్రతిబింబం' అని అతను చెప్పాడు. కానీ మార్క్స భౌతిక ప్రపంచాన్ని మాత్రమే నమ్మాడు, అదే ఆలోచనలకు మూలమని చెప్పాడు.

హిందీమూలం : కరపాత్రీ స్వామి
అనువక్త : నేతి సూర్యనారాయణశర్మ

# 'మక్కా' ఒప్పం



పాకిస్తాన్, సౌదీ అరేబియా, టర్కీ దేశాలు ఆగస్టు 7, 2026న మక్కాలో 'మక్కా జాయింట్ డిఫెన్స్ అగ్రిమెంట్' అనే చారిత్రాత్మక రక్షణ ఒప్పందంపై సంతకాలు చేశాయి. దీని ప్రకారం ఈ మూడు దేశాల్లో ఏ ఒక్క దేశంపై దాడి జరిగినా ముగ్గురిపై దాడి జరిగినట్లుగానే భావించి సమష్టిగా ఎదుర్కొంటాయి. పశ్చిమాసియా సంక్షోభం, అమెరికాపై భద్రతాపరమైన నమ్మకం తగ్గడం వంటి కారణాలు ఈ కూటమి ఏర్పాటుకు దోహదంచేశాయి. ఈ కొత్త త్రైపాక్షిక కూటమి అంతర్జాతీయ భౌగోళిక రాజకీయాలపై, ముఖ్యంగా భారత్ భద్రతా వ్యూహాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. నాటో తరహాలో ఒకరిపై దాడి జరిగితే అందరూ స్పందించేలా ఈ ఒప్పంద రూపకల్పన జరిగింది.

సౌదీ అరేబియా ఆర్థిక బలం, టర్కీ అత్యాధునిక డ్రోన్లు, సాంకేతిక పరిజ్ఞానం, పాకిస్తాన్ సైనిక వనరులు ఈ నేపథ్యంలో కలిసికట్టుగా పనిచేస్తాయి. ఈ ఒప్పందం వల్ల ఆర్థికంగా బలహీనపడిన పాకిస్తాన్‌కు, సౌదీ ఆర్థికఅండ, టర్కీ సాంకేతి పరిజ్ఞానం బలాన్ని చేకూరుస్తాయి. సౌదీ అరేబియాతో భారత్ గత దశాబ్దకాలంగా ఇంధన, వాణిజ్య, రక్షణ రంగాల్లో బలమైన సంబంధాలను ఏర్పరుచుకుంది. అయితే, సౌదీ ఈ కొత్త ఒప్పందంలో పాక్‌తో మరింత దగ్గరవడం వల్ల భారత్–సౌదీ దీర్ఘకాలిక వ్యూహాత్మక భాగస్వామ్యానికి కొన్ని పరీక్షలు ఎదురుకావచ్చు. టర్కీ కూడా గతంలో అనేక వేదికలపై భారత్‌కు వ్యతిరేకంగా, పాక్‌కు అనుకూలంగా ముఖ్యంగా కశ్మీర్ అంశంపై వ్యాఖ్యలు చేసింది. ఇప్పుడు ఈ ఒప్పందం వల్ల, టర్కీ ఆధునిక పరిజ్ఞానం పాకిస్తాన్‌కు అందుబాటులోకి రావడం ఖాయం. ఈ నేపథ్యంలో పాక్‌తో ఏదైనా సైనిక సంక్షోభం ఏర్పడితే భారత్ తన యుద్ధ సన్నద్ధతను, వ్యూహాలను మార్చుకోక తప్పదు. ఈ పరిణామాలపై భారత విదేశాంగ శాఖ పూర్తి నిఘా ఉంచి, జాతీయ ప్రయోజనాలను కాపాడుకోవడానికి తగిన చర్యలు చేపడుతోంది. అదే సమయంలో సౌదీతో ఉన్న ద్వైపాక్షిక సంబంధాలను కాపాడుకుంటూనే, పశ్చిమాసియాలో యూఏఈ, ఇజ్రాయెల్ వంటి ఇతర మిత్రదేశాలతో వ్యూహాత్మక బంధాన్ని భారత్ మరింత పటిష్టం చేసుకోవాల్సి ఉంటుంది.

**పాక్‌కు దౌత్య, సైనిక మద్దతు**

భారత్‌తో నిరంతరం సరిహద్దు వివాదాలు ఉండే పాకిస్థాన్‌కు ఈ ఒప్పందం వల్ల పెద్ద దౌత్య, సైనిక మద్దతు లభించినట్లయింది. భవిష్యత్తులో భారత్ గనుక పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలపై సర్జికల్ స్ట్రైక్స్ చేస్తే, ఈ ఒప్పందం ప్రకారం టర్కీ లేదా సౌదీ జోక్యం చేసుకోక తప్పదు. టర్కీ ఇప్పటికే కాశ్మీర్ విషయంలో పాకిస్థాన్‌కు బహిరంగంగా మద్దతిస్తోంది. అంతేకాకుండా, అత్యాధునిక బైరెక్టర్ డ్రోన్లు, మిలిటరీ ఎలక్ట్రానిక్స్ సాంకేతికతను పాకిస్థాన్‌కు బదిలీ చేసే అవకాశం ఉంది, ఇది భారత రక్షణ రంగానికి సవాలుగా మారవచ్చు. ఈ కూటమికి వెనుక నుంచి చైనాలాంటి శక్తులు కూడా మద్దతిచ్చే అవకాశం ఉంది, దీనివల్ల భారత్ చుట్టూ వ్యూహాత్మక ఒత్తిడి పెరుగుతుంది. ఇక సౌదీ అరేబియా భారత్‌కు అత్యంత కీలకమైన వాణిజ్య, చమురు భాగస్వామి. భారత్ పెద్ద ఎత్తున సౌదీ నుంచి ముడి చమురును దిగుమతి చేసుకుంటుంది. సౌదీ అరేబియాకు భారత్‌తో ఉన్న ఆర్థిక ప్రయోజనాలు ఎక్కువ. అందువల్ల, పాకిస్థాన్‌తో రక్షణ ఒప్పందం కుదుర్చుకున్నప్పటికీ, భారత్‌తో ఉన్న బలమైన ద్వైపాక్షిక సంబంధాలను పణంగా పెట్టే సాహసం సౌదీ చేయకపోవచ్చు. అయితే ఈ కూటమిలో సౌదీ ఆర్థిక బలం, టర్కీ అధునాతన రక్షణ పరిశ్రమ/పోరాట అనుభవం, పాకిస్థాన్ అణ్వస్త్ర సంపత్తి కలగలిసి ఉన్నాయి. ఇది పశ్చిమాసియా, దక్షిణ ఆసియా అంతటా ఒక శక్తివంతమైన సైనిక బ్లాక్‌గా మారే అవకాశం ఉంది. ఈ దేశాలు భద్రత కోసం ఇకపై పూర్తిగా అమెరికాపైనే ఆధారపడకుండా, తమ స్వంత రక్షణ వ్యవస్థలను బలోపేతం చేసుకోవాలనుకుంటున్నాయనేందుకు ఈ 'మక్కా డీల్' స్పష్టమైన సంకేతం. టర్కీ, పాకిస్థాన్‌లు మొదటి నుంచీ ఇజ్రాయెల్ విధానాలను వ్యతిరేకిస్తున్నాయి. ఈ కొత్త కూటమివల్ల ఇజ్రాయెల్ కూడా పశ్చిమాసియాలో తన వ్యూహాలను మార్చుకోవాల్సి వస్తుంది. ఈ కూటమికి దూరంగా ఉన్న యూఏఈ.. అమెరికా, భారత్, ఇజ్రాయెల్‌లతో మరింత బలమైన, సమతుల్యమైన సంబంధాలను కొనసాగిస్తోంది, ఇది భారత్‌కు కాస్త సానుకూలాంశం.

**నిశితంగా గమనిస్తున్న భారత్**

భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారిక ప్రకటన ప్రకారం, మక్కా ఒప్పంద పరిణామాలను భారతదేశం నిశితంగా గమనించడమే కాకుండా దేశ భద్రత, ప్రాంతీయ శాంతికి భంగం కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నది. ఈ త్రైపాక్షిక కూటమి (పాకిస్థాన్–సౌదీ–టర్కీ) వల్ల ఏర్పడే వ్యూహాత్మక సవాళ్లను ఎదుర్కొనేందుకు భారత్ ప్రధానంగా కొన్ని వ్యూహాలు అనుసరించే అవకాశముంది. ముందుగా భారత్ తనకున్న 'స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్ కౌన్సిల్' ద్వారా సౌదీ అరేబియా నుంచి స్పష్టత కోరవచ్చు. ఈ ఒప్పందంలోని 'ఉమ్మడి రక్షణ' క్లాజ్ కేవలం పశ్చిమాసియా/గల్ఫ్ ప్రాంతానికే పరిమితమా, లేదా భారత్–పాక్ ద్వైపాక్షిక వివాదాలకు కూడా వర్తిస్తుందా అనే దానికి లిఖిత పూర్వక లేదా స్పష్టమైన హామీని భారత్ ఆశిస్తుంది. సౌదీ అరేబియాకు భారత్‌తో ఉన్న వాణిజ్య, ఇంధన, పెట్టుబడి సంబంధాలు చాలా పెద్దవి. ఈ కూటమికి ప్రతిగా మనదేశం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ), ఒమన్, ఖతార్ వంటి ఇతర గల్ఫ్ దేశాలతో సంబంధాలను మరింత పటిష్టం చేసుకుంటూ సమతుల్యతను కాపాడుకునే దిశగా

# దం: భారత్ వ్యూహాలు

అడుగులు వేయవచ్చు. టర్కీ నుంచి పాకిస్థాన్‌కు అత్యాధునిక డ్రోన్లు, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సిస్టమ్స్ బదిలీ అయ్యే ప్రమాదం ఉంది. దీనిని తిప్పికొట్టేందుకు భారత్ స్వదేశీ రక్షణ పరిశోధనలను వేగవంతం చేస్తుంది. పశ్చిమ సరిహద్దుల్లో (అరేబియా సముద్రం, కాశ్మీర్ సరిహద్దుల్లో) భారత్ తన నిఘా, సైనిక సన్నద్ధతను మరింత పెంచుతుంది. ఈ మక్కా ఒప్పందాన్ని ఇరాన్ ఇప్పటికే తీవ్రంగా విమర్శించింది. అందువల్ల, భారత్ చాబహార్ పోర్ట్ వంటి ప్రాజెక్టుల ద్వారా ఇరాన్‌తో దౌత్యపరమైన, వ్యూహాత్మక బంధాన్ని మరింత బలోపేతం చేసుకునే అవకాశం ఉంది. భారత మాజీ విదేశాంగ కార్యదర్శి శ్యామ్ సరన్ వంటి నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఈ ఒప్పందం వల్ల పాకిస్థాన్‌కు దౌత్యపరంగా కొంత బలం చేకూరిన మాట నిజమే అయినప్పటికీ, భారత్‌కు వ్యతిరేకంగా జరిగే ఏ సైనికచర్యలోనూ నేరుగా పాల్గొనే ఉద్దేశం సౌదీ లేదా టర్కీలకు ఉండే అవకాశం లేదు. కాబట్టి భారత్ దీనిపై అనవసర ఆందోళన చెందకుండా, నిశ్శబ్దంగా తన ఆర్థిక, సైనికవ్యూహాలకు పదునుపెట్టడమే ప్రధాన సమాధానం కానుంది.

**భారత్-ఇజ్రాయిల్-యూఏఈ వ్యూహాత్మక కూటమి?**

పాకిస్థాన్–సౌదీ–టర్కీల 'మక్కా రక్షణ ఒప్పందం' నేపథ్యంలో, దానికి ప్రతిగా భారత్, ఇజ్రాయెల్, యూఏఈ దేశాలు ఒక కొత్త అనధికారిక వ్యూహాత్మక కూటమిగా ఏర్పడే అవకాశాలు చాలా బలంగా ఉన్నాయి. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ విశ్లేషకులు ఈ సంభావ్య కూటమిని పశ్చిమాసియాలో ముస్లిం దేశాల నాటో తరహా వ్యవస్థకు ప్రతిగా ఏర్పడబోయే ఒక శక్తివంతమైన 'మెడిటరేనియన్ క్వాడ్' లేదా వ్యూహాత్మక నెట్‌వర్క్‌గా అభివర్ణిస్తున్నారు. భారత్, ఇజ్రాయెల్, యూఏఈ, అమెరికా దేశాలు కలిసి గతంలోనే ఐ2యూ2 కూటమిని (ఇండియా, ఇజ్రాయెల్, యూఏఈ, యూఎస్ఏ) ఏర్పాటు చేశాయి. మక్కా ఒప్పందంవల్ల అమెరికా రక్షణ నీడపై నమ్మకం తగ్గడంతో, ఈ ప్రాంతంలో భద్రతను కాపాడుకోవడానికి భారత్, ఇజ్రాయెల్, యూఏఈలు తమ త్రైపాక్షిక రక్షణ, నిఘా బంధాన్ని మరింత తీవ్రం చేసే అవకాశం ఉంది. సౌదీ అరేబియా ఈ మక్కా ఒప్పందం ద్వారా టర్కీ, పాకిస్థాన్‌లతో చేతులు కలపడం యూఏఈకి అంతగా నచ్చలేదు. యూఏఈ మొదటినుంచీ టర్కీ దూకుడును, పాక్ ఉగ్రవాద విధానాలను వ్యతిరేకిస్తోంది. అందువల్ల యూఏఈ తన రక్షణ కోసం భారత్, ఇజ్రాయెల్‌లను అత్యంత విశ్వసనీయ భాగస్వాములుగా చూస్తోంది. టర్కీ, పాకిస్థాన్‌లు నిరంతరం ఇజ్రాయెల్‌ను వ్యతిరేకిస్తున్నాయి. ఈ కూటమి అణ్వస్త్రాలు కలిగిన పాకిస్థాన్‌తో ముడిపడి ఉండటం వల్ల ఇజ్రాయెల్ మరింత అప్రమత్తమైంది. అబ్రహం ఒప్పందాల ద్వారా యూఏఈతో, అలాగే రక్షణపరంగా భారత్‌తో ఇజ్రాయెల్‌కు ఉన్న బలమైన సంబంధాలు ఈ కొత్త అక్షం ఏర్పడటానికి కారణమవుతాయి. టర్కీ అధునాతన డ్రోన్ సాంకేతికత (బైరెక్టర్ డ్రోన్లు) పాకిస్థాన్‌కు చేరితే ఎదురయ్యే ముప్పును తిప్పికొట్టడానికి భారత్‌కు ఇజ్రాయెల్ రక్షణ సాంకేతికత (యాంటీ–డ్రోన్ సిస్టమ్స్, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్)అవసరం. విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, ఇది నాటోలాంటి ఒక అధికారిక సైనిక ఒప్పందంగా కాకుండా, ఒక "ఫ్లెక్సిబుల్ సెక్యూరిటీ నెట్‌వర్క్" లాగా ఉంటుంది. దీనిలో ప్రధానంగా ఇజ్రాయెల్ హై–టెక్ రక్షణ ఆవిష్కరణలు, యూఏఈ భారీ మూలధనం, భారతదేశపు తయారీ రక్షణ సామర్థ్యాలు కలగలిసి ఉమ్మడి ఆయుధాల ఉత్పత్తికి దారితీయవచ్చు. టర్కీ–పాక్ రక్షణ కదలికలపై నిఘా ఉంచేందుకు ఈ మూడు దేశాలు తమ నిఘా సమాచారాన్ని పరస్పరం పంచుకుంటాయి.


**నకిలీ వార్తలు**

విచిత్రమేమంటే మక్కా ఒప్పందం జరిగిన వెంటనే.. 'దానికి ప్రతిగా భారత్ అధికారిక రక్షణ ఒప్పందం కోసం ఇజ్రాయెల్‌ను సంప్రదించింది' అంటూ టర్కీ, పాక్ మీడియాలో కొన్ని వార్తలు వచ్చాయి. అయితే, భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఈ వార్తలను 'ఫేక్ న్యూస్'గా కొట్టిపారేసింది. భారత్ తొందరపడి ఎలాంటి అధికారిక మిలిటరీ కూటములను ప్రకటించదని, తన వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తిని కాపాడుకుంటూనే తెరవెనుక సహకారాన్ని పెంచుకుంటుందని స్పష్టం చేసింది.

**టర్కీకి ముకుతాడు!**

పాకిస్థాన్‌తో కలిసి టర్కీ కాశ్మీర్ విషయంలో భారత్‌కు వ్యతిరేకంగా వ్యవహరించడం, ఇటీవలి 'మక్కా రక్షణ ఒప్పందం'లో చేరడం వంటి పరిణామాలపై భారతదేశం తీవ్రంగా స్పందిస్తోంది. కేవలం రక్షణ నిగ్రహంతోనే ఆగకుండా, టర్కీ భౌగోళిక బలహీనతలను లక్ష్యంగా చేసుకొని భారత్ ప్రతివ్యూహాలతో గట్టి ఒత్తిడిని తీసుకొస్తోంది. టర్కీ సరిహద్దు వివాదాలు కలిగున్న దేశాలతో భారత్ రక్షణ బంధాలను అనూహ్యంగా బలోపేతం చేస్తోంది. టర్కీ మీడియా కూడా భారత్ తమపై ఒక "ప్రాక్సీ వార్" నడుపుతోందని ఆందోళన వ్యక్తం చేస్తోంది. మధ్యధరా సముద్రంలో టర్కీకి గ్రీస్, సైప్రస్‌లతో తీవ్ర వివాదాలు ఉన్నాయి. భారత్ ఈ రెండు దేశాలతో రక్షణ సంబంధాలను వేగంగా పెంచుతోంది. సైప్రస్, గ్రీస్ దేశాలకు భారత్ తన అత్యాధునిక బ్రహ్మోస్ క్షిపణి వ్యవస్థలను, అధునాతన డ్రోన్లను విక్రయించేందుకు సిద్ధమవుతోంది. టర్కీ మిత్రదేశమైన అజర్‌బైజాన్‌తో పోరాడుతున్న అర్మేనియాకు భారత్ పెద్ద ఎత్తున 'పినాకా' రాకెట్ లాంచర్లు, యాంటీ–ట్యాంక్ క్షిపణులు, రక్షణ సామాగ్రిని సరఫరా చేస్తోంది. తద్వారా టర్కీ ప్రాంతీయ ప్రభావానికి భారత్ బ్రేకులు వేస్తోంది. భారత్–పాక్ ఉద్రిక్తతల్లో టర్కీ జోక్యం చేసుకున్నప్పటి నుంచి భారత్–టర్కీల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం గణనీయంగా క్షీణించింది. భారతీయ పర్యాటకులు టర్కీకి వెళ్లడం తగ్గించారు. దీనివల్ల టర్కీ పర్యాటక ఆదాయం దెబ్బతిన్నది.

జాతీయ భద్రతా కారణాల దృష్ట్యా టర్కీకి చెందిన 'సెలెబీ ఏవియేషన్' వంటి కంపెనీల లైసెన్సులను భారత్ రద్దుచేసింది. టర్కీ అనుసరిస్తున్న భారత్ వ్యతిరేక విధానాల వల్ల భారత్‌లోని ప్రముఖ విశ్వవిద్యాలయాలు టర్కీ విద్యాసంస్థలతో ఉన్న అన్ని రకాల విద్యా, పరిశోధనా ఒప్పందాలను రద్దు చేసుకున్నాయి. టర్కీ అంతర్గతంగా ఎదుర్కొంటున్న కుర్దిష్ తిరుగుబాటు వంటి సున్నితమైన అంశాలను అంతర్జాతీయ వేదికలపై ప్రస్తావించే వ్యూహాన్ని భారత్ పరిశీలిస్తోంది. అదే సమయంలో, టర్కీకి నష్టం జరుగుతోందని గ్రహించిన అంకారా, దాదాపు నాలుగేళ్ల విరామం తర్వాత భారత్‌తో ఫారిన్ ఆఫీస్ కన్సల్టేషన్స్ (ఎఫ్ ఓసీ) చర్చలను తిరిగి ప్రారంభించాల్సి వచ్చింది. భారత్‌ను ప్రసన్నం చేసుకోవడానికి టర్కీ ప్రభుత్వం భారత్‌కు మోస్ట్ వాంటెడ్ డ్రగ్ స్మగ్లర్ సలీండోలాను అప్పగించింది. గతంలోలా కాకుండా, తన సార్వభౌమాధికారానికి భంగం కలిగిస్తే సదరు దేశపు శత్రు దేశాలకు ఆయుధాలు ఇచ్చి మరీ బుద్ధి చెప్పగలనని భారత్ టర్కీ విషయంలో నిరూపిస్తోంది. ఈ భౌగోళిక రాజకీయ వ్యూహం టర్కీని తీవ్ర ఆత్మరక్షణలో పడేసింది.




**జమలాపురపు విఠల్‌రావు**
సీనియర్ జర్నలిస్ట్

# విస్తరించే బంధాల ర

**నేడు రక్షాబంధన్ ఉత్సవం సంపూర్ణ భారతదేశంలో కనిపిస్తోంది. అక్కచెల్లెళ్లు, అన్నదమ్ములకు రాఖి కట్టడం అనే సంప్రదాయం విస్తృతమైంది. మన సాంస్కృతిక కార్యక్రమం భారత దేశవ్యాప్తంగా జరుగుతోందని సంస్కృతి గురించి ఆలోచించేవారందరికీ ఆనందం కలుగుతుంది. కానీ, దీనిని బాహ్యంగా కనిపించే చర్యగా పరిగణించడం సరికాదు. ఈ పని వెనుక ఒక భావన ఉంది. సంకల్పపూర్వకంగా ఏదో ఒక లక్ష్యాన్ని సాధించేందుకు పనిచేయాలి. అప్పుడు అది ఫలవంతం అవుతుంది. కేవలం పూర్వం నుంచి వస్తోంది కాబట్టి చేయాలనుకునే వారు ఎవరైనా ఉంటే, ఆ పని చేసినప్పుడు, కృషి, శ్రమ అయితే ఉంటుంది, కానీ వారికి ఫలితం దక్కదు.**


రక్షాబంధన్ పండుగ నాడు మనం రాఖీ కడతాం. దానిని రక్షా సూత్రం అంటారు. ఒక సోదరి తన సోదరుడికి రాఖీ కట్టినప్పుడు, కట్టే వారిని రక్షించడం కోసమే ఆ రాఖీని కడుతున్నారని సోదరికి, సోదరుడికి అర్థమవుతుంది. ఒక సోదరుడు తన సోదరిని రక్షిస్తాడు.

సమాజ పురోగతికి మొదటి షరతు భద్రత. ఎవరైతే సురక్షితంగా ఉండరో, వారి పురోగతి కూడా జరుగదు. అలాంటివారు పురోగతి, అభివృద్ధిపై ఎలా దృష్టి పెట్టగలరు? వారికి ప్రతి రోజూ తమ ప్రాణాలను రక్షించుకోవలసి వస్తుంది. దానికి ఏర్పాట్లు చేసుకోవడానికే వారి సమయం, వనరులు ఖర్చైపోతాయి. భద్రత లభించిన తర్వాతే పురోగతి జరుగుతుంది. ఈ ప్రగతికి మొదటి మెట్టునుంచే ప్రతి విషయంలో భద్రత, రక్షణ అవసరం. ఇంతకుముందు భద్రత అనే విషయం చాలా సరళంగా ఉండేది, అంటే బయటి దాడుల నుండి, శత్రువుల నుండి, అడవి జంతువుల నుండి, మానవ శత్రువులు మొదలైన వాటి నుండి రక్షణ. వ్యాధులు, అనారోగ్యాలు, పర్యావరణ సమస్యల నుంచి భద్రత – ఇంతటితో ముగిసిపోయే సమస్యలు ఇవి మాత్రమే. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఇప్పుడు, మానవుడు కత్తిని మాత్రమే ఉపయోగించడం మానేసి, దానికంటే ప్రాణాంతకమైన ఆయుధాలను సృష్టించాడు. అంతేకాక చేతిలో కత్తి పట్టుకోకుండానే ఇతరులను జయించే మార్గాలను కూడా కనుగొన్నాడు.

మన సొంత దేశంలో, మన సొంత ప్రభుత్వంలో కేవలం ఒక వ్యక్తిని సాధనంగా చేసుకుని, మన ప్రభుత్వం విధించిన ఆర్థిక ఆంక్షల ద్వారా మనల్ని ఓడించగలడు. ప్రపంచవ్యాప్తంగా ఇలాగే జరిగింది. మన మనసును మార్చడం ద్వారా, తమ ఆలోచనలను ప్రభుత్వంలోకి ప్రవేశపెట్టడం ద్వారా, విద్య ద్వారా, వివిధ ప్రలోభాలద్వారా, టెలివిజన్‌లో చేసే సూక్ష్మ ప్రచారం ద్వారా ప్రభుత్వాన్ని తమ నియంత్రణ లోకి తెచ్చుకోవాలన్నదే ప్రస్తుతం వారి వాదన. ఇవే వారు ఉపయోగిస్తున్న పద్ధతులు. జరుగుతున్న దాని నుండి నిజాన్ని ఎవరూ రాబట్టలేరు. అందుకే ఈ రోజుల్లో భద్రత అనే అంశం ఇంతగా విస్తరించింది. మన దేశ ప్రజలు, భూమి నీరు, అడవులు, జంతువులు, సంప్రదాయాలు సహా మిగతా అన్నింటి రక్షణ అవసరం. ఆహార భద్రతకు, మన దేశ సరిహద్దు భద్రతతో కూడా సంబంధం ఉంది. నీటి భద్రత, ఆహార భద్రత, పర్యావరణ భద్రత, మన ఆర్థిక భద్రత, మన వ్యాపారుల భద్రత వంటి ద్వారాలలో దేనిలోకైనా రంధ్రం ఉంటే, శత్రువు దాని గుండా ప్రవేశించగలడు.

ఇది ధర్మ యుద్ధాల యుగం కాదు. ఇది ట్రోజన్ హార్స్ (ఒక విధ్వంసకరమైన ప్రణాళికను దాగి ఉండే కానుక) యుగం. వారి ఇతిహాసాల ప్రకారం, ఇది పరోక్ష యుద్ధాల యుగం. అందువల్ల, సురక్షితంగా ఉండాలంటే ఎన్నో విషయాలను పరిగణనలోకి తీసుకోవాలి. ఇది మన శత్రువులకు ద్వారాలు తెరుస్తోందా? వ్యక్తుల నుండి విధానాల వరకు, దీనిని జాగ్రత్తగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఇది చాలా పెద్ద భద్రతా సమస్య. అందుకే ప్రపంచవ్యాప్తంగా భద్రతను సమర్థించేవారికి, అభివృద్ధిని సమర్థించేవారికి మధ్య నిరంతర పోరాటాన్ని మనం చూస్తున్నాం. మనం అభివృద్ధిని సాధించాలంటే, పర్యావరణవేత్తలతో పోరాడాలి. పర్యావరణానికి వ్యతిరేకంగా అభివృద్ధి, అభివృద్ధికి వ్యతిరేకంగా పర్యావరణం, ఈ రెండూ కలిసి ఉండలేవు. సంపద, సంస్కృతి ఒకదానికొకటి పొసగనివి అనే భావనతో ప్రపంచం నడుస్తోంది. భారత్‌లో అలా కాదు. మన నమ్మకాలన్నీ ఒకదానికొకటి పూరకంగా ఉంటాయి. అవి ఒకదానికొకటి మద్దతు ఇచ్చుకుంటాయి. ఎందుకంటే అభివృద్ధి అంటే అనుసరణ, అనుకరణ కాదని మనం తెలుసుకున్నాం.

మనం పేరుకే స్వేచ్ఛగా ఉన్నాం, కానీ వాస్తవంలో కాదు. కాలక్రమంలో, మనం మరిన్ని బంధాల్లో చిక్కుకుపోతాం. ఇంట్లో ఒక చిన్నబిడ్డ పుడుతుంది. ఆ బిడ్డకు మాటలు రావు. కేవలం ఏడవగలదు. ఆకలి వేసినా, భయం వేసినా, ఏ భావాన్ని వ్యక్తం చేయాలన్నా ఆ బిడ్డకు ఏడుపే మార్గం. కేవలం తల్లి దగ్గరగా ఉన్నప్పుడు మాత్రమే నవ్వుతుంది. ఆ బిడ్డకు ఉన్న బుద్ధి అంతే. దాని కర్తవ్యం ఏమిటి? ఏమీలేదు. ఉనికిలో ఉండడమే దాని ఏకైక కర్తవ్యం. బిడ్డ అక్కడే ఉంటుంది. ఇతరులు ఆ బిడ్డను చూసుకుంటారు. దానికి ఎలాంటి ఆంక్షలు, బంధాలు లేవు. కానీ అదే బిడ్డ, 17–18 ఏళ్ల వయసుకి వచ్చి, 'నేను చిన్నప్పుడు చాలా స్వతంత్రంగా ఉండేవాడిని. బట్టలు వేసుకునేవాడిని కాదు.



ఇప్పుడెందుకు బట్టలు వేసుకోవాలి?' అంటే, అది చెల్లదు. మిమ్మల్ని పెద్దవాళ్లు అని పిలవాలంటే, అప్పుడు మీరు కొన్ని హద్దులు పెట్టుకోవడం మొదలుపెట్టాలి. వయసు పెరిగే కొద్దీ, 'నేను ఎదుగుతున్నాను, మరింత స్వతంత్రంగా మారుతున్నాను. ఇప్పుడు మీపై ఆధారపడి లేను. నా పనులు నేను సొంతంగా చేసుకోగలను,' అని అనుకుంటాడు. కానీ, అలా చేయడానికి, అతను మరికొన్ని పరిమితులను, బంధాలను అంగీకరించాల్సి ఉంటుంది. అప్పుడు అతను, తల్లిదండ్రుల ఆంక్షల మధ్య ఉండటం కన్నా, తాను జీవనోపాధి సంపాదించుకుని, తనకంటూ ఒక జీవితాన్ని నిర్మించుకోగలనా అని ఆలోచిస్తాడు. కదా? అతను అలా చేయాలి. కానీ డబ్బు సంపాదించి స్వతంత్రుడయ్యాక, కుటుంబాన్ని పోషించాల్సిన బాధ్యతను స్వీకరించకపోతే, అతడిని ప్రపంచంలో ఎక్కడా మంచివాడిగా పరిగణించరు. ఇది వరుసగా, మరింత సంక్లిష్టంగా మారే బంధాలలోకి

# క్షాబంధన్

వెళుతోంది.

'మనకు పాలు ఇచ్చేది మన అమ్మే; ఆమెను సంతోషపెట్టాలి' అని అనుకున్నాను. ఆమె నన్ను మౌనంగా ఉండమంది. నేను ఈ విషయం అర్థం చేసుకోవడం మొదలుపెట్టినప్పుడు, నేను పెద్దవుతున్నానని అందరూ అనడం ప్రారంభించారు. అమ్మా, నాన్న, అన్న, చెల్లి అందరూ ఉన్నారు. వారి గౌరవాన్ని కాపాడాలి. తల్లి దండ్రుల పాదాలకు నమస్కరించాలి. అన్నయ్య చెప్పినట్లే జీవించాలి. నా చెల్లెలిని కాపాడటం నా బాధ్యత. రాఖీ కడుతోంది కాబట్టి, ఆమెకు ఏదైనా ఇవ్వాలి, అని



అనుకోవడం మొదలుపెడతారు. దానివల్ల మరింత విస్తృతమైన బంధం ఏర్పడుతుంది. నేను అనే భావనను వదిలేసి మనం అనే తాదాత్మ్యతతో కుటుంబబంధనాల్లో చిక్కుకుంటాడు.

కుటుంబబంధాలను పాటించేవారు మంచివారని కుటుంబసభ్యులు అంటారు. కానీ ఎవరైనా కుటుంబ బంధాలను తెంచుకుని, తమ సమాజం కోసం, గ్రామం కోసం, దేశం కోసం పని చేస్తే, అతను కుటుంబానికి కీర్తిని తెచ్చాడంటారు. అతను కుటుంబబంధాలను తెంచు కున్నాడు. కానీ, అతని గురించి కథలు కథలుగా చెప్తారు. వివేకానందుడు ఏం చేశాడు? అతడి కుటుంబ మేమీ గొప్ప స్థితిలో లేదు. కానీ, అతడు కుటుంబ బంధాలను తెంచు కున్నాడు. వివేకానందుడు చేసిన పనితో, కుటుంబంలోని వారంతా తమను వదిలిపోయాడనకుండా మా కుటుంబానికి కీర్తి, ప్రతిష్టలు తెచ్చాడంటారు. ఆయన ఒక బంధాన్ని తెంచుకున్నాడు, కానీ తన చుట్టూ మరొక బంధాన్ని ఏర్పరచుకున్నాడు. సమాజం నుంచి అంచలంచెలుగా ముందుకు సాగాలి. ఈ క్రమంలో కొత్త బంధాలను స్వీకరించడం అవసరమవుతుంది. ప్రతి ఒక్కరూ ఇలా చేయాల్సిందే. ఎందుకంటే, ధర్మ మార్గాన్ని అనుసరించేవారిని ధర్మమే పరిరక్షిస్తుంది.

మనకు భద్రత కావాలంటే, అభివృద్ధి కావాలంటే, ప్రపంచంలో మరెక్కడా లభించని ఈ రెండూ మనకు ఒకేసారి కావాలంటే, మనం మన సంప్రదాయాల గురించి ఆలోచించాలి, వాటిని గుర్తు చేసుకోవాలి, వాటిని మన ప్రవర్తనలో భాగం చేసుకోవాలి. కాలానికి అనుగుణంగా ఉండే వాటి రూపాన్ని మనం సృష్టించుకోవాలి.

కానీ, భూమి ప్రాచీనమైంది, ఆకాశంలో ఎగిరేవి కూడా భూమికి తిరిగి రావాల్సిందే. అందువల్ల, తన సంప్రదాయాల నుండి వారసత్వంగా పొందిన విలువలను దృఢంగా స్వీకరించి, ఆ సంప్రదాయా లను కొత్తకాలపు గాలులకు అనుగుణంగా మార్చుకుని, తన ప్రవర్తన ద్వారా తనను తాను వ్యక్తపరిచే సమాజమే ముందుకు సాగుతుంది. అది తనను తాను కూడా కాపాడుకోగలదు.

'స్వ'ను పరిరక్షించుకోవడం ద్వారా భద్రత లభిస్తుంది. భద్రంగా ఉండటం ద్వారా అభివృద్ధి చెందుతారు. అభివృద్ధి చెందుతున్న క్రమంలో భారతదేశం తన ఉనికిని కోల్పోతే, ఎన్నటికీ అభివృద్ధి చెందదు. తనకంటూ ఒక గుర్తింపులేని భారత్‌ను ప్రపంచం తన బానిసగా వాడుకుంటుంది. ఇది నిశ్చయం. ఎందుకంటే, ప్రపంచంలో గుర్తింపు లేని వారికి భద్రతగానీ, ప్రతిష్ఠగానీ ఉండవు. వారి అభివృద్ధి ఒక ధనవంతునికి సంతోషంగా బానిసగా ఉండటం లాంటిదే అవుతుంది. మనకు అలాంటి అభివృద్ధి వద్దు. భద్రతతోపాటు అభివృద్ధి కూడా కావాలంటే, మనం కాలానికి తగిన ప్రవర్తన ద్వారా మనల్ని మనం వ్యక్తపరచుకోవాలి. ఈ రెండింటినీ కలిపి నడపగల సామర్థ్యం ఉన్న ఏకైక దేశం ప్రపంచంలో భారత్ మాత్రమే. ఇది మనందరి బాధ్యత. ఇది బయటివారికి అప్పగించాల్సిన విషయం కాదు. ఇది రాజుకు వదిలివేయవలసినది. ఇది ప్రజాస్వామ్య యుగం. ప్రజలే యజమానులు. వారు అప్రమత్తంగా ఉంటే, దేశంలో గొప్ప మార్పును తీసుకువస్తారు. కానీ, ప్రజలు ఆ ఘనతను వేరొకరికి ఆపాదిస్తారు. వారు ఆ గొప్పదనాన్ని వ్యక్తులకు, పార్టీలకు, సంస్థలకు ఇస్తారు. కానీ అసలైన ఘనత ఎవరికి దక్కాలి? ఏ వ్యక్తి తన సమాజంలోని సామాన్య ప్రజలను దృష్టిలో పెట్టుకున్నాడో వారికి. దక్కాలి. ఆ సంస్థలు అంతకు ముందే ఉన్నాయి, ఆ వ్యక్తులు ముందే ఉన్నారు, ఆ పార్టీలూ ఉన్నాయి. కానీ, ఇప్పటి వరకూ అది జరుగలేదు. ఇప్పుడు ఎందుకు జరిగింది? ఎందుకంటే, ఇప్పుడు ప్రజల మనస్సులోకి వచ్చింది, అందుకే జరిగింది.

మనం సంతోషంగా ఉండాలంటే, ప్రపంచ మంతా సంతోషంగా ఉండాలి. కానీ, ప్రపంచమంతా సంతోషంగా ఉండాలంటే, మీరు చేసే ప్రతి పనిపైనా ఆంక్షలు లేదా నియమాలు విధించుకోవాలి. మన అవసరాలను కూడా పరిమితం చేసుకోవాలి. ఇతరుల స్వేచ్ఛను కాపాడడానికి మీరు మీ అహాన్ని, స్వేచ్ఛను త్యాగం చేయాల్సి ఉంటుంది. థామస్ పేయిన్ అనే అమెరికా మేధావి , 'నా చేతిని నా ఇష్టం వచ్చినట్లు కదిలించే స్వేచ్ఛ నాకు ఉంది. కానీ నా చేతి స్వేచ్ఛకు హద్దు నీ చెంపతో ముగుస్తుంది' అన్న మాటలు ప్రాచుర్యం పొందాయి. అంటే, నా చేయి పొరపాటున మీ చెంపకు తగిలితే, అది నా తప్పే అవుతుంది. నియమాలు లేదా కట్టుబాటు వల్ల ఆ దశకు వెళ్లాలనుకోవడం లేదు. కనుక, దీనిని స్వయంగా అర్థం చేసుకుని, తమకు తామే వివరించుకుని, గ్రహించి, ఆ విధంగా ప్రవర్తిస్తే, అప్పుడు ఆ వ్యక్తులను ధార్మికులు అంటారు. మొత్తం ప్రపంచం అలా ఉన్నప్పుడు, ఏ రాజు అవసరం లేకపోయింది. ఆ పరిస్థితిని **'న రాజ్యం న రాజాసీన్ న దండ్యో న చ దాండికః । ధర్మేణైవ ప్రజాస్సర్వా రక్షంతి స్మ పరస్పరం ॥'** అని వర్ణించారు (రాజ్యం లేదు, రాజు లేదు. ఎవరూ శిక్షార్హమైన రీతిలో ప్రవర్తించలేదు. అందువల్ల, శిక్షించడానికి ఎవరూలేరు. మరి అప్పుడు అది ఎలా పనిచేసింది? ప్రజలు ధర్మంతో ఒకరినొకరు రక్షించుకున్నారు (ధర్మ ప్రజా సర్వే రక్ష). అయితే మనం మన సొంత భాషను మర్చి పోయామా? ఈ రోజుల్లో 'ధర్మం' అనే పదం వినగానే మనకు పూజ, ఆరాధన గుర్తొస్తాయి. ధర్మం గురించి మాట్లాడేవారిని మతతత్వవాదులు అంటున్నారు. ధర్మానికి ఈ విషయాలతో సంబంధం లేదు. ధర్మం అంటే అందరూ ఆచరించేది. ధర్మం అంటే అందరినీ ఏకంచేసేది. ధర్మం అంటే ప్రతి ఒక్కరినీ చీకటి నుండి వెలుగులోకి నడిపించేది. మృత్యువు నుంచి అమరత్వానికి/ అమృతత్వానికి దారి తీసేది ధర్మం. దేనివల్ల అయితే, ఈ లోకంలోనూ, పరలోకంలోనూ సుఖం ప్రాప్తిస్తుందో అది ధర్మం. రక్షాబంధన్ ఈ ధర్మపు బంధం.

రక్షాబంధన్ ఎందుకు చేసుకోవాలి? మనందరం బంధంలో ఉన్నామని మనకు మనం గుర్తు చేసుకునేందుకు. అదృష్టవశాత్తు మన దేశంలో ఇంకా కుటుంబ బంధాలు ఉన్నాయి. కుటుంబం గురించి అందరూ ఆలోచిస్తారు. ఎంత దూరం వెళ్లినా, ఒక ప్రదేశంలో అందరూ కూడి పండుగ జరుపు కుంటారు. ఎందుకు? తమ కుటుంబం కాబట్టి. కుటుంబ బాంధవ్యాలు ఉన్నాయి కనుక. తర్వాత అడుగు ఏమిటి? తర్వాతి అడుగు రాష్ట్రం/ దేశం. యావత్ ప్రపంచానికి అభివృద్ధిని, భద్రతను రెండింటినీ అందించగల దేశం మనది. మానవుని

స్వేచ్ఛ, కర్తవ్య బంధం రెండింటినీ కలపవచ్చు. శరీరం, మనస్సు, బుద్ధిని ఏకకాలంలో సంతృప్తి పరచడం ద్వారా, శరీరాన్ని ఆత్మ వైపుకు నడిపించ వచ్చు. మానవుడిని, సమాజం అనే మానవ సమూహాన్ని, సమస్త విశ్వాన్ని ఏకకాలంలో అభివృద్ధి చేయడం ద్వారా, సమస్త విశ్వాన్ని పరమాత్మ వైపుకు నడిపించవచ్చు. మనకు ఆ ధర్మం ఉంది. మనకు ఆ సమతుల్యత ఉంది. మనకు ఆ కళ, జ్ఞానం ఉన్నాయి. ఎప్పటికప్పుడు దానిని యావత్ ప్రపంచానికి అందించడమే ప్రపంచంలో మన దేశ ఉనికికి గల ఉద్దేశ్యం. మన దేశం ప్రపంచం మీద మార్కెట్‌ను రుద్దడానికి ఉద్దేశించింది కాదు. ప్రజల సంస్కృతిని మార్చి, ప్రతి ఒక్కరికీ తన రంగు పులిమి, ప్రపంచవ్యాప్తంగా తన సామ్రాజ్యాన్ని విస్తరించుకోవడం మన దేశ ఉద్దేశ్యం కాదు. మన దేశం ప్రతిఒక్కరికీ సంతోషకరమైన జీవితాన్ని గడిపే కళకు

సురక్షితంగా ఉన్నప్పుడు మాత్రమే. తన కుమారులతో అజ్ఞాతవాసం చేస్తున్న కుంతి, బకాసురుడి సంకటానికి భయపడిన కుటుంబానికి తన కుమారులలో ఒకరిని పంపి కాపాడతానని అని చెప్పింది. తర్వాత ఆమె పాండవులతో, “ఏ లక్ష్యంతో నేను మిమ్మల్ని పెంచి పెద్దవారిని చేశానో, ఆ బాధ్యత నిర్వర్తించాల్సిన సమయం వచ్చింది. అందుకే భీముడి లాంటివాడు వెళ్లి, పాండవులను ఎందుకు పెంచానో నిరూపించాలని నేను కోరుకుంటున్నాను. కేవలం రాజ్యం కోసం మిమ్మల్ని పెంచలేదని రుజువు చేయాలని కోరుకుంటున్నాను” అంది. సమాజం ఇటువంటి సంక్షోభాలలో పడినప్పుడు, ఆ రాక్షసుడిని ఎదుర్కోవడానికి ఎవరు వెళ్తారు? సొంత కొడుకే వెళ్లాడని ఒక కుటుంబం ముందుకు వచ్చింది. అందువల్ల, భగవంతుడు ఆ కుమారుడిని, ఆ మొత్తం కుటుంబాన్ని భారతదేశంలో తిరిగి ధర్మస్థాపనకు



జీవంపోసి నిరూపిస్తోంది. అందుకే ఆర్ఎస్ఎస్ మనది హిందూ జాతి అని అంటోంది. ఈ దేశం సురక్షితంగా, సుసంపన్నంగా ఉన్నప్పుడే మనకు రక్షణ లభిస్తుంది. అందువల్ల, ఈ దేశాన్ని సుసంపన్నంగా, సురక్షితంగా తీర్చిదిద్దడానికి మనం కృషి చేయాలి. కనుక, కేవలం మీ అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ల వద్దకే వెళ్లకండి. కేవలం మీ పురోహితుల వద్దకే వెళ్లకండి. ప్రతి ఒక్కరూ మీ ఇళ్లలోంచి బయటకు రండి. మైదానానికి రండి. ఒకరికొకరు రాఖీ కట్టుకోండి. సంస్కృతిని పరిరక్షించడానికి కట్టుబడి ఉన్నవారు, సంస్కృతిని తప్పక కాపాడాలనే అవగాహనను సమాజమంతటా వ్యాప్తిచేయాలి. దీనిని విశ్వసించేవారు ఈ విషయాన్ని అర్థం చేసుకుని, తమ నుంచే ప్రారంభించాలి. ఇంట్లో రక్షాబంధన్ జరుపుకుంటున్నప్పుడు – నా జీవిత పరమార్థం ఏమిటి? నా కుటుంబ పరమార్థం ఏమిటి? నా జీవితం, నా కుటుంబం, వారి జీవితాలు ఎప్పుడు సంతోషంగా, సుసంపన్నంగా, సురక్షితంగా ఉండగలవు? అని ప్రశ్నించుకోండి. అది ఎప్పుడు జరుగుతుందంటే ఈ దేశం సుసంపన్నంగా,

**'స్వ'ను పరిరక్షించుకోవడం ద్వారా భద్రత లభిస్తుంది. భద్రంగా ఉండటం ద్వారా అభివృద్ధి చెందుతారు. అభివృద్ధి చెందుతున్న క్రమంలో భారతదేశం తన ఉనికిని కోల్పోతే, ఎన్నటికీ అభివృద్ధి చెందదు. తనకంటూ ఒక గుర్తింపులేని భారత్‌ను ప్రపంచం తన బానిసగా వాడుకుంటుంది. ఇది నిశ్చయం. ఎందుకంటే, ప్రపంచంలో గుర్తింపు లేని వారికి భద్రతగానీ, ప్రతిష్టగానీ ఉండవు.**

పునాదిగా చేశాడు. కౌరవులు వందమంది ఉన్నారు. అది చాలా పెద్ద సంఖ్య. కృష్ణుడు వారితో ఎందుకు ఉండలేదు? వారిని మార్చే శక్తి కృష్ణుడికి లేదా? ఆ శక్తి ఉంది. కానీ వారు మారలేకపోయారు. నిరంతరం విస్తరించే బంధాలను విశ్వసించే, గౌరవించే రక్షాబంధనం అంటే ఏంటో పాండవులకి తెలుసు. దేశం కోసం బంధనాన్ని స్వీకరించే ధైర్యం వారికి ఉంది. అందుకే ధర్మాన్ని పునఃస్థాపించిన సామ్రాజ్యానికి పాండవులు ఆదర్శ రాజులయ్యారు.

ఈరోజు మన దేశానికి అలాంటివారు కావాలి. ఎన్నో సంక్షోభాలు ప్రపంచాన్ని, మన దేశాన్ని చుట్టుముడుతున్నాయి. ఆ సంక్షోభాలను తప్పించుకోవడానికి ప్రపంచానికి మార్గం లేదు. మనకు కావలసినంత సామర్థ్యం ఉంది, దానిని ప్రపంచానికి అందించడం మన కర్తవ్యం. మన కర్తవ్యాన్ని నెరవేర్చడానికి మనం ఎదగాలి. భారతదేశం ఎదగాలి. ఇది ఎలా సాధ్యమవుతుంది? భారత్‌లోని సామాన్య కుటుంబాలు, సాధారణ ప్రజలు రక్షాబంధన్ అనే ఈ సామాజిక సాంస్కృతిక ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని ముందుకు రావాలి. అందుకే ప్రతి సంవత్సరం వారంతా ఏకమై ఒక ప్రసంగ కార్యక్రమాన్ని నిర్వహించాలి. ఆ ప్రసంగం కేవలం వినోదం కోసం కాకుండా, ఆలోచన కోసం ఉండాలి. ఆ ఆలోచనలో మార్పు కోసం, ఈ బంధాన్ని స్వీకరించడం ద్వారా జీవితం ముందుకు సాగుతోందా లేదా అని మనం ఆత్మపరిశీలన చేసుకోవడానికి.

మనం సాధారణ ప్రజలం. వివేకానంద, శివాజీ, సుభాష్ చంద్ర కూడా సాధారణ ప్రజలే. వారు గొప్పవారిగా పుట్టలేదు. క్రమంగా అలా మారారు. మనం కూడా అలా మారగలం. మనం అంతదూరం వెళ్లలేకపోవచ్చు. ఈ రోజు ఉన్న చోటు నుండి కనీసం పది అడుగులు ముందుకు వేయగలం. ఈ వ్యక్తులు అవతార పురుషులు కాదు. మనలాంటి కుటుంబంలో పుట్టినప్పటికీ వ్యక్తి ఎంత దూరం పురోగమించగలడో చెప్పడానికి వారు ఆదర్శంగా నిలిచారు. మనం ఎంత ముందుకు వెళ్తే అంత పురోగమిస్తాం, అభివృద్ధి చెందుతాం. ఎందుకంటే, మనం ఎంతముందుకు వెళ్తే అంతగా వ్యక్తిత్వమున్న మనుషులుగా ఎదుగుతాం. మనం ఇళ్లకే పరిమితమై ఉండి, ఏ చర్యా తీసుకోకపోతే జంతువులతో సమానం. మనకు, జంతువులకు మధ్య ఉండే ఏకైక తేడా, జీవసంబంధమైనది మాత్రమే అవుతుంది తప్ప మరేమీ ఉండదు. మనం మానవులం. మనకు వ్యక్తిత్వాలు ఉన్నాయి. కనుక, రక్షణ కోసం మనం బంధాలను అంగీకరించాలి. భద్రత కోసం బంధాలను స్వీకరించే సమాజం రక్షణను కూడా పొందుతుంది. అభివృద్ధి వృద్ధికి, ప్రతిష్టకు దారి తీస్తుంది. అంతేకాక, వాటిని సాధించిన సమాజం ఇతర సమాజాలకు మార్గదర్శకంగా నిలుస్తుంది. మార్గదర్శక సమాజంగా ఎదగాలంటే, మనం, మన కుటుంబాలతోపాటు విశ్వాసం ఉన్న తోటివారిని కూడా కలుపుకొని ముందుకు నడిపించే వ్యక్తులుగా మనం మారాలి. మీరు ఈ విషయాన్ని అర్థం చేసుకుని, అవగాహనతో నేడు రక్షాబంధన్ ను జరుపుకుంటే, మన దేశానికి, ప్రపంచానికి సంక్షోభం నుండి విముక్తి లభించి, అదృష్టం మారే రోజు ఎంతో దూరంలో ఉండదు. ★

# విశిష్టతల సమ్మిళితం శ్రావణ పున్నమి

**మన సంస్కృతీ సంప్రదాయాల వారసత్వ గని శ్రావణ పౌర్ణమి. మధుకైటభులు అనే దానవుల నుంచి వేదాలను రక్షించేందుకు యజ్ఞగుండం నుంచి 'వాగీశ్వరుడు' (హయగ్రీవుడు) ప్రభవించిన తిథి. వేదాధ్యాయనం ఆరంభించే, ద్విజులు నూతన యజ్ఞోపవీతధారణ చేసే తిథి. సోదరసోదరీ ప్రేమకు ప్రతీక రాఖీ (రక్షాబంధన్)కట్టే రోజు. మరాఠీయులు, కన్నడిగులు ఆనాడు సాగరపూజ చేసి కొబ్బరికాయలు సమర్పిస్తారు. దీనిని నారికేళ పౌర్ణమి, నార్లీ పూర్ణిమ అంటారు. పంటలు బాగా పండాలని కోరుతూ ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌వాసులు కజరీ (గోధుమ) పౌర్ణమిగా జరుపుకుంటారు.**

వేదోద్ధరణ కోసం శ్రీమహావిష్ణువు హయగ్రీవుడిగా అవతరించాడన్నది ప్రధాన పురాణ కథనం. సరస్వతీ వాగ్దేవి కాగా, ఆయన జ్ఞానానందమయుడు, వాగీశ్వరుడు. నిర్మలమైన స్ఫటికం వంటి ఆకృతి కలవాడు. సర్వ విద్యలకు ఆధారభూతుడు. గుర్రపు తల, మానవదేహంతో నాలుగు భుజాలలో శంఖం, చక్రం, పుస్తకం, చిన్ముద్రలను కలిగి ఉంటాడు.

విధాత నుంచి వేదాలను అపహరించి సముద్రంలో దాగిన దానవులు మధుకైటభులను శ్రీమహావిష్ణువు హయగ్రీవ స్వరూపంతో సంహరిస్తాడు. వేదాలను కాపాడిన స్వామి, బ్రహ్మకు వేదాధిపత్యాన్ని, సరస్వతికి సకల విద్యాధిపత్యాన్ని అప్పగించాడు. కలియుగంలో మానవ ఉద్ధరణకు ఉపాయం చెప్పాలని అగస్త్యముని అభ్యర్థించగా, హయగ్రీవుడు రుషి రూపంలో కాంచీపురంలో శ్రీలలితా రహస్య నామాలను, శ్రీవిద్యను ఉపదేశించారని పురాణగాథ. హయగ్రీవునికి విగ్రహ రూపం కల్పించి సరస్వతీమాత ఆరాధించిందని పురాణగాథ. ఆమె కశ్మీరంలో రామానుజాచార్యులకు సాక్షాత్కరించి, శ్రీలక్ష్మీ సమేత హయగ్రీవమూర్తిని ప్రసాదించగా, అది రామానుజుల నుంచి వారి శిష్యులు పిళ్లైయాచార్యులు, వారి నుంచి వేదాంత దేశికులకు.. ఇలా గురుశిష్య పరంపరలో సంక్రమించింది. ఆ మూర్తి ప్రస్తుతం మైసూరులోని శ్రీ బ్రహ్మతంత్ర స్వతంత్ర పరకాల మఠంలో అర్చనలు అందుకుంటోంది.







**సోదర ప్రేమకు చిహ్నం 'రక్షాబంధన్'**

సమాజాన్ని, సనాతన సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుతూ, విశ్వమానవ కల్యాణానికి అనువైన వాతావరణాన్ని ఈ రక్షాబంధన్ వేడుక కల్పిస్తుంది. భవిష్యోత్తర, విష్ణు, కూర్మ పురాణాలు ఈ పండుగ గురించి పేర్కొంటున్నాయి. ఇది మానవ సంబంధాలను, కుటుంబ విలువలను పరిపుష్టం చేస్తుంది. దుష్టశక్తులను పారదోలడానికి, చేపట్టిన కార్యాలు విజయవంతం కావడానికి ఉద్దేశించిన 'రక్షాబంధన్' (రాఖీ) అనంతర కాలంలో సోదరసోదరీ ప్రేమకు, వారి అపురూప బంధానికి ప్రతీకగా నిలిచింది. అరాచకాల బారిన పడుతున్న మహిళల రక్షణ కోసం ఈ సంప్రదాయం వచ్చిందని చెబుతారు.

దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఈ పండుగను రక్షామంగళ్, రక్షాదివస్, రాఖీ పూనవ్, సలోని ఉత్సవ్‌గా వ్యవహరిస్తారు. 'అక్కాచెల్లెళ్లు పవిత్ర మనసుతో సోదరుడి నుదుటన తిలకం దిద్ది, మంగళ హారతిచ్చి అతని కుడిచేతికి పసుపు కొమ్ము కట్టిన దారపు రక్షను ధరింప చేసి, మధుర పదార్థాన్ని తినిపిస్తారు. రక్షకట్టే మహిళలు, కట్టించుకునేవారు ఏకోదరులు కాకపోయినా 'నీకు రక్ష కడుతున్న నేను ఈ (మీ) కుటుంబానికి చెందిన వ్యక్తినే. నా రక్షణ బాధ్యత నీపై ఉంది' అనే సందేశం ఇమిడి ఉంది. రక్షాబంధన్‌కు వేసే మూడు ముడులు ఆరోగ్యం, సంపద, ఆయుష్షులకు సూచికలుగా అభివర్ణిస్తారు. సోదరుడు సోదరికి కానుకలిచ్చి పెద్దల దీవెనలను అందుకోవడం సంప్రదాయం.

యుద్ధవీరులకు పట్టుదల, ఆత్మ స్థైర్యం కలిగేందుకు రక్ష కట్టేవారు. ఛత్రపతి శివాజీ తుల్జాభవానీ సమక్షంలో రక్షాబంధన్ ఉత్సవం నిర్వహించి, తాను ధర్మరక్షణకు పునరంకితమవుతున్నట్టు ప్రతిజ్ఞ చేసేవాడట. ఆ స్ఫూర్తితోనే మరాఠా ప్రాంతంలో నేటికీ ఈ రోజును 'ధర్మదివస్'గా పాటిస్తారు.

**ద్విజుల విధులు**

ఈ తిథినాడు ద్విజులు నూతన యజ్ఞోపవీతాన్ని ధరిస్తారు. గడచిన సంవత్సరంలో తెలిసీ తెలియక ఏమైనా దోషాలు చోటుచేసుకుంటే వాటి పరిహారార్థం కూడా ఈ విధి నిర్వర్తించాలని చెబుతారు. జపహోమ ధ్యానాదుల నిమిత్తం దీక్షా సూచికగా నూతన యజ్ఞపవీతం ధరించాలని శాస్త్ర వచనం. పాల్కురికి సోమన 'పండితారాధ్యచరిత్ర'లో ఈ జంధ్యాల పూర్ణిమను 'నూలు' పండుగ అని పేర్కొన్నారు.

యజ్ఞోపవీతానికి గల మూడు పోగులను దేవ, పితృ,రుషి రుణాలకు సూచికలుగా,ఆ పోగులకు గల మూడు ముళ్లు ఆరోగ్యం, సంపద, తేజస్సుకు సంకేతాలుగా చెబుతారు. శ్రౌత కర్మానుష్ఠాన, మంత్రానుష్ఠాన యోగ్యత కోసం మొదటి పోగు, గృహస్థాశ్రమ ధర్మనిర్వహణ కోసం రెండవది, వైదిక కర్మానుష్ఠాన యోగ్యత కోసం మూడవ పోగు ధరించాలన్నది నియమం. ఉత్తరాయణంలో ఉపనయం అయిన వారికి దక్షిణాయనంలో వచ్చే శ్రావణ పూర్ణిమనాడు ఉపాకర్మ చేస్తారు. అంటే ఉపనయనం వేళ యజ్ఞోపవీతంలో కట్టే 'మౌంజి'ని ఉపాకర్మ సమయంలో తొలగించి నూతన యజ్ఞోపవీతాన్ని ధరింపచేస్తారు.

– స్వామి




రతనాల సీమ మనది. వజ్రపురాశులను వీధుల్లో పోసి అమ్మిన గడ్డ మనది. అనేక విశ్వవిఖ్యాత వజ్రాలతో ప్రపంచాన్ని అబ్బురపరిచిన దేశం మనది. 16వ శతాబ్దంలో ట్రావెర్ నీయర్ 1630-1668 మధ్య షాజహాన్, ఔరంగజేబు, గోల్కొండ నవాబులను ప్రధానంగా దర్శించాడు. ఇతడు ఆభరణాల వ్యాపారి, విలువైన రాళ్లను, ముఖ్యంగా వజ్రాలను ఖరీదు చేయడానికి వచ్చాడు. గోల్కొండ రాజ్యంతో సహా వివిధ ప్రాంతాలలో వజ్రాల గనులను దర్శించాడు. కొల్లూరుగని 1675లో దర్శించి ఫ్రెంచ్ రాజు లూయీ 14 కోసం “ట్రావెర్నియర్ బ్లూ” ను కనుగొన్నాడు. 116 కారెట్లు డైమండును దర్శించినట్లు ఆయన రాసిన పుస్తకం “లెస్ సిక్స్ వాయేజస్ డీ జీన్ బాప్టిస్ట్ ట్రావెర్నియర్”లో ప్రచురించాడు. ఇలాంటి ఎన్నో వజ్రాలు లూయీ 14 కిరీటంలో ఉండేవి.

గోల్కొండ అసఫ్ ఝా రాజ వంశస్తుల పాలనలో ఉంది. వీరి రాజధాని ఔరంగాబాద్‌లో ఉండేది. 2వ అసఫ్ ఝా (1762-1803) అధికారంలోకి రాగానే రాజధానిని హైదరాబాదుకు మార్చాడు. 1798లో బ్రిటిష్ వారితో సైన్య సహకార పద్ధతికి అంగీకరించాడు. సైనిక ఖర్చుల క్రింద రాయలసీమ ప్రాంతంలోని అనంతపురం, కర్నూలు, కడప, బళ్లారి జిల్లాలను బ్రిటిష్ వారికి అప్పగించాడు. సైన్య సహకార పద్ధతి ప్రకారం మొట్టమొదటి రెసిడెంట్‌గా జేమ్స్ ప్యాట్రిక్‌ను హైదరాబాద్‌లో నియమించాడు. జేమ్స్ ప్యాట్రిక్ ఖైరున్నీషా బేగంను పెళ్లి చేసుకున్నాడు.

నిజాం రాజులు విలువైన వజ్రాలను సేకరించి, వాటిని అంతర్జాతీయ మార్కెట్‌లో విక్రయించేవారు. దీనివల్ల హైదరాబాదు ప్రపంచంలోనే ఒక శక్తివంతమైన ఆర్థికకేంద్రంగా ఎదిగింది. 184.75 క్యారెట్లు గల జాకబ్ డైమండ్‌ను నిజాంలు పేపరు వెయిట్‌గా వాడేవారట. దాని ఖరీదు సుమారు 1000 కోట్ల నుండి 5000కోట్ల వరకు పలుకుతుంది. గోల్కొండలో లభించేవి టైప్-2ఎ వజ్రాలు. ఇవి స్వచ్ఛతకు ప్రసిద్ధి. వీటిలో నైట్రోజెన్ ఉండదు. అత్యంత ఖరీదైనవి.

ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాలోని కొల్లూరు గనిలో 17వ శతాబ్దంలో “రీజెంట్ డైమండ్” దొరికింది. దీని ఖరీదు నాటి రేట్ల ప్రకారం 552 కోట్లుగా నిర్ధారించారు. ఇది ప్రస్తుతం ఫ్రాన్స్‌లోని లూవర్ మ్యూజియంలో ఉంది. ఒక గని కార్మికుడు, ఈ వజ్రాన్ని తనకాలికి గాయం చేసుకొని దానికి ఒక కట్టువేసుకుని కట్టులోపల వజ్రాన్ని దాచి మద్రాసు నుండి ఓడలో ఇంగ్లండు పారిపోవడానికి ప్రయత్నించగా, ఆ ఓడ కెప్టెన్ దీనిని గమనించి వాడిని హత్యచేసి ఆ డైమండ్‌ను ఇంగ్లండులో “పిట్” అనే వ్యాపారికి అమ్మాడు. ఫ్రాన్స్ పాలకుడు 2వ ఫిలిప్ ఆ వ్యాపారి నుండి దాన్ని కొనుగోలుచేశాడు. దీనితో ఇది రీజెంట్ డైమండ్ అయ్యింది. ఆ తరువాత అది డ్యూక్ ఆఫ్ ఆర్లియన్‌కు వచ్చింది. ఫ్రెంచ్ విప్లవకాలంలో దీన్ని దొంగలు దొంగిలించారు. నెపోలియన్, చక్రవర్తి అయ్యాక, ఆ దొంగను పట్టుకొని ఆ డైమండ్‌ను తీసుకుని తన ఖడ్గానికి గల పిడికి అమర్చుకున్నాడు.

ప్రపంచంలోని విలువైన వజ్రాలలో ఒకటి గోల్కొండ నీలివజ్రం (గోల్కొండ బ్లూ). ఒకప్పుడు ఇండోర్, బరోడా మహారాజులవద్ద ఉన్న ఈ వజ్రం జెనీవాలో జరిగే క్రిష్టీన్ మ్యాగ్నిఫిసెంట్ సేల్‌లో వేలం వేయగా, నాడు 430 కోట్లు పలికింది. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన వజ్రాలలో “ది గ్రేట్ స్టార్ ఆఫ్ ఆఫ్రికా” కల్లినన్‌ను రాణికి చెందిన రాజ దండంపై అమర్చారు. ‘ది గ్రేట్ మొగల్ డైమండ్ అని పిలిచే ‘ది ఒర్లోఫ్’ ప్రస్తుతం మాస్కోలోని క్రెమ్లిన్ ఆర్మరీ డైమండ్ ఫండ్ సేకరణలో ఉంది. 1774లో రష్యన్ రాణి కేథరిన్ ది గ్రేట్ రాజదండంలో దీన్ని పొదిగారు.

శ్రీరంగ పట్టణంలో రంగనాథ స్వామి దేవాలయంలో ఉన్న దీనిని ఒక ఫ్రెంచ్ సోల్జర్ హిందూమతాన్ని స్వీకరించినట్లుగా నటించి, పూజారులతో సన్నిహితంగా ఉంటూ, ఒకనాడు ఈ వజ్రంతో ఉడాయించాడు. ఈ వజ్రాన్ని ఆర్లోవ్ అనే ఉన్నత సైనికాధికారి కొని తన ప్రేయసి (రాజు భార్య అయిన కేథరిన్‌కు)కి బహుమానంగా ఇచ్చాడు. అప్పటికి రష్యాను కేథరిన్ భర్త 3వపీటర్ పరిపాలిస్తున్నాడు. ఆర్లోవ్ సహాయంతో పీటర్‌ను పదవీచ్యుతునిచేసి తానే రష్యాకి రాణిగా తనను తాను ప్రకటించుకున్నది.

కోహినూర్ డైమండ్ వరంగల్‌లోని భద్రకాళీ మాత కన్నుగా ఉండేది. దీనిని విదేశీయులు ఎత్తుకుపోయారు. 105.6 కేరట్ల ఈ వజ్రాన్ని, పెర్షియన్, ఆఫ్ఘన్ పాలకుల నుండి బ్రిటిష్ సామ్రాజ్యం స్వాధీనం







చేసుకుంది. దీనికి ఖరీదు కట్టలేకపోయారు. “బడల్స్ ఐ” కూడా గోల్కొండ వజ్రమే. 1600లలో గోల్కొండ నవాబులు దీన్ని సొంతం చేసుకున్నారు. తరువాత పర్షియా యువరాజు రహాబ్ సొంతం చేసుకుని, అప్పులపాలై, అప్పులు తీర్చడానికి జూలై 14, 1865లో లండన్ క్రిష్టీస్‌లో వేలంలో అమ్మేశాడు. “సాన్సీ డైమండ్” బ్రిటన్, ఫ్రాన్స్ దేశాల మధ్య చేతులు మారింది.

“హోప్ డైమండ్ కూడా భారతదేశంలోనే పుట్టింది. ఫ్రెంచ్ విప్లవ సమయంలో చోరీకి గురైంది. తరువాత హెన్రీఫిలిప్ హోప్ కొనుగోలు చేశాడు.

# “పరిటాల రిప
# వజ్రాలు చె

17వ శతాబ్ద నుండి చాలాసార్లు చేతులు మారినట్లు సమాచారం. అయితే దీన్ని కొన్నవాళ్లందరూ అకాల మరణం చెందారట, చివరగా లూయీ14 చేతికిచేరిన తరువాత ఫ్రాన్స్‌లో విప్లవమే వచ్చింది. దానితో 14వ లూయీ వాషింగ్టన్‌లోని స్మిత్ సోనియన్‌కు దానంగా ఇచ్చారు. ప్రస్తుతం ఇది అమెరికాలో వుంది.

1765లో మొగల్ చక్రవర్తి 2వ షాఆలం నుండి రాబర్ట్ క్లైవ్ ఒక ఫర్మానాను పొందాడు. దీని ద్వారా ఉత్తర సర్కారు జిల్లాలు (శ్రీకాకుళం, రాజమండ్రి, ఏలూరు, కొండపల్లి, గుంటూరు) బ్రిటిష్‌వారికి లభించాయి, అయితే అవి అప్పటికి గోల్కొండ నవాబు నిజాం ఆలీఖాన్ చేతిలో ఉన్నాయి. బ్రిటిష్‌వారు 1766, 1768లో జరిగిన మచిలీపట్నం ఒప్పందం ద్వారా షాఆలం ఆ ఫర్మానాను అంగీకరించి, ఉత్తర సర్కారు జిల్లాలను ఈస్ట్ ఇండియా కంపెనీకి అప్పగించాడు. దీనికి బదులుగా ఏటా 50 వేల పౌండ్లు (సుమారు 5 లక్షలు) నిజామ్‌కు చెల్లించడానికి అంగీకరించాడు. కానీ నాటి గుంటూరు జిల్లాలోని ఏడు గ్రామాలను పరిటాల,



ందితో సెంట్రల్ కమిటీ ఏర్పడింది.

మోగులూరు, ఉస్తేపల్లి, మల్లవల్లి, బత్తినపాడు, గనీఆతుకూరు తనకు వదలాలని, దానికి బదులుగా నైజాం ప్రాంతమైన మునగాల పరగణా (సూర్యపేట జిల్లా) హుజూర్ నగర్ దగ్గర లింగగిరి పరగణాలోని 9 గ్రామాలను బ్రిటిష్ వారికి ఇవ్వడానికి అంగీకరించారు. దీనితో పరిటాల, ఇతర ఏడు గ్రామాలు నిజాంపాలనలో ఉంటే చుట్టూ బ్రిటిష్ భూభాగంగా ఉండేది. బ్రిటిష్ వారి భూభాగానికి నిజాం రాజ్య భాగమైన జుజ్జూరు పరిధిలోని పరిటాలలో నాకా (చెక్ పోస్టులు) ఉండేవి. ఈ ఏడు గ్రామాలు పరిటాల, మోగుల్లూరు, ఉస్తేపల్లి, మల్లివల్లి

# బ్లిక్"లో
# ప్పిన కథలు

బత్తినపాడు, గని ఆతుకూరు, కొడవటి కల్లు,

1947 ఆగస్టు 15న భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చింది కాని హైదరాబాదు సంస్థానానికి కాదు. హైదరాబాదు నైజాం తాను స్వతంత్ర రాజ్యంగా ఉండదల్చినట్లు ప్రకటించాడు.దానితో పరిటాలకు కూడా స్వాతంత్ర్యం సిద్ధించలేదు, సర్దార్ వల్లభ భాయ్ పటేల్ సైనిక చర్యతో హైదరాబాదు సంస్థానం1948 సెప్టెంబరు 17న భారత్‌లో విలీనమైంది. పరిటాల పరిస్థితి వేరు. భారత్‌లో హైదరాబాద్ విలీనానికి ముందే, 1947 నవంబరు 15నే తిరుగుబాటు చేసి నిజాం పాలన నుండి విముక్తమైంది. విముక్తి పొందిన వెంటనే తమని తాము స్వతంత్ర గణతంత్ర దేశంగా ప్రకటించుకుంది. ఆ ప్రాంతానికి "పరిటాల రిపబ్లిక్" అనే పేరు పెట్టుకుంది. ప్రత్యేక రాజ్యాంగం రాసుకుంది. ఈ విషయాలను తెలియజేస్తూ డా॥ కృష్ణా సాగరపు ఉపేంద్ర "1947 నాటి పరిటాల రిపబ్లిక్ పాలన" అనే శీర్షికతో కుప్పంలోని ద్రావిడ యూనివర్శిటీలో తన సిద్ధాంత వ్యాసాన్ని రాసి ప్రచురించాడు.

పరిటాల తాలూకా జుజ్జూరు కానత్‌లో భాగంగా కృష్ణాజిల్లాలో ఉంది. హైదరాబాదు నైజాం మే 14, 1759న ఉత్తర సర్కారు జిల్లాలను పరిటాల, 6 గ్రామాలను మినహాయించుకుని జజ్జూరుతో సహా బ్రిటిష్ వారికి బదిలీ చేశాడు. అయితే తాను తీసుకున్న ఏడు గ్రామాలకు నష్టపరిహారంగా తెలంగాణాలోని మునగాల పరిగణాను హుజూర్ నగర్ దగ్గర గల లింగగిరి పరగణాలోని 9 గ్రామాలను ఇచ్చాడు. దీనితో పరిటాలలో వజ్రాల వేట ప్రారంభమైంది, నైజాంలకు వజ్రాలపై మక్కువ ఎక్కువ. ఈ వజ్రాల డబ్బువల్లే నైజాం నవాబులకు అన్ని అవలక్షణాలు వచ్చాయి అని ప్రతీతి. 1937 ఫిబ్రవరి 22న విడుదలైన టైమ్స్ మ్యాగజైన్ ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడైన వ్యక్తి మీర్ ఉస్మాన్ ఆలీఖాన్ అనే కథనాన్ని ప్రచురించింది. నైజాం పరిపాలనాకాలంలో నిజాం అధికారుల ఆకృత్యాలు పెచ్చుపెరిగిపోయాయి. వేధిస్తున్న నిజాం అధికారిని హత్యచేసి చెరువు ఒడ్డున పారేసి పరిటాలవాసులు పరారయ్యారు.

విచారణలో అందరూ ఒకేసారి "మేమే చేశాం" ఈ హత్య అనేసరికి అధికారులు నివ్వెరపోయారు. అయితే పరిటాలలో ఈ సంఘటన జ్ఞాపకార్థం నిర్మించిన స్థూపంపై ఈ పేర్లు లిఖించారు– వీరమాచనేని వేంకటేశ్వరరావు, పెర్నా శ్రీరామ్ మూర్తి, దొడ్డపనేని రామారావు, మల్లెల నర్శయ్య, కూటం నాగయ్య, సిద్ధిరాములు, మలసా వీరయ్య, పెన్నా రాధా కృష్ణమూర్తి, గుణ్ణం రామిరెడ్డి, కర్రా వేంకట నరసయ్యతో మరికొందరు అని రాసుంది. రజాకారులకు కూడా గ్రామస్తులు భయపడలేదు, కలిసికట్టుగా ఎదుర్కొన్నారు.


ఉస్మానియా యూనివర్శిటీలో 1938లో వందేమాతరం ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న అనేకమంది పరిటాలవారు కావడం పరిటాల ఉద్యమ స్ఫూర్తికి కారణమైంది. హైదరాబాద్ స్టేట్ కాంగ్రెసు ఫౌండర్ స్వామి రామానంద తీర్థ, హయగ్రీవాచారి కూడా కొంతకాలం పరిటాలలో ఉండి ఉద్యమం గాడి తప్పకుండా ఉండేటట్లు వారికి సలహా ఇచ్చారు. "ఆంధ్రాలో అప్పటికే జరిగిన సహాయ నిరాకరణోద్యమం, చీరాల–పేరాల ఉద్యమం, పెదనందిపాడు పన్నుల నిరాకరణ పోరాటం, పర్లాకిమిడి పోరాటం వంటివి పరిటాల వాసులను బాగా ప్రభావితం చేశాయి. దీనితో 1946 నాటికే నిజాంపాలన నుండి బయటపడాలన్న కాంక్ష ఎక్కువైంది" అని రచయిత ఉపేంద్ర పేర్కొన్నారు.

టంగుటూరి ప్రకాశం, బెజవాడ గోపాలరెడ్డి వంటి నాయకులతో సత్సంబంధాలను నెలకొల్పుకున్నారు. వారి సూచన మేరకే నడుచుకున్నారు. కేంద్ర నాయకత్వంతో సంప్రదింపులు చేయడానికి అవ్వా సత్యనారాయణను నియమించారు. స్థానికంగా ఉద్యమం నడపడానికి మాదిరాజు దేవరాజును వినియోగించారు. జయప్రకాశ్ నారాయణ, అరుణా ఆసఫ్‌ఆలీలు స్వయంగా పరిటాలను సందర్శించి ప్రజలకు ధైర్యం చెప్పివెళ్లారు.


భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చిన మూడు నెలల తరువాత 12.11.1947న పరిటాలలోని పోలీస్‌స్టేషన్‌పై కొందరు దేశభక్తులు దాడి చేసి, 15-11-1947 పరిటాల ఖనాత్ పరిధిలో ఏడు గ్రామాలను "స్వతంత్ర గణతంత్ర దేశంగా" ప్రకటించి పరిటాల రిపబ్లిక్ అని పేరు పెట్టారు. అవ్వా సత్యనారాయణ ఈ రిపబ్లిక్‌కు ఒక రాజ్యాంగాన్ని తయారు చేశారు. పరిపాలన కొరకు ప్రతీ గ్రామాన్నుండి ముగ్గురు సభ్యుల చొప్పున ఏడు గ్రామాల నుండి 21 మంది సభ్యులతో సెంట్రల్ కమిటీని ప్రకటించారు. పరిటాల రిపబ్లిక్ సెంట్రల్ కమిటీ అధ్యక్షునిగా మాదిరాజు దేవరాజు, ఉపాధ్యక్షునిగా మాగంటి రామకోటయ్య, కార్యదర్శిగా చింత అచ్చయ్య చౌదరి, సభ్యులుగా చింతలపాటి విశ్వనాథం, అవ్వా సత్యనారాయణ, చింతా బాపయ్య, మన్నెం కోటయ్య, వెలగా రామకృష్ణయ్య, మాదిరాజు నాగ భూషణరావు, బండి వెంకయ్య, అక్కినేని రామారావు ఇంకా కొందరు ఉన్నారని పరిటాల స్థూపంపై రాసుకున్నారు. ఈ కమిటీ సభ్యులు నిత్యం జాతీయ నాయకులతో సంప్రదిస్తూ, సలహాలను తీసుకుంటూ ఉన్నారు. పరిపాలన పారదర్శకంగా, సమర్థంగా నిర్వహించేందుకు అనేక చర్యలు తీసుకున్నారు. భద్రత సంక్షేమానికి ఎక్కువ ప్రాధాన్యతను ఇచ్చారు.

చివరకు జాతీయనాయకుల సలహా మేరకు పరిటాల ఖానాత్ తాలూకాను 26-01-1950 న భారత రిపబ్లిక్‌లో విలీనం చేయడం, పరిటాల ఖానాత్‌ను కృష్ణాజిల్లాకు, మునగాల, లింగగిరి ప్రాంతాన్ని తెలంగాణా జిల్లాలలో చేర్చడం ద్వారా పరిటాల రిపబ్లిక్ కథ సుఖాంతమైంది. నేటికీ పరిటాల గ్రామాలలో వర్షాకాలం వచ్చిందంటే వజ్రాలవేట మొదలవుతుంది.

**మూలం:** 1. వజ్రాలు పండుతున్నాయి బై తమ్మిశెట్టి రఘుబాబు (వ్యాసం), 2. 1947 నాటి పరిటాల రిపబ్లిక్ బై డా॥ కృష్ణసాగరపు ఉపేంద్ర.



**డా. కాశింశెట్టి సత్యనారాయణ**
విశ్రాంత ఆచార్యుడు



# వాడుకభాష వేగుచుక్క 'గిడుగు'

**ఆధునిక తెలుగు సాహిత్య చరిత్రలో అరుదైన ఘట్టం వ్యావహారిక భాషోద్యమం. దానికి సారథి గిడుగు రామమూర్తిపంతులు. ఒక ఆలోచన జీవితాన్ని మారుస్తుందన్నట్లు, ఒక విదేశీ అధికారికి కలిగిన సందేహం ఈ ఉద్యమానికి నాంది పలికింది. 'పుస్తకాలలోని తెలుగు భాషకు, నిత్యజీవితంలో వాడే భాషకు మధ్య తేడా ఏమిటి?' అని నాటి విద్యాశాఖ అధికారి జె.ఎ.యేట్స్‌కు కలిగిన సందేహం పంతులు గారిని ఆలోచనలో పడేసి, భాషోద్యమానికి పునాది వేసింది. నేడు తెలుగులోని అన్ని ప్రక్రియల్లో వ్యావహారిక భాష అమలు కావడం గిడుగు పోరాట ఫలితమేనని, వాడుక భాషకు ఊపిరిలూదుతోందని సాహితీవేత్తల భావన.**

విజ్ఞానం గ్రాంథిక భాషతో కేవలం కొద్ది శాతం విద్యావంతులు, పండితులకే పరిమితం కారాదని, అది సామాన్యులకు కూడా అందాలని భావించారు గిడుగు రామమూర్తి పంతులు. అందుకు బోధన, మాట్లాడుకునే భాషలోనే ఉండాలని, పత్రికలు కూడా వాడుకభాషలోనే రావాలని భావించారు. 'ప్రజాలందరు గ్రాంథిక భాషా పండితులు కాలేరు. వాడుక భాష నేర్పితే చాలును. అందులో నుండే అన్ని విషయముల గురించి కావలసినంత జ్ఞానం సంపాదించవచ్చును' అన్నది ప్రగాఢ ఆయన భావన.

'నోటి మాటకు చేతిరాత'కు మధ్య గల వ్యత్యాసం భాషా వికాసానికి అవరోధంగా భావించిన గిడుగు, తమ 47వ ఏటా(1910) సుమారు మూడు దశాబ్దాల ఉపాధ్యాయ వృత్తికి విరమణ ప్రకటించి వాడుక భాష ఉద్యమాన్ని చేపట్టారు. ఆ క్రమంలో వాడుక భాష ఆవశ్యకతపై ఒక సదస్సులో చేసిన ప్రతిపాదనకు ప్రభుత్వం, విశ్వవిద్యాలయాల నుంచి కొంతమేర సానుకూలత వ్యక్తమైనా గ్రాంథిక వాదులలో, పండితలోకంలో ఏకాభిప్రాయం కుదర లేదు. పైగా, గ్రాంథికంలో రాయలేకే వ్యవహారిక భాషోద్యమాన్ని తలకెత్తుకున్నారనే విమర్శలనూ, వ్యక్తిగత దూషణలనూ ఎదుర్కొన్నారు. బీఏ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై,సంస్కృత, ఆంగ్ల గ్రంథాలను చదివి, శాసనాలను పరిశోధించిన ఆయనకు గ్రాంథికం రాదనడం కువిమర్శ మాత్రమే. సాధారణ ప్రజలు విద్యావంతులు కావాలన్నదే ఆయన తపన.అందుకే ఎన్ని విమర్శలనైనా భరించారు,సహించారు. ఎదుటి వారి విమర్శలతో ఆయనలో పట్టుదల పెరిగింది.


తమ ఉద్యమ ప్రచారానికి 'తెలుగు' అనే పత్రికను ప్రారంభించారు. అందులోని సంపాదకీయాలు, వ్యాసాలు తీవ్రచర్చలకు దారితీశాయి. చాలా మందిలో చైతన్యం నింపాయి. తమ ఉద్యమానికి చేయూతనివ్వవలసిందిగా సమకాలీన పత్రికలను అభ్యర్థించారు. వ్యవహారిక భాష ఆవశ్యకతను తెలియజేస్తూ పలు పత్రికలలో వ్యాసాలు రాశారు. సంచలనాత్మక ప్రసంగాలు చేశారు. 'భాష జీవనది లాంటిది. అది నిరంతరం పరిణామం చెందుతుం టుంది.పాతనీరు పోయి కొత్త నీరు చేరినట్లే భాష లోనూ మార్పులు సహజం. ఉన్న పదాలకు అర్థాలు (అర్థవిపరిణామం) మారవచ్చు. కొత్త పదాలు కొత్త అర్థాలతో చేరవచ్చు. మార్పులు చేర్పులు లేకపోతే అది భాషే అనిపించుకోదు.ఈ మార్పును ఎవరూ శాసించలేరు, అడ్డగించలేరు' అని వ్యాఖ్యానించారు. 'వ్యాకరణం తర్వాతే భాష' అనే నాటి పండితుల వాదనతో విభేదించి, 'భాష తరువాతే వ్యాకరణం' అని ప్రతిపాదించారు. భాషా నిర్బంధం, నియమాల విధింపు వ్యాకరణ ఉద్దేశ్యం కాకూడదని వాదించారు.

బాల్యమిత్రుడు, సహాధ్యాయి గురజాడ అప్పారావు, ఆంధ్రదేశంలో సంఘసంస్కరణ పితామహుడు కందుకూరి వీరేశలింగం పంతులు, ఆయన సంకల్పానికి అండగా నిలిచారు. వాస్తవానికి కందుకూరి మొదట గ్రాంథికవాదాన్ని బలపరిచినా, గిడుగు వాదనలోని వాస్తవాన్ని గ్రహించి.. విద్య, పత్రికలు ఎక్కువమందికి చేరువ కావాలంటే వాడుకభాష అత్యంత అవసరమని భావించారు. తాము నిర్వహిస్తున్న పత్రికలలో ఆ శైలిని ప్రవేశ పెట్టారు. నవ్యసాహిత్య పరిషత్, నవ్య సాహితీసమితి లాంటి సంస్థలు వాడుకభాషలోనే రచనలు ప్రారంభించాయి

విశ్వవిద్యాలయాలలో బోధన, పాలనా వ్యవహారాలు వాడుకభాషలోనే సాగాలన్న గిడుగు కల, ఆయన కన్నుమూసిన దాదాపు మూడు దశబ్దాలకు గానీ సాకారం కాలేదు. సిద్ధాంత వ్యాసాలను వ్యావహారిక భాషలో రాసే అవకాశం కూడా కలిగింది.

వాడుక భాష కోసమే కాక గిరిజనులను అక్షరాస్యులను చేయాలని తపించారు గిడుగు. వారిని విద్యావంతులను చేయాలనే లక్ష్యంతో తమ ఉన్నత విద్యాభిలాషను పక్కనపెట్టారు.ఆరోగ్యాన్ని కూడా లక్ష్యపెట్టలేదు. పర్లాకిమిడి ప్రాంతంలో కొండలలో నివసిస్తున్న సవర జాతితో పరిచయం పెంచుకొని వారి భాష, ఆచార వ్యవహారాలను పరిశీలించారు. ఆ భాషను నేర్చుకున్నారు..స్థానిక అధికారులకు ఉచితంగా నేర్పారు. అధికారులకు స్థానిక భాషలో ప్రవేశం ఉండడం ప్రజలకు ప్రయోజనం కలుగు తుందని ఆనాడే గుర్తించారు. సవర పిల్లల కోసం ఆ భాషా బడులు నెలకొల్పారు. కొందరు సవర పిల్లలను తమ ఇంట ఉంచుకొని భోజనం పెట్టి చదువు చెప్పారు. సవరల కోసం తెలుగు లిపితో నిఘంటువులు రూపొందించారు.వ్యాకరణం రాసి సవర వాగనశాసనుడిగా వినుతికెక్కారు.సవర భాషా కృషిలో భాగంగా అడవులలో తిరగడంతో తీవ్ర అనారోగ్యం పాలై. వినికిడి శక్తిని కోల్పోయారు. అయినా తమ లక్ష్యానికి దూరం కాలేదు.

గిడుగువారు కేవలం వ్యావహారిక భాషావాది కాదని, మహామానవతామూర్తి అనేందుకు ..'దేశభాషాభిమానం తోడిదే దేశాభిమాము. ఏ కులము వారైనా,ఏ మతము వారైనా, ఏ దర్జా వారైనా తెలుగు మాతృభాషగా గలవారందరూ ఒక సంఘమువారనిన్ని, ఎవరు వెనుకబడ్డా సంఘమునకు నష్టమే అనిన్ని, ఎవరు త్రికరణశు ద్ధిగా భావిస్తారో వారే దేశాభిమానం గలవారమని చెప్పవలెను' అని పత్రికా సంపాదకులకు రాసిన లేఖల్లోని వాక్యాలే నిదర్శనం. వ్యావహారిక భాషకు పట్టం కట్టినందునే గిడుగు వారి జయంతిని 'తెలుగు భాషా దినోత్సవం'గా నిర్వహించుకుంటున్నాం. భావితరాలను తెలుగుకు దూరం చేయకుండా ఉండడమే ఆయనకు మనం అందించే నిజమైన నివాళి.



**డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి**
**సీనియర్ జర్నలిస్ట్**

# సాహిత్య పరిపుష్టికి అనువాదం అవశ్యం

**భారతీయ సంప్రదాయ విద్య విశ్వవ్యాప్తం కావాలని,అందుకు తగినట్లుగా అనువాద ప్రక్రియ ముమ్మరం కావలసిన అవసరం ఉందని పలువురు సాహితీవేత్తలు అభిప్రాయపడ్డారు. విజ్ఞాన సముపార్జనకు, సంస్కృతీ సంప్రదాయాలను, సంస్కృతులను పరస్పరం పంచుకునేందుకు అనువాద ప్రక్రియ అత్యంత ప్రధానం, అవసరమని అన్నారు. ఒక భాషలోని సాహిత్యం ఇతర భాషలలోకి వెళ్లినప్పుడే సారస్వతం విశ్వవ్యాప్తమౌతుందని, ప్రపంచం కుగ్రామమైన వేళ అనువాదానికి ప్రాముఖ్యత పెరిగిందని అభిప్రాయపడ్డారు.**




ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, ఎల్ఆర్ ప్రేమ్‌కుమార్, ఆచార్యఆర్వీఎస్ సుందరం, ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్, డాక్టర్ కిరణ్‌పాల

'తెలుగులో అనువాద సంప్రదాయం- విద్యానువర్తనం' అనే అంశంపై నెల్లూరులోని.. 'ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం' ఆగష్టు 10,11 తేదీల్లో ప్రత్యక్షంగానూ, అంతర్జాల మాధ్యమం ద్వారా కార్యశాల నిర్వహించింది. అనువాదం ఆవశ్యకత, ఆ ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలు, వాటిని అధిగమించేందుకు అనుసరించవలసిన విధివిధానాలపై సాహితీవేత్తలు సమగ్రంగా చర్చించారు. ఇతర భాషా రచనలు తెలుగులోకి గణనీయంగానే వస్తున్నప్పటికీ, కొన్ని సందర్భాల్లో కృతకభాష చోటు చేసుకుం టోందని, లక్ష్య భాష పదసంపద, జాతీయాలు, నుడికారాల పట్ల సరైన అవగాహన లేకపోవడం, సమయాభావం, కొన్నిసార్లు నిర్లిప్త వైఖరి అందుకు కారణాలుగా అభిప్రాయ పడ్డారు.

'జాతీయ విద్యావిధానం-2020'లోని బహు భాషా విద్యావిధానం చాలా ప్రాముఖ్యతను సంతరించుకుందని భారతీయ భాషా సంస్థ జూనియర్ పరిశోధనాధికారి డాక్టర్ ఎల్. ప్రేమ్ కుమార్ స్వాగతోపన్యాసంలో పేర్కొన్నారు. 'సుందర భారతీయభాష.. మాతృభాషలు,బహుభాషా విద్య, భారతీయ జ్ఞాన సంపద సంప్రదాయం' సదస్సుల పరంపరంలో భాగంగా తమ సంస్థ అనువాద సంప్రదాయాలపై కార్యశాలలు నిర్వహిస్తోందన్నారు.

అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ అధ్యక్షోపన్యాసం చేస్తూ, మంచి ఏ భాషలో ఉన్నా స్వీకరించాలని, అయితే అందుకు అనువాద ప్రక్రియ అర్థవంతంగా సాగాలని అన్నారు. ప్రపంచంలో ఏ ఇతర భాషలకు తీసిపోనట్లు మనకు సాహితీ,పద సంపద ఉందని, అది ఇతర భారతీయ భాషలోకి తర్జుమా కావాలని అభిలషించారు.పరభాషా రచనలను తెలుగు చేస్తున్నట్లే, మన గ్రంథాలు, రచనలు ఆయా భాషీయులకు పరిచయం కావాలని అన్నారు. అనువాద గ్రంథాలు సామాన్యులకు అందుబాటులోకి రావాలని, పాఠ్యపుస్తకాలను మాతృభాషలో ముద్రించేందుకు ప్రభుత్వాలు మరింత చొరవ చూపాలని ఆచార్య సంపత్ కుమార్ సూచించారు.

మైసూరు విశ్వవిద్యాలయం తెలుగుశాఖ పూర్వాధ్యక్షులు ఆచార్య ఆర్వీఎస్ సుందరం ప్రారంభోపన్యాసం చేస్తూ, తెలుగు సాహిత్యం అనువాదంతోనే ప్రారంభమైందని చెప్పారు. 'భారతీయ భాషలలోని జ్ఞానసంపద పంపిణీకి అనువాదం అవసరం. భారతీయ భాషలు అన్నీ విశిష్టమైనవే అయినా... ప్రపంచం లోనే వెయ్యేళ్లకు పైగా అవిచ్ఛిన్నంగా ఉపయోగిస్తున్న భాషలు తెలుగు, కన్నడమే.అందులోనూ తెలుగు ముందు వరుసలో ఉంది. అందుకు మన భాషా పద సంపదే కారణం. పదసంపద సమృద్ధిగా గల భాష సుసంపన్నమవుతుంది. ప్రస్తుతం ఒక భాషలో వెలువడిన రచన, భాషాంతరీకరణకు ఎంతోకొంత సమయం పడుతోంది. అందుకు బదులుగా, మూల భాషలోని రచనలు సత్వరం ఇతర భాషలలోకి అనువాదం కావాలి. అనువాదానికి సంబంధించి విశ్వ విద్యాలయమే ఉండాలి' అన్నారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ పూర్వాధ్యక్షులు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి కీలకోపన్యాసం చేస్తూ...భారతీయ భాషలన్నిటిని సమానంగా అధ్యయనం చేయగలగాలని, అందుకు అనువాద ప్రక్రియ ఉపకరిస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'నూతన విద్యావిధానం-2020' అందుకు దోహదం చేస్తుందని అభిప్రాయపడ్డారు. 'మనల్ని మనం తెలుసు కోవాలి. పూర్వకవులను గౌరవించుకోవాలి. ఆధునికతను ఆస్వాదించ గలగాలి. జ్ఞానసంపదను వెలికితీయాలి. పురాణాలు, ఇతిహాసాల నుంచి మంచిని స్వీకరిం చాలి. ఎవరెన్ని చెప్పినా 'సత్యం' ఒక్కటే నిత్యమనే భావనతో సంబంధిత అంశాలను అనువదించడమే కాక పాఠ్యాంశాలుగా చేర్చవలసిన అవసరం ఉంది' అని సూచించారు.

హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయం భాషాశాస్త్ర శాఖ పూర్వా ధ్యక్షులు ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు సమాపనోపన్యాసం చేస్తూ, అభివృద్ధి చెందుతున్న కృత్రిమమేధ (ఏఐ)లాంటి సాంకేతిక పరిజ్ఞానంతో ప్రాచీన గ్రంథాలను అనువదించడం సుసాధ్యమేనని అన్నారు. అంతరిస్తున్న భాషలను ఏఐ లాంటి సాంకేతికతతో నిలువరించవచ్చని అన్నారు. 'భాషా భివృద్ధికి వ్యాకరణం అవసరమే కానీ అదే కీలకం కాదు. భాషకు ఎలాంటి పట్టింపు ఉండదు. సృజన, రాయడం, చదవడమే భాషాభివృద్ధికి మూలం. మన విజ్ఞానాన్ని ఇతర భాషల వారికి చేరువ చేయడానికి 'యంత్రానువాదం' ప్రధాన సాధనం. ఏ భాషా సమాచారాన్నైనా సత్వరం స్వీకరించే శక్తి సామర్థ్యాలు దానికి ఉన్నాయి. ఆయా భాషలవారు దానికి అందించే సమాచారాన్నే బట్టే అది తిరిగి ఇవ్వగలుగు తుంది' అన్నారు.

ఈస్ట్రరన్ ఫిన్‌ల్యాండ్ విశ్వవిద్యాలయం పరిశోధకులు డాక్టర్ కిరన్ పాల.. రెండు దేశాల విద్యావిధానంపై ఉపన్యసించారు. ఆచార్య బాణాల భుజంగరెడ్డి, ఆచార్య దేవారెడ్డి విజయలక్ష్మి, డాక్టర్ సంగనభట్ల నరసయ్య, డాక్టర్ కప్పగంతు రామకృష్ణ, డాక్టర్ భమిటిపాటి గౌరీశంకర్,డాక్టర్ బూసి వెంకటస్వామి,డాక్టర్ మాలకొండయ్య, సీనియర్ పాత్రికేయులు జంధ్యాల శరత్‌బాబు, డాక్టర్ ఎ.జగన్నాథస్వామి, వివిధ అంశాలపై ప్రసంగించారు.

**– డా. ఆరవల్లి**




# చరిత్ర ధృవీక

‘హిం'దూయిజం', ‘హిందుత్వ'పై గురూజీ అభిప్రాయాలను మత ఛాందసవాద (ఫండమెంటలిజం) ప్రాజెక్ట్, హిందుత్వపై కోర్టు తీర్పులు ఆమోదించాయి. ఇవి గురూజీ అభిప్రాయాలను చరిత్ర పదేపదే ధృవీకరించిన వైనాన్ని పాఠకులకు ఆసక్తికరంగా తెలియజేసే రెండు ఉదాహరణలుగా నిలిచాయి. ఈ రెండు కూడా, అప్పట్లో పాలక వర్గం తిరస్కరించిన గురూజీ ఆలోచనలను, ఆ తర్వాత కాలగమనంలో, కాల ప్రభావంతో ఎలా అంగీకరించిందీ స్పష్టం చేస్తాయి. అలాగని మత ఛాందసవాద ప్రాజెక్ట్, హిందుత్వ తీర్పులు సాహిత్య రచనలు కావు. అవి గురూజీ తదనంతరం చోటు చేసుకున్న చారిత్రక పరిణామాల నుంచి పుట్టుకొచ్చిన ఫలితాలు. ఈ రెండు చారిత్రక పరిణామాలు ఆవిష్కృతమైన వైనాన్ని తెలిపే నేపథ్యం ఇక్కడ ఉంది.

**మౌలికవాద ప్రాజెక్టు మూలాలు**

విజ్ఞాన శాస్త్రంపై మతం ఆధిపత్యం చెలాయిస్తున్నప్పటికీ మత ఛాందసవాద అనేది దశాబ్దాల కాలంగా ప్రజలలో చర్చనీయాంశంగా ఉంది. అయితే దీనిపై ప్రపంచవ్యాప్త పండితులతో అధ్యయనానికి బీజం మాత్రం 1987లో పడింది. అందుకు అమెరికన్ అకాడమీ ఆఫ్ సోషల్ సైన్సెస్ కీలక పాత్ర పోషించింది. ప్రపంచంలో చోటు చేసుకుంటున్న పరిణామాలకు, పాశ్చాత్య దేశాల నేతృత్వంలో జరిగిన చారిత్రక ప్రక్రియల ఫలితాలకు ప్రతిస్పందనగా మత ఛాందసవాద ప్రాజెక్టు ఉద్భవించింది. ఈ అధ్యయనం యాదృచ్ఛికమైనది కాదు. ఇది చారిత్రకంగా అనివార్యమైనది. కమ్యూనిజాన్ని ఎదుర్కోవడానికి పాశ్చాత్య దేశాలు సృష్టించిన తీవ్రవాద ఇస్లాం ఎదుగుదల, చర్చి పునరుజ్జీవనం, ఈ రెండూ 1950-1960 దశాబ్దాలలో, పాశ్చాత్య దేశాలలో అభివృద్ధి చెందిన “లౌకికీకరణ సిద్ధాంతాన్ని” బలహీనపరిచాయి. ఆ సిద్ధాంతం ప్రకారం ఒక సాంప్రదాయ సమాజం ఎంత ఎక్కువగా పాశ్చాత్యీకరణకు గురైతే, అది అంతే స్థాయిలో ధార్మికంగా పతనమవుతుంది. ఆధునికతది పై చేయి అవుతుంది. సాంప్రదాయం చివరి శ్వాస తీసుకుంటుంది. ఈ ఆధునికీకరణ ప్రక్రియ, మధ్యప్రాచ్యంలోని ఇస్లామిక్ దేశాలను సోవియట్ యూనియన్ నుండి దూరం చేసి, తన కక్ష్యలోకి ఆకర్షించే అవకాశాన్ని అమెరికా ముందు ఉంచింది. కానీ, గురూజీ పరమపదించిన ఆరు సంవత్సరాల తర్వాత, 1979లో లౌకికీకరణ సిద్ధాంతానికి ఒక పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. ఇరాన్‌లో విప్లవం, ఆఫ్ఘనిస్తాన్‌పై సోవియట్ యూనియన్ దండయాత్ర, కమ్యూనిజం ఏలుబడిలో ఉన్న పోలాండ్‌కు చెందిన ఒక కార్డినల్, పోప్ జాన్ పాల్ 2 అవ్వడం అనే మూడు చారిత్రాత్మక పరిణామాలు అదే సంవత్సరంలో చోటుచేసుకున్నాయి.

ఈ చారిత్రక పరిణామాలు, లౌకికీకరణ సిద్ధాంతం ఎదుర్కొంటున్న సవాళ్లను అధ్యయనం చేయడానికి, వాటికి ప్రతిస్పందించడానికి పాశ్చాత్య దేశాలను నిర్బంధించాయి. పాశ్చాత్య ఆధునికత ప్రపంచీకరణ పట్ల వివిధ మతాలను అనుసరిస్తున్న వారి స్పందన “మత ఛాందసవాదం”గా పరిణమించేలా చేయడం ఈ అధ్యయనం ముఖ్యోద్దేశ్యం. తద్వారా మతంతో విభేదించే ‘విజ్ఞానశాస్త్రం' స్థానంలో ‘ఆధునికత'ను ప్రతిక్షేపించింది. తమ పనిలో భాగంగా హిందూ ధర్మాన్ని, ఆర్‌ఎస్‌ఎస్ భావజాలాన్ని విశ్లేషించిన ప్రాజెక్ట్ పండితులు గురూజీ అభిప్రాయా లతో ఏకీభవించారు. ఆధునిక హిందూ పండితుల ప్రకారం, ఇతర విశ్వాస వ్యవస్థలలోని అనేక రకాల మత ఛాందసవాదాల తరహాలో ‘ఆధార గ్రంథాలు, నిర్వచించిన సిద్ధాంతాలు, సంస్థాగత నిర్మాణాలు' లేకుండా ఉండటం వల్ల, హిందూ జీవన దృక్పథం ‘సారాంశంలో హేతుబద్ధమైన, మానవతావాదమైన ఆధ్యాత్మిక అనుభవం'లో వేళ్లూనుకుంది. ఇది నిస్సందేహంగా, హిందూ ధర్మం ఇతర ధర్మాల కన్నా భిన్నమైనదనే గురూజీ అభిప్రాయాన్ని ధ్రువీకరించింది. మత ఛాందసవాద ప్రాజెక్టు చేపట్టిన అధ్యయనం పై విధంగా స్పష్టం చేసింది.



**హిందుత్వ కేసు చారిత్రక నేపథ్యం**

సాధారణంగా వ్యాజ్యాలు జరిగే విధంగా హిందుత్వ కేసు రెండు పక్షాల మధ్య జరిగిన ద్వైపాక్షిక వ్యాజ్యం కాదు. ఇది రెండు పరస్పర విరుద్ధమైన ఆలోచనల మధ్య జరిగిన సైద్ధాంతిక ఘర్షణకు ప్రతీక. ఒకటి, పండిట్ నెహ్రూ వ్యక్తీకరించిన వ్యవస్థాగత దృక్పథం. ఇది హిందూమతాన్ని ఏకేశ్వర వాద మతాల వంటి ఒక మతంగా పరిగణించింది. అవి పరస్పరం, అలాగే లౌకిక పాలనతో కూడా ఘర్షణ పడతాయి. మరొకటి, గురూజీ వ్యక్తీకరించిన ఆర్‌ఎస్‌ఎస్ దృక్పథం. దాని ప్రకారం, సమ్మిళిత హిందూ ధర్మం ఏ మతంతోనూ గానీ, లౌకికవాదంతో గానీ ఎన్నడూ ఘర్షణ పడలేదు, పడబోదు. ఎందుకంటే అది అన్ని మతాలను స్వీకరిస్తుంది కానీ దేనినీ తిరస్కరించదు, కాబట్టి అది లౌకికవాదం కంటే శ్రేష్ఠమైనది. అయితే, ఈ ఘర్షణపూరిత సైద్ధాంతిక కేసు సుప్రీంకోర్టుకు ఎలా చేరింది? హిందుత్వ కేసు అయోధ్య ఉద్యమం ఫలితం. అయితే హిందుత్వ భావన లౌకికవాదానికి వ్యతిరేకమని, కాబట్టి అది ఓట్ల కోసం చేసే మతతత్వ ఆకర్షణ అని వాదిస్తూ కొందరు కుహనా లౌకికవాదులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. హిందుత్వ కేవలం ఒక మతం, మతతత్వ భావన అని వారు వాదించగా, దానికి ప్రతిగా దశాబ్దాల క్రితం గురూజీ వ్యక్తీకరించిన వాదనను ప్రతివాదులు ముందుకు తెచ్చారు. ఆ వాదన ప్రకారం, హిందుత్వ అనేది భారతీయులందరినీ కలుపుకొనిపోయే ఒక భావన, జీవన విధానం, అంతేగానీ అది ఒక సంకుచిత మతం కాదు, ఇతర మతాలకు గానీ, లౌకికవాదానికి గానీ వ్యతిరేకం కాదు. హిందూ ధర్మం, హిందుత్వ భావనలను విశ్లేషించిన సుప్రీంకోర్టు గురూజీ అభిప్రాయాన్ని అంగీకరించింది.

**గురూజీ ఆలోచనలకు మానవాళి మద్దతు**

మత ఛాందసవాద ప్రాజెక్టు, హిందుత్వపై కోర్టు తీర్పులు అనే రెండు ఉదాహరణల నుండి అనేక ఇతర ఉదంతాలు, సంఘటనలు క్రమంగా ఆవిష్కృతమయ్యాయి. ఇవి, వివిధ విషయాలపై గురూజీ అభిప్రాయాలతో ఏకీభవించాయి. అవి ఈ దిగువన ప్రస్తావనకు నోచుకున్నాయి.

❖ భారతదేశంలోని అల్పసంఖ్యాక వర్గాల ప్రజలు ఎల్లప్పుడూ మాతృ హిందూ సమాజం, సంస్కృతిలో భాగమేనన్న గురూజీ అభిప్రాయాన్ని ఆ తర్వాత కాలంలో భారత సుప్రీంకోర్టు ధ్రువీకరించింది.

## రించిన ద్రష్ట

* భరతవర్షం, భరతఖండంలోని ప్రజలందరికీ ఉమ్మడి సంస్కృతి, సంప్రదాయాలు ఉన్నాయన్న గురూజీ భావనను పాకిస్తాన్ ప్రభుత్వం కూడా అంగీకరించింది. అంతే స్థాయిలో సమర్థించింది.
* మిశ్రమ సంస్కృతి లేదా బహుళసాంస్కృతిక వాదం పేరుతో మూల సంస్కృతిని విస్మరించడం, బలహీనపరచడం పట్ల గురూజీ హెచ్చరించారు. ఇప్పుడు అదే హెచ్చరికను అమెరికా, తదితర పాశ్చాత్య దేశాలు శిరోధార్యంగా భావిస్తున్నాయి. బహుళ సాంస్కృతికవాదం వైపు మళ్లడం వల్ల అది మూల సమాజాలను, మూల సంస్కృతులను బలహీనపరిచిందన్న అవగాహన ఆ దేశాల్లో పెరిగింది.
* గురూజీ కాలంలో పాశ్చాత్య ఆలోచనాపరులు అప్రజాస్వామికమైనవిగా వ్యతిరేకించిన సాంస్కృతిక జాతీయవాదంపై గురూజీ అభిప్రాయాలు, ఇప్పుడు పాశ్చాత్య దేశాలలో బహుళసాంస్కృతికవాదానికి దిద్దుబాటుగా తిరిగి ఆవిర్భవిస్తున్నాయి.
* సామాజిక, జాతీయ విచ్ఛిన్నం, హింసను నివారించడానికి అల్పసంఖ్యాక వర్గాలకు చెందిన ప్రజలను ప్రధాన జనజీవన స్రవంతి లోకి తీసుకొని రావడం లేదా సమాజంలో విలీనం చేయడం అనివార్యమని గురూజీ ప్రతిపాదించిన భావనను, ఇప్పుడు పాశ్చాత్య ఆలోచనాపరులు సానుకూలంగా చూస్తున్నారు.
* గురూజీ హెచ్చరించినట్లుగానే, సాంస్కృతిక జాతీయవాదంలోని అస్పష్ట వైఖరి పశ్చిమ దేశాలను గందరగోళానికి గురిచేసి, సమాజాలను అస్థిరపరిచే బహుళసాంస్కృతిక వాదాన్ని ప్రోత్సహిస్తోంది.
* సాంస్కృతిక పతనం, జాతీయ గందరగోళానికి విరుగుడుగా సాంస్కృతిక జాతీయవాదం ఒక రక్షణ కవచంగా గురూజీ పేర్కొన్న సంగతి ఇప్పుడు పాశ్చాత్యులకు అనుభవపూర్వకంగా తెలిసి వస్తోంది.
* మైనారిటీలను బుజ్జగించడం అనేది మైనారిటీ వేర్పాటువాదాన్ని ప్రోత్సహిస్తుందని గురూజీ చేసిన హెచ్చరికను పెడచెవిన పెట్టిన కారణంగా ఇప్పుడు జాతీయ స్థాయిలో, అంతర్జాతీయ స్థాయిలో ఆ బుజ్జగింపు వినాశనానికి దారి తీస్తున్నది.
* ఒక జాతికి, దేశానికి సంస్కృతి, నాగరికత అనేవి అత్యవసరమైన గుర్తింపులని గురూజీ నొక్కిచెప్పిన విషయం, ప్రస్తుతం అటువంటి విభిన్న గుర్తింపులను గుర్తించకపోతే ప్రపంచం హింస, అస్తవ్యస్తతలోకి జారిపోతుందనే కొత్త అవగాహన ద్వారా ధ్రువీకరణకు నోచుకుంది.
* సందర్భోచితమైన ఒత్తిళ్లకు అతీతంగా, మెజారిటీ-మైనారిటీ సంబంధాలను రూపొందించడం ద్వారా దేశాన్ని, హిందూ సమాజాన్ని, మైనారిటీలను కాపాడటానికి గురూజీ చేసిన పోరాటాన్ని యావత్ మానవాళి గుర్తు చేసుకుంటున్నది.
* ప్రచారంలో ఉన్న భావనకు విరుద్ధంగా, సాంస్కృతిక ఐక్యత, మైనారిటీలను కలుపుకొని పోవడంపై గురూజీ, పండిట్ నెహ్రూ స్థూలంగా ఏకీభవించారు. కానీ 'హిందూ' దేశం అనే పదాన్ని వర్తింపజేయడంలో మాత్రమే వారు విభేదించారు.
* ప్రచారంలో ఉన్న అభిప్రాయానికి విరుద్ధంగా, భారతదేశ సాంస్కృతిక, నాగరిక ఐక్యత, కొనసాగింపు, మైనారిటీలను కలుపుకొని పోవడంపై గురూజీ, గాంధీజీల అభిప్రాయాలు ఒకే తీరుగా ఉన్నాయి.
* "ధర్మం" అనేది "మతం" కన్నా భిన్నమైనదని నిరూపించడానికి గురూజీ చేసిన అవిశ్రాంత ప్రయత్నాలు ఇప్పుడు బహిరంగ చర్చల ఆమోదం పొందుతున్నాయి.
* దశాబ్దాల క్రితం ధర్మం అనేది మతాతీత భావన అని గురూజీ వ్యక్తం చేసిన అభిప్రాయాలను న్యాయవ్యవస్థ, రాజకీయ రంగం క్రమక్రమంగా ఆమోదించాయి.
* భారతదేశపు ప్రాచీన సంస్కృతి పట్ల సున్నితత్వం లేని, ఆంగ్లో-సాక్సన్ భారత రాజ్యాంగ నిర్మాణాన్ని, సమ్మిళిత హిందూ జీవన దృక్పథంతో మిళితం చేయాలన్న గురూజీ విజ్ఞప్తి ప్రస్తుత న్యాయ వర్గాలలో, బహిరంగ చర్చలలో విస్తృతంగా ఆమోదం పొందింది.
* మత ఛాందసవాద ప్రాజెక్ట్ ప్రకారం, "సమకాలీన భారత నాయకత్వపు మరో భావజాలం" గురించి గురూజీ చేసిన సూచన ఇప్పుడు ప్రధాన జనజీవన స్రవంతి అభిప్రాయంగా మారింది.
* ఇస్లామిస్టుల స్వభావం, ఒక దేశంగా పాకిస్తాన్, పాకిస్తాన్‌లో నెలకొన్న పరిస్థితులపై గురూజీ చెప్పింది సరైనదని రుజువైంది.
* గురూజీ తన జీవితకాలం తర్వాత ఒక దశాబ్దానికి చైనా స్వభావం, దాని పరిణామ క్రమం గురించి కచ్చితంగా అంచనా వేశారు.
* అప్పట్లో ప్రబలమైన వ్యవస్థాగత ఆలోచనా విధానానికి వ్యతిరేకంగా గురూజీ ప్రకటించిన అసమ్మతి, భారతదేశపు మథనపడే మనస్సాక్షికి చేసిన విజ్ఞప్తిగా నిలిచింది. ఆయన తదనంతరం ఆ అసమ్మతికి ఎనలేని దాని ప్రామాణికత చేకూరింది.


**మిశ్రమ సంస్కృతి లేదా బహుళసాంస్కృతిక వాదం పేరుతో మూల సంస్కృతిని విస్మరించడం, బలహీనపరచడం పట్ల గురూజీ హెచ్చరించారు. ఇప్పుడు అదే హెచ్చరికను అమెరికా, తదితర పాశ్చాత్య దేశాలు శిరోధార్యంగా భావిస్తున్నాయి. బహుళ సాంస్కృతికవాదం వైపు మళ్లడం వల్ల అది మూల సమాజాలను, మూల సంస్కృతులను బలహీనపరిచిందన్న అవగాహన ఆ దేశాల్లో పెరిగింది.**

అందువల్ల, గురూజీ ఒక ద్రష్టగా నిలిచారు. ప్రవక్త అనే పదం ఆయన దరిదాపుల్లోకి కూడా రాదు. గురూజీ భవిష్యత్తును ముందుగానే అంచనా వేశారు. అలా అంచనా వేసిన దానిని తన అభిప్రాయాలుగా వ్యక్తీకరించారు. అలాంటి విలువైన అభిప్రాయాలను చరిత్ర ధ్రువీకరించింది. అయినప్పటికీ, దూరదృష్టి కలిగిన ద్రష్ట గురూజీని లౌకికవాదానికి వ్యతిరేకి అని, మతవాది అని అప్పట్లో కొందరు దురుద్దేశ పూర్వకంగా విమర్శించారు. కానీ, కాలానుగుణంగా సాగే చరిత్ర ప్రస్థానం మన దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా గురూజీ ఆలోచనలను పదేపదే ధ్రువీకరించింది.

**(ఎస్.గురుమూర్తి రచించిన "గోల్వాల్కర్ ది మోడరన్ రిషి విత్ మిలీనియల్ విజన్" పుస్తకం నుంచి)**

### వివేకానంద సూక్తిశతి

**All weakness, all bondage is imagination..**
**Do not weaken.. Stand up and be strong**
**That is all the religion I know**



సకల బంధములను సకల దౌర్బల్యాలు
మనిషి కల్పితములె మనసులోన
దుర్బలతను వీడి దోర్బలుడగుమురా
వినుడి స్వామి సద్వివేక వాణి!!



బండిరాజుల శంకర్
ఆలేరు,
9948050608

# మూలమతం చెప్తే జీసస్ తిరస్కరిస్తాడా?



ఒక్కసారి మతం మార్చుకుంటే, అది శాశ్వతం అంటున్నారు క్రైస్తవ ఫాదరీలు. అందుకే, జనాభా లెక్కల సమయంలో వారి అసలు మతం పేర్కొనకూడదంటున్నారు. అంటే, గిరిజనులుగా, ఎస్సీలుగా వారు నమోదు చేసుకోకుండా క్రైస్తవులుగానే చేసుకోవాలని చెప్తున్నారు. కాగా, గిరిజన సంఘాల సమన్వయ కమిటీ మాత్రం ఇందుకు భిన్నంగా, వారు ఖచ్చితంగా తమ మాతృభాష, మత విశ్వాసాలను పేర్కొనాలని చెబుతోంది.

ముఖ్యంగా, అసోంలో జనాభా లెక్కల్లో తమ అసలైన మతాన్ని పేర్కొనవద్దని బోడోలను అసోం క్రైస్తవమండలి హెచ్చరించింది. రాష్ట్రంలో జరగబోయే జాతీయ జనాభా లెక్కలలో, మతం మార్చుకున్న గిరిజన క్రైస్తవులు తమ అసలు మతాన్ని నమోదు చేసుకోకుండా బోడో క్రిస్టియన్ కౌన్సిల్, ఆల్ అస్సాం ట్రైబల్ క్రిస్టియన్ కౌన్సిల్ నిషేధించాయి.

ఎఏటిబిసి కార్యదర్శి రెవరెండ్ సుశీల్‌డైమరీ మాట్లాడుతూ, క్రైస్తవమతంలోకి మారిన బోడో ప్రజలు రాబోయే జనాభా లెక్కలలో తమ అసలు మతమైన బథౌయిస్‌ను పేర్కొనకూడదని అన్నారు. గిరిజన క్రైస్తవులు తమను తాము క్రైస్తవులుగానే పేర్కొనాలని హెచ్చరించారు. దీనిని కాదని, అసలు మతాన్ని వెల్లడిస్తే, బైబిల్, యేసుక్రీస్తు ఆజ్ఞలను ఉల్లంఘించడమే అవుతుందని, అది దేవుడిని తిరస్కరించినట్లుగా అవుతుందని బెదిరింపులకు దిగారు. డైమరీ ఒక అడుగు ముందుకేసి, 'భూమి మీద నన్ను ఎవరైతే తిరస్కరిస్తారో, వారిని నేను కూడా పరలోకంలో ఉన్న నా తండ్రి ఎదుట తిరస్కరిస్తాను' అని యేసు బైబిల్‌లో ఉందని ఉటంకించారు.

ఇది బిఎన్ఎస్‌లోని సెక్షన్ 318, ఐపిసిలోని సెక్షన్ 415లను కూడా ఉల్లంఘించడమేనని ఆయన గిరిజన క్రైస్తవులను హెచ్చరించారు. అంతేకాకుండా, దీనివల్ల రాష్ట్రంలోని క్రైస్తవ జనాభాకు తీవ్రమైన ముప్పు వాటిల్లుతుందని డైమరి పేర్కొన్నారు. మరోవైపు, 2027లో జరుగనున్న జనాభా లెక్కల్లో తమ మాతృభాష, మత విశ్వాసాలను కచ్చితంగా పేర్కొనాలని గిరిజన సంఘాల సమన్వయ కమిటీ (సిసిటిఒఎ) రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గిరిజన వర్గాలను కోరింది. అస్సోం మూల వాసుల రాజకీయ, సామాజిక, రాజ్యాంగపరమైన హక్కుల విషయంలో ఈ జనాభా గణన అత్యంత ప్రాముఖ్యతను కలిగి ఉంటుందని సిసిటిఒఎ ప్రధాన సమన్వయకర్త ఆదిత్య ఖక్లారీ ఇటీవల పేర్కొన్నారు.

సిసిటిఒఎ భారత ప్రభుత్వ అధికారిక గణాంకాలలో గిరిజన ప్రజల ప్రాముఖ్యత నమోదయ్యేలా, రాబోయే జనాభా లెక్కల్లో గిరిజన వర్గాలన్నీ తమ మూల విశ్వాసాలను, భాషను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి," అని ఖక్లారీ అన్నారు. సిసిటిఒఎ చేసిన విజ్ఞప్తి నేపథ్యంలో, రాబోయే జనాభా గణనలో క్రైస్తవ జనాభా సంఖ్య తగ్గుతుందనే ఆందోళన క్రైస్తవ సంస్థలలో వ్యక్తమవుతోంది. తమ మూల విశ్వాసాలను ప్రోత్సహిస్తున్న వివిధ గిరిజన సంఘాల సమాచారం ప్రకారం, గతంలో వివిధ కారణాల వల్ల క్రైస్తవ మతంలోకి మారిన వందలాది గిరిజన కుటుంబాలు ఇప్పుడు తిరిగి తమ పూర్వీకుల విశ్వాసాలను స్వీకరించాలని కోరుకుంటున్నాయి.

# భారత్‌లో విస్తరిస్తున్న అల్‌ఖైదా



ఐక్యరాజ్య సమితి విశ్లేషణాత్మక మద్దతు, ఆంక్షల పర్యవేక్షణ బృందం 38వ నివేదిక ప్రకారం, ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో 2025 నవంబర్‌లో జరిగిన పేలుడుకు అల్-ఖైదా ఇన్ ది ఇండియన్ సబ్‌కాంటినెంట్ (ఎక్యూఐఎస్) కారణమని ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి అధికారికంగా నిర్ధారించింది. ఆగస్టు 10న విడుదలైన ఈ నివేదిక ప్రకారం, ఎక్యూఐఎస్ ఒక విచ్ఛిన్నమైన సంస్థ నుండి చిన్న, వికేంద్రీకృత సెల్‌ల ద్వారా పనిచేసే లాజిస్టిక్స్, ఆర్థిక నెట్‌వర్క్‌లతో కూడిన ప్రాంతీయ ఉగ్రవాద సంస్థగా అభివృద్ధి చెందుతోంది. నవంబర్ 2025 రెడ్ ఫోర్ట్ దాడికి ఎక్యూఐఎస్‌యే కారణమని నివేదిక ప్రత్యేకంగా పేర్కొంది.

ఈ పరిణామం చాలా ముఖ్యమైనది, ఎందుకంటే జాతీయ దర్యాప్తు సంస్థ ఈ కేసులోని నిందితులకు, ఎక్యూఐఎస్ అనుబంధ సంస్థ అయిన అన్సార్ ఘజ్వత్-ఉల్-హింద్ (ఏజీయూహెచ్)తో సంబంధం ఉందని అనుమానించింది. 11 మంది మరణానికి, పలువురు గాయపడటానికి కారణమైన ఈ పేలుడుకు సంబంధించి, 2026 మేలో ఆ సంస్థ 10 మంది నిందితులపై 7,500 పేజీల ఛార్జిషీట్‌ను దాఖలు చేసింది.

**ఎర్రకోట పేలుడులో ఏం జరిగింది?**

2025 నవంబర్ 10న, ఢిల్లీలోని రెడ్ ఫోర్ట్ ప్రాంతం సమీపంలో పేలుడు పదార్థాలతో నిండిన హ్యుండాయ్ ఐ20 కారు పేలిపోవడంతో ఈ ఘటన జరిగింది. మృతుడైన డ్రైవర్ డాక్టర్ ఉమర్ ఉన్ నబీని ప్రధాన నిందితుడిగా ఎన్ఐఏ తర్వాత గుర్తించింది. ఉగ్రవాద ముఠాలో వైద్యులు కీలక భాగంగా వెలుగులోకి వచ్చారు. ఎన్ఐఏ ఛార్జిషీట్‌లో 10 మంది నిందితుల పేర్లను పేర్కొంటూ, వారికి అన్సార్ ఘజ్వత్-ఉల్-హింద్‌తో సంబంధం ఉందని తెలిపింది. వైద్యులలో ఇద్దరికి హరియాణాలోని అల్-ఫలాహ్ విశ్వవిద్యాలయంతో సంబంధాలు ఉన్నాయి. తాజా ఐక్యరాజ్య సమితి అంచనా ప్రకారం, రెడ్ ఫోర్ట్ దాడి అనేది ఎక్యూఐఎస్ విస్తృత పరిణామ క్రమంలో ఒక భాగం. పర్యవేక్షణ బృందం నివేదిక ప్రకారం, ఈ సంస్థ ప్రధానంగా పెద్ద సైనిక దళాలపై ఆధారపడటాన్ని విడిచిపెట్టి, దానికి బదులుగా లాజిస్టిక్స్, ఆర్థిక నెట్‌వర్క్‌ల మద్దతుతో చిన్న, మరింత విస్తరించిన సెల్‌లను అభివృద్ధి చేసింది.

# పాక్‌లో హిందువులను సహిస్తున్నారట!



పాకిస్తాన్‌లో మైనార్టీల పరిస్థితి ఏమిటో ప్రపంచానికి తెలిసినా మౌనం వహిస్తుంది. కానీ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని పాక్ అధ్యక్షుడు ఆసిఫ్‌అలీ జర్దారీ మాట్లాడిన మాటలు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా అదే విషయాన్ని నొక్కి చెప్తున్నాయి. తన ప్రసంగంలో పాక్‌లోని మైనారిటీలు అంటే ముఖ్యంగా హిందువుల గురించి మాట్లాడిన తీరును చూస్తుంటే పాక్‌లో మైనార్టీల పరిస్థితి వద్దన్నా అర్థమైపోతోంది.

అవినీతి ఆరోపణల కారణంగా తరచుగా 'మిస్టర్ 10 పర్సెంట్' అని ముద్ర ఉన్న జర్దారీ, పాకిస్తాన్ దాని ముస్లింలు హిందువులను సహిస్తున్నారని ప్రకటించారు. జనాభాలో హిందువులు కేవలం 3 నుంచి 4 శాతం మాత్రమే ఉన్నారని, దేశంలోని ముస్లింలు వీరిని సహిస్తున్నారంటూ నోరు పారేసుకున్నారు.

అంతేకాదు, పాకిస్థాన్ తాజా 2023 జనాభా లెక్కల ప్రకారం అక్కడి హిందువుల జనాభా 52 లక్షలు (అంటే దేశ జనాభాలో 2.17%)గా ఉంది; ఇది జర్దారీ పేర్కొన్న సంఖ్య కంటే తక్కువ. తరచూ రాజ్యాంగం, హక్కుల పరిరక్షణ అంటూ తెగ ఉపన్యాసాలు ఇచ్చే జర్దారీ.. ఓ మతపరమైన మైనారిటీ వర్గం గురించి 'సహిస్తున్నాం' అన్న పదాన్ని వాడటం బాధ్యతారహితమే. అంతేకాదు, 3 నుంచి 4 శాతం హిందూ జనాభాను సహించే పెద్ద మనసు తమకు ఉందని, వారు తమతో ఉండడానికే ఇష్టపడతారంటూ ప్రకటించారు.

హిందువులపై దాడులు, బలవంతపు మత మార్పిళ్లు, మూక దాడులు, హిందూ దేవాలయాలపై దాడులు, నిత్యం హిందువులపై చిత్ర హింసలు జరిగే పాక్‌లో... ఇవన్నీ మరిచి, హిందువుల విషయంలో సహిస్తున్నామని, వారు తమతో ఉండడానికే ఆసక్తి చూపిస్తున్నారని ప్రకటించడం కన్నా కపటత్వం మరొకటి ఉండదు. పాకిస్థాన్ గణాంకాల విభాగం (పాకిస్తాన్ బ్యూరో ఆఫ్ స్టాటిస్టిక్స్) ప్రకారం, ఆ దేశంలో 52.1 లక్షల మంది హిందువులు ఉన్నారు. ఈ సంఖ్యలో 'హిందూ జాతి'గా నమోదైన 38.68 లక్షల మంది, షెడ్యూల్డ్ కులాలుగా నమోదైన 13.49 లక్షల మంది ఉన్నారు.

పాకిస్తాన్‌లో వేధింపులు హిందువులకే పరిమితం కాలేదు. క్రైస్తవులు, అహ్మదీయ ముస్లింలు కూడా మూకదాడులు, దాడులను ఎదుర్కొన్నారని, అదే సమయంలో హిందూ, క్రైస్తవ బాలికలు బలవంతపు మతమార్పిడులకు గురవుతూనే ఉన్నారని అమెరికా అంతర్జాతీయ మత స్వేచ్ఛ కమిషన్ (యుఎస్‌సిఐఆర్‌ఎఫ్) చెబుతోంది.

పాకిస్తాన్ మానవ హక్కుల కమిషన్ (హెచ్‌ఆర్‌సిపి), మతపరమైన మైనారిటీలకు ఎదురవుతున్న బెదిరింపులను పదేపదే గుర్తు చేసింది కూడా. 2025 నివేదికలో సింధ్, పంజాబ్ లో హిందూ, క్రైస్తవ మహిళలు, బాలికలు బలవంతపు మత మార్పిళ్లకు, బాల్య వివాహాలకు గురవుతున్నారంటూ రిపోర్టులో పొందుపరిచింది. వీటన్నింటినీ మరిచి, హిందువులను తాము సహిస్తున్నామని, వారు తమతోనే కలిసి జీవించి ఉండడానికి ఇష్టపడుతున్నారని చెప్పడం చూస్తుంటే..పాక్ కపటత్వానికి అంతేలేదనే విషయం అర్థమైపోతుంది.

# పరివర్తన: మాజీ నక్సల్స్ ర్యాంప్ వాక్

నిన్నటి వరకూ లాల్ సలామ్ అని నినాదాలు చేస్తూ, ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతంలో ఒకప్పుడు చేతిలో ఆయుధాలు పట్టుకుని దట్టమైన అడవుల్లో నక్సలైట్లుగా సంచరించిన మహిళలు, సమాజ ప్రధాన స్రవంతిలో కలిసిపోయిన తర్వాత తమ పరివర్తనను చాటుతూ అద్భుతమైన ఘట్టాన్ని ఆవిష్కరించారు. రాయ్‌పూర్‌లో 'జాతీయ చేనేత దినోత్సవం' (నేషనల్ హాండ్లూమ్ డే) సందర్భంగా నిర్వహించిన గిరిజన ఫ్యాషన్ షోలో వీరు చేనేత వస్త్రాలు ధరించి చప్పట్లు, ఈలలతో ప్రశంసల మధ్య ర్యాంప్ వాక్ చేసి ఆకట్టుకున్నారు.

అంతకుముందు, బస్తర్ ప్రాంతంలో అభివృద్ధిని వేగవంతం చేసేందుకు కేంద్ర మౌలిక సదుపాయాల పథకాల నిబంధనల్లో ప్రత్యేక మినహాయింపులు ఇవ్వాలని కోరుతూ ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి, ఉప ముఖ్యమంత్రి విజయ్ శర్మతో కలిసి శుక్రవారం ఢిల్లీలో కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిశారు.





సమావేశం అనంతరం సీఎం సాయి మాట్లాడుతూ, దశాబ్దాల తిరుగుబాటు తర్వాత బస్తర్ ఇప్పుడు ప్రశాంత ప్రాంతంగా మారిందని, ఈ ప్రాంతాన్ని ప్రధాన అభివృద్ధి స్రవంతిలో విలీనం చేయడానికి బలమైన రహదారి అనుసంధానత అత్యంత అవసరమని అన్నారు.

"మా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి విజయ్ శర్మతో కలిసి కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిశాం. 40-50 ఏళ్ల తర్వాత మా బస్తర్ ప్రాంతం చివరకు నక్సల్స్‌రహితంగా మారింది. అక్కడ అభివృద్ధి అవసరం ఎంతైనా ఉంది. అభివృద్ధి దృష్ట్యా రహదారి అనుసంధానత చాలా ముఖ్యం," అని ముఖ్యమంత్రి తెలిపారు. ★

కథ

సుజాత తండ్రి, గదిలోకి వస్తూనే, "క్యాబ్ వచ్చింది బయిల్దేరండి!" అన్నాడు భార్య వంక చూస్తూ.

ఆమె సర్దిపెట్టిన సంచీలు అందుకుంటూ, "నడుస్తావా? వీల్ చెయిర్ తెమ్మంటావా?" అడిగింది బెడ్‌మీద ఉన్న కూతుర్ని.

"నడుస్తాను!"

ఆది సాయిరాంపురానికి ఈశాన్య దిక్కున కిలోమీటర్ దూరంలో నల్లచెరువు పక్కగా ఉన్న నీలిమా నర్సింగ్ హోం. అక్కడ కాన్పులే కాదు ఆక్కరలేదనుకున్న వారికి కడుపులూ తీసేస్తారు.

నిశ్శబ్దంగా ఉన్న ఆ వార్డులో ఉండి ఉండి ఓ పసిగుడ్డు ఏడుపు తీతువు పిట్ట కూతలా వినబడుతున్నది. ఆ ఏడుపుకి సుజాత అస్తవ్యస్తమవుతున్నది.

మనసంతా అలజడి. తనను ఛిద్రం చేసిన ఆ రాక్షసుడు కళ్లముందు కదలాడు తున్నాడు. ఆవేశం గుండెను ఊపేస్తుండగా ఒక్క ఉదుటున మంచం దిగింది. 'నిన్ను ఎప్పటికైనా చంపేది ఆ యముడు కాదురా.. నేను సంధించబోయే ఆయుధమే...నువ్వు నెత్తురు కక్కుకు చస్తుంటే చూస్తూ ఆనందించేది నేనే...' శరీరంలో రక్తం మరుగుతోంది...

ఆకర్షణ మత్తులాంటిది. ఆ మైకంలో ఉన్నప్పుడు ఎదుట ఉన్నది తాగునీటి జలాశయమో, మురుగు కాలువో తెలియదు. చేస్తున్నది మంచో, చెడో తెలియదు. సాంఘిక మర్యాదలు తెలియవు. కుటుంబ పరువూ గుర్తుకు రాదు.

ఉద్యోగంలో జేరిన మొదటిరోజే రాజేష్‌తో పరిచయం. అతడి దగ్గర నెల రోజులు పని నేర్చుకోమన్నారు. తను వెళ్లేటప్పటికి అతడు సీట్లోలేడు. కొలిగ్‌కు కడుపులో నొప్పి వస్తే ఆసుపత్రికి తీసుకు వెళ్లాడని తెలిసింది.

తరువాత రెండు గంటలకు వచ్చాడు. అందగాడే. నవ్వు ముఖం. ప్రతి మాటకు ముందు పెదవులు విచ్చుకుని చిరునవ్వుతో మెరుస్తున్నాయి. "వెల్కం... మిమ్మల్ని నా అంతటివాడిని చేయాలని కంపెనీ కోరుకుంటున్నట్లున్నది. ఎవరి ఆదృష్టం ఎలా ఉంటుందో ఎవరు చెప్పగలరు? ఇవ్వాళ అమావాస్య వెళ్లిన పాడ్యమి. రేపు మొదలు పెడదాం. నేటికి పరిచయాలతో సరిపుచ్చుకుందాం. ఒక గంటలో మీకు కొత్త లాప్‌టాప్ వచ్చే ఏర్పాటు చేస్తాను. రేప్పొద్దున దాని నెత్తిన కాస్త పసుపు పెట్టి పనికి శ్రీకారం చుడితే కంపెనీయే కాదు..పైనున్న దేవుడూ దీవిస్తాడు!"

అతని రూపం, మాటలు ఎదుటివారిని తీయని మత్తులో ముంచేస్తాయి.

ఒకరోజు ఉన్నట్లుండి లంచ్ తర్వాత మాయమయ్యాడు. పునర్దర్శనం మూడు రోజుల తర్వాత.

"అమ్మ నన్ను చూడాలని ఫోన్ల మీద ఫోన్లు చేస్తుంటే రాజమండ్రి వెళ్లాను!" అన్నాడు తను అడగకుండానే. "వెళ్లకుండా ఉండలేకపోయాను... అసలే అనారోగ్యపు మనిషి!"

"ఏమిటి సమస్య?"

"ప్రతి మనిషికీ ఏదో ఒక సమస్య ఉంటూనే ఉంటుంది. ఒకటి తగ్గినా మరోటి పుట్టుకొస్తుంది. రొటీన్... ఈసారి అలాంటి కారణంతో వెళ్లలేదు లెండి... ఆమెకు రెండు రోజులు వరుసగా నేను కలలో కనబడ్డానట...అంతే!"

"మీరంటే అంత ప్రేమన్నమాట...కన్నపిల్లల మీద ప్రేమ తండ్రికంటే తల్లికే ఎక్కువ!"

"యూ ఆర్ కరెక్ట్...మా నాన్నా అంతే. వస్తే ఎందుకొచ్చావ్ అనడు. రాకపోతే ఎందుకు రాలేదు అని అడగడు...అంటే ఆయనకు నా మీద ప్రేమలేదని కాదు... తల్లులకూ, తండ్రులకూ తేడా అదే. మీరు బాగా పట్టేశారు!"



# అమోఘం

పి.ఎస్.నారాయణ

ఆ కంపెనీలో జేరి సంవత్సరం గడవకముందే ఆ మాయ తన మనస్సునే కాదు శరీరాన్నీ కప్పివేసింది. రామకృష్ణా బీచ్, సింహాచలం కొండలు, అరకు లోయ... ఒకటేమిటి... చెట్టాపట్టాలు వేసుకుని అన్ని మూలలూ తిరిగేశారు. విశ్రాంతి కావాలి అనుకున్న రోజు అతడి గది ఉండనే ఉన్నది. రూమ్మేట్ అతడి చిన్ననాటి స్నేహితుడే, తామిద్దరూ గదికి వెళ్లిన మరుక్షణంలోనే మాయమైపోయేవాడు సమయం తెలియనంతగా తెరలు కప్పేసి...



తమ పెళ్లికి అతడి వాళ్లూ తనవాళ్లూ పచ్చజెండా ఊపాలి. అది బహు తేలిక అన్నది ఇద్దరి నమ్మకం. దానికి ప్రధాన కారణం ఇద్దరిదీ ఒకే కులం, గోత్రాలు కలవకపోవటం. ఆ ధైర్యంతోనే అతడి చొరవను తను తోసిపుచ్చలేక పోయింది. ఆ చొరవ పచ్చటి తోటలా పెరిగిపోతుంటే పరుగెడుతున్న కాలానికి కళ్లాలు వేయలేకపోవటం తను చేసిన పెద్ద తప్పు.

ఉన్నట్లుండి మళ్లా మాయమయ్యాడు. ఊరుకెళ్లి ఉంటాడు అనుకున్నది. రెండు రోజులు చూసింది. ఎప్పుడు ఫోన్ చేసినా స్విచ్ ఆఫ్‌లో ఉన్నది అనే సమాచారం. తల్లికి ఎలా ఉన్నదో... ఆసుపత్రిలో ఆమెకు సేవలు చేస్తూ ఫోన్ ఆఫ్ చేయలేదు గదా!ఈ మధ్యయితే తరచూ ఆమె అనారోగ్యం గురించే మాట్లాడుతున్నాడు. గుండె దడదడ లాడసాగింది. ఏమన్నా అయితే తమ వివాహం వాయిదా పడుతుంది. అది తనకిష్టం లేదు.

వారం అయినా పత్తాలేదు. ఫోన్ కాల్ లేదు. వెళ్దామన్నా తనది రాజమండ్రి అనయితే చెప్పాడు గాని పూర్తి చిరునామా తను ఎన్నడూ అడగలేదు, అతడు చెప్పనూ లేదు... వారం అయినా రాకపోవటంతో ఒకరోజు ఆఫీసు నుంచి అతడి గదికి వెళ్లింది అతడి స్నేహితుడిని అడిగితే విషయమేమైనా తెలుస్తుందేమోనని.

గదికి తాళం వేసి ఉన్నది. ఒక్కడే తోచక ఎక్కడ తిరుగుతున్నాడో! అతడు ఏ ఆఫీసులో పనిచేస్తున్నాడో తెలియదు. ఇంటివాళ్ల నడిగితే 'ఆఫీసు పని మీద బెంగళూరు వెళ్లాడండి... ఎప్పుడొచ్చేది చెప్పలేదు' అన్నారు.

ఆ టెన్షన్‌లోనే శనాదివారాల్లో విజయవాడ గూడా వెళ్లలేకపోయింది.

హెచ్ ఆర్ డిపార్ట్‌మెంటులో అడిగితే, 'తల్లికి ఆరోగ్యం బాగాలేదని రెండు వారాలు శెలవు పెట్టాడు' అని చెప్పారు. అర్థంకానిదల్లా తల్లికి అంత అనారోగ్యంగా ఉంటే తనకు కనీసం ఫోన్ అయినా చేయకపోవటం...

మరో వారం గడిచినా ఏ సమాచారమూ లేదు. అతడి మిత్రుడూ బెంగళూరు నుంచి రాలేదు. దాంతో అమ్మ ఫోన్ చేస్తున్నా ఆఫీసులో పని ఎక్కువగా ఉన్నదంటూ తను కుంటి సాకులు చెప్పటం.

దుఃఖం ముంచుకొస్తోంది. దిగులు ముంచుకొస్తోంది. తెలియని భయం మనసునంతా ఆవరించి శరీరాన్ని నిర్వీర్యం చేస్తున్నది.దానికితోడు మరో రెండు వారాలు శెలవు పెంచినట్లుగా తెలియటంతో మరింత కంగారుపడింది.

'రాజేష్ రాజమండ్రి చిరునామా అతడి పర్సనల్ ఫైల్లో చూసి చెప్పగలరా... వాళ్లమ్మగారికి ఒంట్లో బాగాలేదంటున్నారు గదా...నేను శనాదివారాల్లో విజయవాడ వెళుతున్నాను...దారిలోనే కాబట్టి చూసి వెళతాను...ఆమె మా అమ్మకు స్నేహితురాలు!' తన ఆదుర్దాను వాళ్లు అపార్థం చేసుకోకుండా చిన్న అబద్ధం కూడా చెప్పింది.

వివరాలు తీసుకుని శనివారం ఉదయం జన్మభూమిలో రాజమండ్రి వచ్చింది. స్టేషన్ నుంచి ఆటోలో వాళ్లుండే అపార్ట్‌మెంట్‌కు వెళ్లింది. తేలిగ్గానే దొరికింది. ఉద్విగ్నత నడుమ లిఫ్ట్‌లో నాలుగో అంతస్తుకు వెళ్లి అతడి ఫ్లాట్‌ముందు నిలబడి కాలింగ్ బెల్ నొక్కుతుంటే వేళ్లు వణకసాగినాయ్. ఇంట్లో ఉన్నాడో, ఆసుపత్రిలో ఉన్నాడో...

ఎవరో ముసలాయన తలుపు తీశాడు. అతడి తండ్రి కాదు గదా?

'నమస్కారమండి... నా పేరు సుజాత...రాజేష్ కొలీగ్ అండి... వారి అమ్మగారికి బాగుండక పోవటంతో శెలవు పెట్టారు అని తెలిసింది. ఎలా ఉన్నదో చూద్దామని వచ్చాను!' అన్నది వినయంగా.

ఆయనకు తను చెబుతున్నది అర్థం కానట్లుగా ముఖం పెట్టాడు. అయోమయంగా తన వంక చూస్తూ లోపలున్న భార్యని పిలిచాడు. 'ఆ అమ్మాయి ఏదో అడుగుతున్నది చూడు!'

వచ్చిన ఆమెను చూస్తుంటే తనకూ అయోమయ మయింది. ఆరోగ్యంగానే ఉన్నది కదా!

'నేను రాజేష్ కోసం వచ్చానండి... మేం ఇద్దరం ఒకే కంపెనీలో పనిచేస్తున్నాం!'

ఆమె ఒక్కక్షణం ఆలోచిస్తున్నట్లుగా ఆగి, 'రాజేష్ అంటే చలపతిరావు గారి అబ్బాయా...వాళ్లు ఇప్పుడు ఇక్కడలేరు గదమ్మా! రెండేళ్లయింది వెళ్లిపోయి. అప్పుడే పక్క పోర్షన్‌లో ఉన్న మేము దీంట్లోకి మారాం!' అన్నది.

హతాశురాలయింది. నోరు పెగల్చుకోవటానికి రెండు నిమిషాలు పట్టింది. 'ఇప్పుడు వాళ్లు ఎక్కడుంటున్నారండి?'

'తెలియదమ్మా...ఈ రెండేళ్లలో మళ్లా వాళ్లు ఎప్పుడూ కనబడనేలేదు!... ఎవరితోనూ అంతగా కలిసేవాళ్లు కాదు!'

విజయవాడ వెళ్లబుద్ధి కాలేదు. బస్టాండుకు వచ్చి విశాఖపట్నం బయల్దేరే టందుకు తయారుగా ఉన్న బస్సును దిగాలుపడుతూ ఎక్కేసింది. నాలుగురోజులు వరకూ మనసు మనసులో లేదు. ఒకరోజు ఆదుర్దాను

ఆపుకోలేక రాత్రి పొద్దు బోయిన తరువాత అతడి స్నేహితుడి గదికి వెళ్లింది.. బెంగళూరునుంచి వచ్చాడేమో చూద్దామని.

గదిలో లైటు వెలుగుతుండటంతో మనసు తేలికపడింది. వడివడిగా వెళ్లి మూసివున్న తలుపు తట్టింది. తీసిన అతడు అంత పొద్దుబోయిన తరువాత వచ్చిన ఆమెను చూస్తూనే కంగారుగా, 'చెప్పండి!' అన్నాడు.

'రాజేష్ ఊరికి వెళ్లి నెలయింది. ఇంతవరకూ రాలేదు. ఎన్నిసార్లు ఫోన్ చేసినా కనెక్ట్ కావటంలేదు. నాకు చాలా ఆదుర్దాగా ఉన్నది. వాళ్ల అమ్మగారికి ఎలా ఉన్నది?' త్వరత్వరగా అడిగింది.

కొద్దిక్షణాలపాటు అతడు మౌనంగా తననే చూస్తూ ఉండిపోవటంతో తనలో మరింత ఆదుర్దా పెరిగింది.

తేరుకుని, కొద్దిసేపటి తరువాత 'అదేమిటి మీకు తెలియదా?' అన్నాడు విస్మయంగా తన ముఖంలోకే చూస్తూ.

"ఏమైంది?... ఆమె పోయారా?" కంగారు పడుతూ అడిగింది. తనలోని భయం నిజం కాకూడదు అనుకుంటూ.

"వాడు పెళ్లిచేసుకుని భార్య సహా అమెరికా వెళ్లిపోయాడు గదా! పదిరోజుల క్రితం!"

ఒక్కసారిగా కళ్లు తిరుగుతున్నట్లనిపించగా కుప్పలా కూలబడిపోయింది ఆ గది గడపమీదే, తను ఊహించనిది పిడుగు నెత్తినపడటంతో.

చుట్టూ చీకటి. అంతా చీకటి...

తనకు అప్పటికే మూడు నెలలయింది పీరియడ్స్ వచ్చి!

* * *

"నా చేయి పట్టుకో... పడేవ్!" అన్నది లిఫ్ట్ దిగి నున్నటి నేల మీద నడుస్తూ ముఖద్వారం మెట్లు దిగుతుండగా తల్లి.

"అక్కరలేదు!" కాస్తంత చికాగ్గా అన్నది సుజాత. కారణం తెలిసిందే కాబట్టి మాట్లాడలేదు ఆమె.

తరువాత ఆయిదు నిమిషాలకు..పోతున్న క్యాబ్ అద్దంలోనుంచి బయటకు చూస్తున్న కళ్లకు రోడ్డు పక్కన చెట్లన్నీ ఎండిపోయినట్లుగానే కనబడుతున్నాయి తన భవిష్యత్తులాగా. విజయవాడలోని తమ ఇంట్లో కాలు పెట్టేటంతవరకూ ఎవ్వరూ నోరు తెరవలేదు. లోపలకు వెళుతూనే తల్లి గ్లాసుతో మంచినీళ్లు తెచ్చి కూతురుకు ఇచ్చింది.

"వద్దు!" అన్నది సుజాత అందుకోకుండానే.

"నేను ఈరోజు విశాఖపట్నం వెళ్లిపోతున్నాను!" అన్నది తలవంచుకుని.

"నిన్ననే గదే అబార్షన్ అయింది. అప్పుడే అంత హడావిడిగా వెళ్లటం దేనికి? కాస్త నీరసం తగ్గనీయ్...!"

"శారీరకంగా బాగానే ఉన్నాను. మానసికంగానే నీరసపడింది. దానికి కారణం నువ్వు. అది మర్చిపోయేటందుకే వెంటనే వెళ్లి ఉద్యోగంలో జేరదామనుకుంటున్నాను...!"

"పువ్వుల్లో పెట్టి పెంచుకున్న మమ్మల్ని నీ ఛండాలపు పనితో నలుగురిలో తలెత్తుకోలేకుండా చేశావ్!" అన్నది తీక్షణంగా చూస్తూ. "అందుకే ఇంటి పెద్దగా కుటుంబ గౌరవాన్ని కాపాడటానికి ఆ పని చేశాను. ఇక ఓ మంచి కుర్రవాడిని చూసి వివాహం జరిపిస్తే తల్లిగా నా బాధ్యత తీరిపోతుంది!"

"నీ మాట వినకపోతే బావిలో దూకి చస్తాను అంటూ బెదిరించి ఇంటి గౌరవాన్ని కాపాడుకున్నానుకుంటూ తృప్తి పడుతున్నావు. మళ్లా పెళ్లిమాట ఎత్తావో నువ్వు చేద్దామనుకున్న ఆ పని నేను చేసి నా ఆత్మగౌరవాన్ని కాపాడుకుంటాను!"

"అంటే ఇలాగే ఉండి ఎండి మోడయిపోతావా?"

"మనిషికి వివాహం ఒక్కటే పరమావధి కాదు. జీవితంలో ఓ దౌర్భాగ్యుడి చేతిలో కోలుకోలేనంతగా మోసపోయిన నేను దాన్ని కప్పిపుచ్చుకుని, మనసు చంపుకుని మరొకరిని మోసం చేయాలా?" అక్కడ నుంచి లేచి తన గదివైపు వడివడిగా అడుగులు వేయసాగింది.

"చదువుకున్నా, కన్న తల్లిదండ్రులను అర్థం చేసుకున్నది ఇంతేనన్నమాట... నువ్వు చేసింది నలుగురికీ తెలిస్తే మేం తలెత్తుకు తిరగగలమా? బ్రతకగలమా?" పెద్దగా అరిచింది.

"నువ్వు ఏమైనా చెప్పు... అది నా వల్ల కాదు! ఆ వచ్చేవాడు మీ ప్రలోభాలకు లొంగి నాకు మొగుడయినా ఆ సంసారం సజావుగా సాగేది కొద్దికాలమే... నన్ను అలాంటి నరకంలోకి తోయవద్దు!" మరోమాటకు అవకాశం లేనట్లుగా చెప్పేసింది సుజాత. "చెదపట్టిన పుస్తకానికి మంచి రూపం తేవటం ఎవరి వల్లా కాదు... బాగున్న పేజీలను ఉపయోగించుకోవటం ఒక్కటే దారి!" చటుక్కున గది తలుపు తీసింది లోపలకు వెళ్లేందుకు.

"సరే తల్లీ! ఇక చేసేదేమున్నది... నోరుమూసుకుని కూర్చుంటాం!" అన్నది రెండు చేతులనూ నోటిమీద పెట్టుకుంటూ.

"వివాహానికి పునాది నమ్మకం... అది లోపిస్తే సర్వం కుప్పకూలిపోతుంది, ముఖ్యంగా ఆడదానికి!"

ఆమె మాట్లాడలేదు. కూతురు మొండిదని తెలుసు. గర్భస్రావానికి ఒప్పుకోవటానికే నానా రభస చేసింది. పెళ్లి విషయంలో కొన్నాళ్లు ఆగితేనే కానీ తను అనుకున్నది సాధించలేదు.

"సివిల్స్‌కు తయారయ్యేందుకు వెళ్లి కోచింగ్‌లో జేరతాను. మాటమాట్లాడితే నన్ను రమ్మనవద్దు. ఉద్యోగమూ, చదువుతో చాలా బిజీగా ఉంటాను. ఇవ్వాళ వెళ్లొద్దంటున్నావు కాబట్టి, రేపు వెళతాను! పరీక్షలు అయిదారు నెలల్లోనే ఉండవచ్చు. అంతగా అయితే మీరు ఆ సమయంలో వద్దురుగాని..నాకు ఇంటి పనుల్లో సాయంగా ఉంటారు. అదయినా మీకు ఇష్టమయితేనే, బలవంతం లేదు!"

* * *

ఆరు నెలల తరువాత ఓ రోజు చిరుజల్లులు పడుతున్న వేళ సుజాత తల్లీ, తండ్రీ విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో దిగి ఆటోలో కూతురు ఇంటికి వెళ్లేటప్పటికి తొమ్మిదయింది. మూడు రోజుల క్రితం సుజాత తల్లికి ఫోన్ చేసింది, "అమ్మా! పరీక్షలు పదిరోజుల్లోకి వచ్చాయి. ఆఫీసుకు శెలవు పెట్టాను. మీరు ఎప్పుడయినా రావచ్చు!" అంటూ.

ఎప్పుడు రమ్మనమంటుందా! ఎప్పుడు వెళ్దామా! అని ఎదురు చూస్తున్న వాళ్లకు ఆ పిలుపు అమృతం కురిసినట్లే అనిపించింది. కన్నప్రేమ ఎన్ని కష్టనష్టాలనయినా ఎదుర్కొంటుంది. ఎన్ని అవమానాలనైనా భరిస్తుంది. అక్కడ ఉన్నప్పుడే ఎలాగైనా పెళ్లికి ఒప్పించాలి!

వెంటనే బయల్దేరారు రకరకాల పిండివంటలు చేసుకుని చాలా రోజులకు కూతుర్ని చూడబోతున్నామన్న ఆనందం కళ్లల్లో మెరుస్తుండగా. సివిల్స్‌కు తయారవుతుండటంతో ఇన్నాళ్లూ తను రాకపోతే రాకపోయింది..తమనీ రావద్దని ఆంక్షలు పెట్టింది. తాము వస్తే తన చదువుకు గండి కొడతామట. ఇదెక్కడ గోలో! ఈవిడగారు కలెక్టరయి ఊళ్లు ఏలాలా, ఓ సంసారం అంటూ లేకుండా!

సుజాతకు తనతో కలిసి బీటెక్ చేసిన ప్రసన్న మంచి స్నేహితురాలవ్వటమే కాకుండా క్యాంపస్ సెలక్షన్‌లో ఇద్దరికీ ఒకే కంపెనీలో ఉద్యోగాలు రావటంతో, అంతవరకు కాలేజీ హాస్టల్‌లో ఒకే గదిలో ఉన్నవాళ్లు, ఉద్యోగంలో జేరగానే కంపెనీకి దగ్గరలోనే ఓ రెండు పడక గదుల ఇల్లు అద్దెకు తీసుకుని మారిపోయారు.

ఆటో దిగుతున్న సుజాత తల్లిదండ్రుల్ని చూస్తూనే ప్రసన్న ఎదురొచ్చి వాళ్ల చేతుల్లోని పెట్టె, సంచీ అందుకున్నది.

వెనగ్గా కూతురు వస్తున్నదేమో అని ఆత్రంగా చూస్తున్న వాళ్లకు ఆమె రాకపోవటంతో, "సుజాత తన గదిలోనే ఇంకా ముణగదీసుకు కూర్చుని చదువుకుం టున్నదా?" అన్నది తల్లి ముఖంచిట్లించి.

ఎప్పుడు చూద్దామా అని ఆతురతపడుతున్న ఆమెకు కూతురు కనబడక పోవటం నిరాశే కాకుండా చిరాకూ పుట్టిస్తోంది.

"స్నానాలు చేసి భోజనాలు చేస్తే ఆసుపత్రికి వెళదాం!" అన్నది ప్రసన్న ముభావంగా కొద్దిక్షణాలు ఆగి.

"ఆసుపత్రికి దేనికి?" కంగారుపడుతూ అడిగింది ఆమె.

"నొప్పులు మొదలవ్వటంతో మొన్న రాత్రి ఆసుపత్రిలో జేరింది... నిన్న ఉదయమే కాన్పు

అయింది. తల్లీ పిల్లవాడు కులాసాగానే ఉన్నారు...!" ముఖం పక్కకు తిప్పుకుంటూ అన్నది.

ప్రసన్న మాటలు అర్థంగాక అయోమయంగా చూడసాగింది. 'నొప్పులేమిటి, కాన్పు ఏమిటి?" బిగుసుకుపోతూ అడిగింది ఆమె. "ఎవరికీ?" మాట కూడా తడబడుతున్నది.

"సుజాతకే!"

భార్యాభర్తలు షాక్‌నుండి తేరుకునేటప్పటికి పావుగంట పట్టింది. ఆమెకయితే కళ్లవెంట నీరు గిర్రున తిరుగుతోంది.

ప్రసన్న మరోసారి హెచ్చరించటంతో బయిల్దేరారు ముగ్గురూ ఆటోలో. ఆసుపత్రిలో సుజాత పడుకున్న గదిలోకి వెళుతూనే కూతుర్ని కన్నార్పకుండా చూస్తూ ఉండిపోయింది ఆమె పెదవులు వణుకుతుండగా.

"రా అమ్మా!" అన్నది సుజాత. "అమ్మమ్మ చంపేయాలనుకున్న పిల్లవాడు తల్లి గర్భంలో నిర్భీతితో బతికి బయటకు వచ్చాడు తన తల్లి సామ్రాజ్యాన్ని రక్షించేందుకు వజ్రాయుధాన్ని చేతబట్టి!..." ఆమె ఆ మాటలు చెబుతున్నప్పుడు ఎడారిలో వాన కురుస్తున్నట్లుగా ముఖం సంతోషంతో వెలిగిపోతున్నది. తాను విజయం సాధించినందుకు గర్వంతో నిండి ఉన్నది ఆ కంఠం.

"గర్భస్రావం చేయించాను గదే... పాతికవేలు ఖర్చుపెట్టి!" ఆమెకు అంతా అయోమయంగా ఉన్నది. ఇదెలా సాధ్యం? జరిగిందేమిటో జీర్ణించుకోలేక పోతున్నది ఆమె.

"నువ్వు డబ్బుతో దాన్ని జరిపించాలని అనుకున్నావు...నేను కన్నీటితో చేతులు పట్టుకుని నా ధ్యేయాన్ని డాక్టర్ ముందుంచటంతో ఓ స్త్రీగా నా ధైర్యానికి మెచ్చుకుంటూ నా అభ్యర్థనను అంగీకరించింది. నువ్వెప్పుడు వెళ్లి అడిగినా నువ్విచ్చిన డబ్బు ఆమె తిరిగి ఇచ్చేస్తుందిగాని దిగులు పడబోకు!"

ఏం మాట్లాడాలో తెలియనట్లుగా తల్లిదండ్రులిద్దరూ బిత్తరపోయి చూస్తుండి పోయారు కూతురి మాటలకు.


"ఛిద్రమయిన మనస్సుకూ కొన్ని కోరికలూ, కొన్ని ధ్యేయాలు ఉంటాయి.ఉద్యోగం చేస్తూ పైపైకి వెళ్లాలని ఎలా కోరుకుంటామో, జీవితంలోనూ సుఖ సంతోషాలతో శాంతిగా గడపాలని అలాగే కోరుకుంటాం. కానీ నేను ఆశించినవి గాలిమేడలలై కూలిపోగా ఈ మార్గాన్ని, మీకు కష్టం కలిగించేదయినా ఎన్నుకోవాల్సి వచ్చింది.అంతేగాని నేనేం తప్పు చేయలేదు. నమ్మిన మగవాడు మోసం చేయటం ఏ ఆడదీ సహించలేదు. నా జీవితంతో ఆడుకున్న వాడి మీద నా కసిని తీర్చుకోక తప్పదు.అదే నాకు మనశ్శాంతిని కలిగిస్తుంది... జీవితానికి తృప్తినిస్తుంది...!"

కూతురి మాటలు వాళ్ల మనస్సులను అతలాకుతలం చేస్తున్నాయి.

"ఇంటికి వెళ్లగానే ముందు లాయరును సంప్రదించి వీడి జన్మకు కారకుడయిన వాడి మీద పోలీసు కేసు పెట్టి ఈ ప్రపంచంలో ఎక్కడున్నా జుట్టుపట్టుకు లాక్కువచ్చేలా చేస్తాను. నేను పోగొట్టుకున్న ఆనందం, సుఖం, శాంతి వాడికీ అందకుండా చేస్తాను.జీవితాంతం కటకటాల వెనుక చిప్పకూడు తింటూ కుళ్లికుళ్లి ఏడ్చేలా చేస్తాను!" కసిగా అన్నది.

"పెళ్లి చేసుకోవా?"

"నా నిర్ణయం ఎప్పుడో చెప్పాను... ఇప్పుడూ చెబుతున్నాను. పగిలిన నా గుండెమీద మరో ముళ్లదుప్పటి దేనికి?నన్ను మోసం చేసిన ఆ రాక్షసుడి అంతం చూడటమే నా ధ్యేయం.నా భవిష్యత్తుకే దీపమైన వీడిని నిబద్ధతతో పెంచి అత్యున్నతుడిగా నిలబెట్టటం నా విధి. ఇకనైనా నీ ఆ ఆలోచనను పూర్తిగా మనస్సు నుంచి తుడిచేసుకో!" స్పష్టంగా చెప్పింది సుజాత. "కన్నతల్లిగా నా బాగుకోసం నువ్వు చేయగలిగిన సాయం ఏదైనా ఉన్నదీ అంటే అదొక్కటే!" ★

కీర్తిశేషులు శ్రీ వడ్లమూడి రామమోహనరావు 1985 నుంచి 2007 వరకు 22 సంవత్సరాలు జాగృతి వారపత్రిక సంపాదకుడిగా విశిష్ట సేవలు అందించిన ధన్యజీవి.

జాగృతి ఆధ్వర్యంలో

**స్వర్గీయ వడ్లమూడి రామమోహనరావు స్మారక**

**'నవలల పోటీ- 2026'**

రచనలను ఆహ్వానిస్తున్నాం..

ప్రథమ బహుమతి రూ. 25,000

ద్వితీయ బహుమతి రూ. 20,000

సూచనలు :

➾ ఇతివృత్తం భారతీయ జీవన విధానానికి, విలువలకు అద్దం పట్టేదిగా ఉండాలి. సామాజిక, చారిత్రక, పౌరాణిక అంశాలను స్వీకరించవచ్చు. వ్యావహారిక భాషలోనే ఉండాలి. ➾ నవల 125-150 (ఎ4, 15 పాయింట్) పేజీలకు మించరాదు.
➾ తమ రచన డీటిపీ చేసిన పిదప అక్షర దోషాలు, వాక్య నిర్మాణం, ఫుల్‌స్టాప్, కామా గుర్తులు సరి చూచుకొనగలరు. అలాగే పదాలు, వాక్యాలు అల్లుకుపోకుండా చూసి పంపవలసిందిగా మనవి. ➾ సాధ్యమైనంతవరకు డీటీపీ చేయించిన రచనలనే, పోస్ట్ ద్వారా పంపాలి. రాతప్రతులైతే చక్కని దస్తూరితో, ఒక్క కొట్టివేత కూడా ఉండరాదు. ➾ నవల మీద రచయిత పేరు ఉండరాదు. విడిగా హామీపత్రంలో పూర్తి చిరునామా, మొబైల్ నంబర్ సహా రాయాలి. రచన తమ సొంతమని, అనువాదం, అనుసరణ కాదని, ఎక్కడా ప్రచురితం, ప్రసారం కాలేదని హామీ ఇవ్వాలి.➾ ఎంపిక విషయంలో తుది నిర్ణయం న్యాయనిర్ణేతలదే. ఉత్తర, ప్రత్యుత్తరాలకు తావు లేదు. నవలలు **jagriticompetition@gmail.com** కు కూడా మెయిల్ చేయవచ్చు.

నవలలు పంపవలసిన చిరునామా : **3-4-228/4/1**, జాగృతిభవన్, లింగంపల్లి, కాచిగూడ, హైదరాబాద్- **500027.**

**నవలలు మాకు చేరవలసిన ఆఖరి తేదీ : 07 సెప్టెంబర్, 2026**



# ‘కృత్రిమ’ గ్రహణం

**సాం**కేతిక పురోగతి మానవ మనుగడను సులభతరం చేయాల్సింది పోయి, కొత్త కష్టాలను తెచ్చిపెడుతోంది. అనుమతి లేని అశ్లీల చిత్రాలతో బెదిరింపులకు పాల్పడి బాధితుల పరువును బజారుకీడుస్తోంది. సైబర్ స్టాకింగ్ మొదలుకొని, డిజిటల్ బెదిరింపుల వరకు ఏఐ దుర్వినియోగం పెరిగిపోతోంది. కృత్రిమ మేధస్సు వినియోగంలోకి వచ్చిన తర్వాత మహిళలపై ఆన్‌లైన్ హింస సరికొత్త రంగులు అద్దుకుంది. ఏఐ నేరస్థుల చేతిలో ప్రమాదకర ఆయుధంగా మారింది. మహిళల వ్యక్తిత్వాన్ని దుండగుల సాంకేతికతతో క్షణాల్లో ధ్వంసం చేస్తున్నారు.

ప్రత్యక్షంగా భౌతికదాడి జరగకపోయినా, డిజిటల్ రూపంలో నిశ్శబ్ద హింస... తీవ్ర మానసిక క్షోభకు గురిచేస్తోంది. దీంతో సోషల్ మీడియా నుంచే కాక, తమ సామాజిక జీవితం నుంచి కూడా తప్పుకునేందుకు బాధితులు ప్రయత్నిస్తున్నారు. నగ్నంగా వీడియోలు సృష్టించడం, గొంతులు మార్చి బెదిరించడం ఇప్పుడు సులభతరంగా మారింది. ఈ క్రమంలో సోషల్ మీడియాలో స్వేచ్ఛగా ఫోటోలు పెట్టుకోవడమే మహిళలు చేస్తున్న నేరంగా తయారైంది.

**నష్టాలు:** కృత్రిమ మేధస్సువల్ల వేగంగా పురోగతి జరుగుతున్నప్పటికీ, నష్టాలూ అధికంగానే ఉన్నాయి. చిన్న విషయాలకు కూడా ఏఐపై అతిగా ఆధార పడటం వల్ల మనుషుల్లో సొంతంగా ఆలోచించే శక్తి, సృజనాత్మకత తగ్గే అవకాశం ఉంది. శిక్షణకు ఉపయోగించే డేటాలో పక్షపాతం ఉంటే, అది ఇచ్చే నిర్ణయాలు లేదా ఫలితాలు కూడా వివక్షతో కూడి ఉండే ప్రమాదం ఉంది. ఏది నిజం, ఏది అబద్ధం అని గుర్తించడం కష్టంగా మారడంవల్ల సామాజికంగా అపోహలు, నకిలీ వార్తలు వేగంగా వ్యాపిస్తాయి. ఏఐ సహాయంతో మహిళల చిత్రాలను, వీడియోలను మార్ఫింగ్‌చేసి నకిలీ కంటెంట్‌ను తయారుచేయడం, వారి వ్యక్తిగత భద్రతకు, గౌరవానికి తీవ్ర విఘాతం కలిగిస్తోంది. మెకిన్సీ వంటి అంతర్జాతీయ సంస్థల సర్వేల ప్రకారం, ఆటోమేషన్‌వల్ల పురుషుల కంటే మహిళల ఉద్యోగాలే ఎక్కువగా ప్రమాదంలో పడుతున్నాయి. ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్, కస్టమర్‌కేర్, డేటాఎంట్రీ వంటి విభాగాల్లో ఏఐ భర్తీ వేగంగా జరుగుతోంది. ఈ అధునాతన ఎఐ సాధనాల వాడకంవల్ల మహిళలకు సరైన అవకాశాలు లభించడంలేదు. దీంతో వారు కొత్త సాంకేతిక విప్లవంలో వెనుకబడే ప్రమాదం ఉంది. ఒకవైపు డిజిటల్ వేధింపుల భయం మరోవైపు ఉద్యోగ భద్రతలేకపోవడం వల్ల మహిళల్లో మానసిక ఒత్తిడి పెరుగుతోంది.


అభివృద్ధిపథంలో నడిచేందుకు ఉపయోగపడాల్సిన ఏఐ... బాధితుల పట్ల శాపంగా మారుతున్న తరుణంలో మనను మనం ఎలా కాపాడుకోవాలో ఆలోచించాలి. అంతర్జాలంలో 90 శాతానికి పైగా అనుమతి లేని అశ్లీలచిత్రాలే ఉంటున్నాయని, అందులో అత్యధికంగా మహిళలే బాధితులుగా మారుతున్నారని పలు పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. ఈ తరహా ఏఐ ఆధారిత హింస కేవలం ఉద్యోగి నులు లేదా సెలబ్రిటీలకే పరిమితం కాకుండా సాధారణ బాలికల వరకు విస్తరించడం ఆందోళన కలిగిస్తోంది. సోషల్ మీడియాలో మహిళల గొంతు లేదా రూపాన్ని సాంకేతికత ద్వారా మార్చి, వారు అనని మాటలు అన్నట్లు చూపిస్తూ వారి పరువుకు నష్టం కలిగిస్తున్నారు. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, ఇన్ఫోసిస్ సుధామూర్తి వంటి ప్రసిద్ధ మహిళల వీడియోలే ఇందుకు ఉదాహరణ.

**రూపొందించే దశలోనే భద్రత:** కృత్రిమ మేధస్సు తెస్తున్న వేగవంతమైన మార్పుల వల్ల కొన్ని నష్టాలు ఉన్నప్పటికీ, సరైన నివారణోపాయాల ద్వారా వాటిని అదుపు చేయవచ్చు. పరికరాలను అభివృద్ధి చేసే కంపెనీలు దుర్వినియోగాన్ని అరికట్టే భద్రతా ప్రామాణికాలను నిబంధనల్లో చేర్చాలి. ఏఐ ద్వారా సృష్టించిన లేదా మార్చిన కంటెంట్‌ను సులభంగా గుర్తించేలా వాటర్‌మార్క్‌లను తప్పనిసరి చేయాలి. ఫిర్యాదు వచ్చిన వెంటనే ఆటోమేటెడ్ వ్యవస్థల ద్వారా అభ్యంతరకర విషయాలను తొలగించే చర్యలు సోషల్ మీడియా వేదికలు వేగవంతం చేయాలి. అలాగే, వైద్యనిర్ధారణ పరికరాలు ఎక్కువగా పురుషుల డేటాతో శిక్షణ పొందుతాయి. దీనితో మహిళల్లో వచ్చే జబ్బులు, ఇతర లక్షణాలను గుర్తించడంలో లోపాలు చూపించే అవకాశం ఉంది. వైద్యం, న్యాయం, ఉద్యోగ ఎంపికలు వంటి కీలక రంగాల్లో తుది నిర్ణయం ఏఐకి ఇవ్వకుండా మానవ పర్యవేక్షణ తప్పనిసరి చేయాలి.

**చట్టపరమైన సంస్కరణలు:** ఈ సమస్యను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు బహుముఖ వ్యూహం అవసరం. డీప్‌ఫేక్స్, ఏఐ-ఆధారిత సైబర్ నేరాలను ప్రత్యేక నేరాలుగా పరిగణిస్తూ కఠినమైన చట్టాలు రూపొందించాలి. అనుమతి లేకుండా వ్యక్తిగత చిత్రాలను మార్చడం, ప్రచారం చేయడాన్ని శిక్షార్హమైన నేరంగా పరిగణించాలి.

**అవగాహన-సహాయ వ్యవస్థలు:** కృత్రిమ మేధస్సు వల్ల విఘాతం కలుగుతున్న నేపథ్యంలో మహిళలు, బాలికలకు అవగాహన కల్పించాలి. బాధితులకు తక్షణ న్యాయపరమైన, మానసిక, సాంకేతిక సహాయం అందించే హెల్ప్‌లైన్లు, సైబర్ సెల్స్ బలోపేతంచేయాలి. సమాచార సాంకేతిక చట్టం, బిఎన్ఎస్ కింద డీప్‌ఫేక్, ఆన్‌లైన్ వేధింపులపై కేసులు నమోదు చేయవచ్చు. ఆన్‌లైన్ వేధింపులు ఎదురైతే తక్షణమే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫోన్...లేదాసైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలి.ఫోన్ లేదా కంప్యూటర్లను సైబర్ మోసాలు, హ్యాకర్ల బారినుండి కాపాడుకోవాలి. బలమైన పాస్వర్డ్‌లు వాడటం, అపరిచితులు పంపిన లింక్‌లు జోలికి వెళ్లకుండా ఉండటం, పబ్లిక్ వైఫైకి దూరంగా ఉండటం ద్వారా సురక్షితంగాఉండవచ్చు. సోషల్ మీడియాలో ప్రైవసీ సెట్టింగ్స్ బలంగా ఉంచుకోవడం, తెలియని యాప్‌లకు ఫోటో యాక్సెస్ ఇవ్వకపోవడం శ్రేయస్కరం.

కృత్రిమ మేధస్సు, సాంకేతికత మానవ పురోగతికి దోహదపడాలి తప్ప, మహిళలపై డిజిటల్ రూపంలో జరుగుతున్న హింసకు ఆయుధంగా మారకూడదు. ఈ సమస్యలను అధిగమించడానికి కఠినమైన సైబర్ చట్టాలు, వ్యవస్థల్లో లింగ సమానత్వం ఉండేలా నియమాలు రూపొందించడం చాలా అవసరం.



**జయశ్రీ ఆచంట**
సీనియర్ జర్నలిస్ట్



ఆగస్టు 15... స్వాతంత్ర్య దినోత్సవం... జనవరి 26-గణతంత్ర దినోత్సవం... అయితే.... ఆగస్టు 29న జాతీయక్రీడాదినోత్సవం అనేమాట మన నవ, యువతరంలో చాలామందికి తెలియకపోవచ్చు. క్రీడలకు అంతగా ప్రాధాన్యం లేని, క్రీడాసంస్కృతి అంతంత మాత్రంగా ఉన్న మనదేశంలో జాతీయ క్రీడాదినోత్సవానికి అంతగా ప్రాధాన్యం లేకపోవడంలో ఆశ్చర్యంలేదు.

# హాకీ మాంత్రికుని క్రీడోత్సవం

జాతీయక్రీడ హాకీ పితామహుడుగా పేరు పొందిన దిగ్గజ ఆటగాడు, మణికట్టు మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్ జయంతి ఆగస్టు 29న జాతీయ క్రీడాదినోత్సవాన్ని అధికారికంగా జరుపుకోడం గత కొన్ని సంవత్సరాలుగా ఆనవాయితీగా వస్తోంది. ఒలింపిక్స్ చరిత్రలోనే అత్యధికంగా ఎనిమిది బంగారు పతకాలు గెలుచుకొన్న భారత హాకీ క్రీడకు ఆయన చేసిన సేవలకు గుర్తుగా నరేంద్ర మోదీ నేతృత్వంలోని భారత ప్రభుత్వం మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న అవార్డులను ప్రదానం చేస్తూ ఆ మహనీయుడికి సముచిత గౌరవాన్ని కల్పించింది.

**ధ్యాన్‌చంద్ ఆటకు హిట్లర్ ఫిదా!**

ఒలింపిక్స్‌లో పుష్కరకాలం పాటు భారత్‌ను స్వర్ణవిజేతగా నిలిపిన అసాధారణ ఆటగాడు ధ్యాన్ చంద్. హాకీ స్టిక్ పడితే అదికాస్తా ఆయన చేతిలో మంత్ర ‘దండమైపోతుంది. మణికట్టు మాయతో ప్రత్యర్థి ఆటగాళ్లను మంత్రముగ్ధులను చేస్తూ గోల్స్ చేయడంలో ఆయన తరువాతే ఎవరైనా. అలనాటి జర్మన్ నియంత ఆడాల్ఫ్ హిట్లర్ సైతం ధ్యాన్‌చంద్ మణికట్టు మాయకు దాసోహమనక తప్పలేదు.

1936 బెర్లిన్ ఒలింపిక్స్‌లో ధ్యాన్‌చంద్ ఆటతీరు, మణికట్టు మాయకు హిట్లర్ అవాక్కయ్యాడు. ధ్యాన్‌చంద్ వాడుతున్న హాకీ స్టిక్‌లో ఏదైనా అయస్కాంతం ఉందేమోనన్న అనుమానంతో పరీక్షలు కూడా చేయించాడు. అయితే..అదంతా ధ్యాన్ చంద్ నైపుణ్యం, మణికట్టు మాయమాత్రమేనని గ్రహించి...తమ సైనికదళాలలో చేరితే మేజర్ పదవి ఇస్తానంటూ ఆశచూపాడు. ధ్యాన్‌చంద్ మాత్రం... జర్మనీ సేనలో మేజర్‌గా ఉండటం కంటే...భారత సైన్యంలో సిపాయిగా ఉండటమే తనకు ఇష్టమని చెప్పి... తనలోని దేశభక్తిని ఆనాడే చాటి చెప్పారు.

**హాకీమాంత్రికుడి విశ్వరూపం..**

ధ్యాన్ చంద్ నాయకత్వంలో భారత్...వరుసగా మూడు ఒలింపిక్స్‌లో బంగారు పతకాలు సాధించి చరిత్ర సృష్టించింది. 1928, 1932, 1936 ఒలింపిక్స్‌లో ధ్యాన్‌చంద్ విశ్వరూపం ప్రదర్శించి, మూడు ఒలింపిక్స్‌ల్లోనూ స్వర్ణపతకాలు సాధించాడు.

1926 నుంచి 1948 వరకూ, భారత, ప్రపంచ హాకీలో ధ్యాన్ చంద్ శకంగా సాగింది. కేవలం ఒలింపిక్స్ లో ఆయన 101 గోల్స్ సాధించడం ఓ అరుదైన రికార్డుగా ఉంటే, తన క్రీడాజీవితంలో 1000 గోల్స్ సాధించిన మొనగాడిగా రికార్డుల్లో నిలిచిపోయారు. 1948లో చిట్టచివరి అంతర్జాతీయ హాకీ మ్యాచ్ ఆడిన ఆయనకు 1956లో పద్మభూషణ్ అవార్డు ఇచ్చి భారత ప్రభుత్వం గౌరవించింది.

ధ్యాన్ చంద్ మరణానంతరం, ఆయన పేరుతో న్యూఢిల్లీలో నేషనల్ స్టేడియం నిర్మించారు. అంతేకాదు.. ఆయన తపాల బిళ్లను విడుదల చేయడంతో పాటు, క్రీడారంగంలో జీవనసాఫల్య పురస్కార గ్రహీతలకు 2014 వరకూ మేజర్ ధ్యాన్ చంద్ అవార్డును ప్రదానం చేస్తూ వచ్చారు. ఆ తర్వాతి కాలం నుంచి నరేంద్ర మోదీ ప్రభుత్వం.. ధ్యాన్ చంద్ పేరుతో దేశఅత్యున్నత క్రీడాపురస్కారాన్ని ఇస్తూ వస్తోంది. మన హైదరాబాద్ గచ్చిబౌలిలో ధ్యాన్ చంద్ పేరుతో హాకీ స్టేడియం నిర్మించారు.

**ధ్యాన్ చంద్ జయింతి రోజునే...**

ధ్యాన్ చంద్ జయంతిని జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపుకోవాలని కేంద్రప్రభుత్వం దశాబ్దాల క్రితమే ప్రకటించింది. మరోవైపు... ఆయనకు అమరణానంతర భారతరత్న అవార్డు ఇవ్వాలంటూ ఏడాది ఏడాదికీ డిమాండు పెరుగుతూ వస్తోంది. వివిధ రంగాలకు చెందిన 49మంది ప్రముఖులు ఇప్పటి వరకూ ‘భారతరత్న’ పురస్కారానికి ఎంపికయ్యారు. చివరకు క్రికెటర్ సచిన్ టెండుల్కర్ సైతం జీవించి ఉండగానే భారత రత్న గౌరవం పొందాడు. క్రీడారంగానికే చెందిన హాకీ పితామహుడు ధ్యాన్‌చంద్‌కు మాత్రం భారత రత్న పురస్కార జాబితాలో చోటు దక్కడంలేదు.

**‘నమో’ వైపే క్రీడాభిమానుల చూపు**

కశ్మీర్, ట్రిపుల్ తలాక్, రామజన్మభూమి లాంటి జటిల సమస్యలను అలవోకగా పరిష్కరించడం ద్వారా తనకుతానే సాటిగా అనిపించుకున్న నరేంద్ర మోదీ ప్రభుత్వమే మేజర్ ధ్యాన్ చంద్‌కు అమరణా నంతరం భారతరత్న పురస్కారం ఇవ్వాలని దేశంలోని కోట్లాదిమంది క్రీడాభిమానులు, లక్షలాదిమంది హాకీ ప్రియులు కోరుకొంటున్నారు. క్రీడలంటే ప్రత్యేక ఆసక్తి, క్రీడాకారులపట్ల అవ్యాజానురాగం ప్రదర్శించే ప్రధాని తలచుకొంటే హాకీ మాంత్రికుడిని భారతరత్నతో గౌరవించుకోడం ఏమంత కష్టంకాబోదని భావిస్తున్నారు. తన ఆటతీరు, వ్యక్తిత్వంతో భారత హాకీకే విశ్వవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన ..ధ్యాన్ చంద్ కు భారతరత్న పురస్కారం తక్కువే అనడంలో ఏమాత్రంసందేహం లేదు.

వరుసగా మూడు ఒలింపిక్స్‌లో భారత్ కు హాకీ బంగారు పతకాలు సాధించి పెట్టిన ధ్యాన్ చంద్‌కు భారత రత్న ప్రకటిస్తే... ఆ పురస్కారం గౌరవం మరింత ఇనుమడిస్తుందని క్రీడాపండితులు చెబుతున్నారు. బంగారు క్రీడ భారత హాకీకి నిత్యస్ఫూర్తిగా నిలిచిపోయిన మేజర్ ధ్యాన్‌చంద్... భారతరత్న ధ్యాన్‌చంద్‌గా నిలిచిపోవాలని కోరుకొందాం..



**కృష్ణారావు చొప్పరపు**
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969

# ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది సందర్భంగా యువ సమ్మేళనాలు







**ఇందూరు**జిల్లాలోని ఆర్మూర్, బోధన్ యువసమ్మేళనాలలో ఆర్‌ఎస్‌ఎస్ క్షేత్రప్రచారప్రముఖ్ నడింపల్లి ఆయుష్ ప్రసంగించారు. న్యూరాలజిస్ట్ డా॥ రామకృష్ణ, చార్టెడ్ అకౌంటెంట్ బండారి కార్తిక్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఆర్మూర్‌లో 430, బోధన్‌లో 815 మంది యువకులు పాల్గొన్నారు.









**ఇందూరు**లోని నామ్‌దేవ్‌వాడ బస్తి, ఇందూరు జిల్లాలోని నందిపేటమండల యువసమ్మేళనాలలో సామాజిక సమరసత తెలంగాణ సంయోజక్ అప్పాలప్రసాద్ ప్రసంగించారు. నామ్‌దేవ్ వాడలో 551, నందిపేటలో 530 మంది యువకులు పాల్గొన్నారు.





**పాలమూరు :** యువసమ్మేళనంలో ప్రసంగిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ తెలంగాణ ప్రాంత కార్యవాహ కాచం రమేశ్. వేదికపై విభాగ్ సంఘచాలక్ ఏమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి. ఈ సమ్మేళనంలో 400 మంది యువకులు పాల్గొన్నారు.




**మక్తల్ :** పాలమూరు జిల్లా మక్తల్ యువ సమ్మేళనంలో ప్రసంగిస్తున్న పాలమూరు యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజశేఖర్. ఈ సమ్మేళనానికి వన్నవాడ శ్రీకాంత్ అధ్యక్షత వహించారు. ఖండ సంఘచాలక్ డా. అనిల్‌కుమార్, 750 మంది యువకులు పాల్గొన్నారు.




**గంగవరం:** వికారాబాద్ జిల్లా గంగవరం యువ సమ్మేళనంలో విద్యాభారతి క్షేత్ర సంఘటన కార్యదర్శి లింగం సుధాకర్‌రెడ్డి ప్రసంగించారు. 240 మంది యువకులు పాల్గొన్నారు.




**భాగ్యనగర్ :** చిక్కడపల్లి నగర్ యువసమ్మేళనంలో ఆర్‌ఎస్‌ఎస్ తెలంగాణ ప్రాంత బౌద్ధిక్ ప్రముఖ్ కూర జయదేవ్ పాల్గొని ప్రసంగించారు. ఈ సమ్మేళనంలో అసిస్టెంట్ ప్రొ. రామకృష్ణ, డాక్టర్ ఉమేశ్‌షరాఫ్ (రిటైర్డ్ ఐపీఎస్), భాగ్ సంఘచాలక్ కస్తూరి రంగన్, 170 మంది యువకులు పాల్గొన్నారు.



# ధర్మనిష్ఠుడు భరతుడు | కథ

శ్రీరాముడి తమ్ముడు భరతుడు. ఆయనకు అన్నయ్యపై అపారమైన ప్రేమ, గౌరవం. తన తల్లి కైకేయి కోరిన వరాల కారణంగా శ్రీరాముడు పద్నాలుగు సంవత్సరాలు అరణ్యవాసానికి వెళ్లాల్సి వచ్చింది.

ఈ విషయం తెలుసుకున్న భరతుడు తీవ్రంగా బాధపడ్డాడు. తనకు రాజ్యం దక్కాలనే కారణంతోనే తన అన్నయ్యను అడవికి పంపించిందని తెలుసుకుని, తల్లి కైకేయిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. రాజ్యాన్ని స్వీకరించేందుకు ఆయన అంగీకరించలేదు. "ఈ సింహాసనం నాకు చెందదు. అయోధ్యకు నిజమైన రాజు శ్రీరాముడే" అని భరతుడు స్పష్టం చేశాడు.

వెంటనే పెద్దలు, మంత్రులు, సైన్యంతో కలిసి అడవికి వెళ్లి శ్రీరాముడిని కలిశాడు. అన్నను చూసిన భరతుడు భావోద్వేగానికి లోనయ్యాడు. కన్నీళ్లు సుడులు తిరుగుతుండగా, "అన్నయ్యా! అయోధ్యకు తిరిగి రండి. రాజ్యం మీది. మీ స్థానంలో కూర్చుని పాలించడం నాకు ఇష్టం లేదు" అని వేడుకున్నాడు.

అయితే.. తండ్రికి ఇచ్చిన మాటను నిలబెట్టడం తన ధర్మమని, వనవాసకాలం పూర్తయ్యేంత వరకు అయోధ్యకు రానని శ్రీరాముడు స్పష్టం చేశాడు. అంతవరకు నీవు రాజ్యపాలన చేయవలసిందిగా సూచించాడు.

భరతుడు ఎంతగా ప్రార్థించినా శ్రీరాముడు తన నిర్ణయాన్ని మార్చుకోలేదు.

చివరికి భరతుడు శ్రీరాముడి పాదుకలను తీసుకొని, వాటిని అయోధ్యలో సింహాసనంపై ఉంచాడు. తాను రాజుగా కాకుండా, శ్రీరాముడి ప్రతినిధిగా మాత్రమే రాజ్యాన్ని పరిపాలించాడు.

అంతేకాదు, రాజభోగాలకు దూరంగా ఉండి నందిగ్రామంలో సాదాసీదా జీవితం గడిపాడు. శ్రీరాముడు తిరిగి వచ్చే వరకు తన బాధ్యతను ఒక ధర్మంగా భావించి నిర్వర్తించాడు.

అధికారం తన చేతుల్లోకి వచ్చినా, దాన్ని స్వార్థం కోసం ఉపయోగించకుండా శ్రీరాముడి రాజ్యాన్ని ఆయనకే అప్పగించిన భరతుడి త్యాగం గొప్పది. అన్నపై ప్రేమ, ధర్మం పట్ల గల నిబద్ధత భరతుడిని రామాయణంలో ఒక ఆదర్శపాత్రగా నిలబెట్టాయి. ★

## మంచిమాట

**ఇతరుల తప్పులను**
**ఎత్తిచూపే ముందు నీ**
**తప్పులు నువ్వు గుర్తించు.**

## మెదడుకు మేత

**ఇంతింతాకు ఇస్తరాకు**
**రాజులు మెచ్చిన రత్నాలాకు**

జవాబు : తమలపాకు

## పద్యం

**నడువకుమీ తెరువొక్కట**
**కుడువకుమీ శత్రునింట కూరిమి తోడన్**
**ముడువకుమీ పరధనముల**
**నుడువకుమీ యొరుల మనసు నొవ్వగ సుమతీ**

**భావం :** జీవితంలో జాగ్రత్తగా ఉండాలి. ప్రమాదకరమైన దారుల్లో ఒంటరిగా వెళ్లకూడదు. ఇతరుల ధనాన్ని ఆశించకూడదు, శత్రువుల దగ్గర అజాగ్రత్తగా ఉండకూడదు. ముఖ్యంగా మన మాటల వల్ల ఇతరుల మనసు నొప్పించకుండా మాట్లాడటం నేర్చుకోవాలి.

## శ్లోకం

**భార్యా వియోగాశ్చ జనాపవాదో**
**ఋణస్య శేషః కుజనస్య సేవా**
**దారిద్ర్యకాలే ప్రియదర్శనం చ**
**వినాగ్ని నా పంచ దహంతి కాయమ్ (చిత్తమ్)**

**భావం :** భార్యా వియోగం, అపవాదులు, రుణశేషం, చెడ్డవారికి సేవ (చేయ వలసి రావడం), పేదరికంలో ఉన్నప్పుడు ఇష్టమైన వారు రావడం... అగ్ని లేకుండానే శరీరాన్ని దహించివేస్తాయి.

## జతపరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.


| | |
|---|---|
| మహారాష్ట్ర | బాబా బుడాన్ కొండలు |
| కర్ణాటక | సహ్యాద్రి కొండలు |
| తమిళనాడు | సోన్సోగర్ |
| కేరళ | నీలగిరి శ్రేణులు |
| గోవా | అన్నామలై |

జవాబులు : మహారాష్ట్ర–సహ్యాద్రి కొండలు; కర్ణాటక–బాబా బుడాన్ కొండలు; తమిళనాడు–నీలగిరి శ్రేణులు; కేరళ–అన్నామలై; గోవా–సోన్సోగర్.

## శాస్త్రవేత్తలు

# ఎంపీపీ అయ్యంగార్

(డిసెంబర్ 15, 1886 – డిసెంబర్ 10, 1963)



మండయం ఒసూరి పార్థసారథి అయ్యంగార్.. మన దేశానికి చెందిన ప్రముఖ వృక్ష శాస్త్రవేత్త, శైవల శాస్త్రవేత్త. దేశంలో శైవలాలపై శాస్త్రీయ పరిశోధనలకు పునాది వేసిన ఆయనను “భారతీయ శైవల శాస్త్ర పితామహుడు”గా పిలుస్తారు. శైవలాల నిర్మాణం, పునరుత్పత్తి, వర్గీకరణ, జీవచక్రాలపై విస్తృత పరిశోధనలు చేశారు. ముఖ్యంగా “వోల్వోకేల్స్” అనే శైవలాల సమూహంపై ఆయన చేసిన పరిశోధనలు విశేష గుర్తింపు పొందాయి. భారతీయ శైవలాలపై ఆయన చేసిన అధ్యయనాలు తరువాతి తరాల శాస్త్రవేత్తలకు మార్గదర్శకంగా నిలిచాయి.

## జనరల్ నాలెడ్జ్

1. భారతదేశ మొదటి ఎలక్షన్ కమిషనర్ ఎవరు?
2. రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ఎక్కడుంది?
3. ‘పారిజాతాపహరణం’ ఎవరు రచించారు?

సమాధానాలు: 1. సుకుమార్ సేన్, 2. శంషాబాద్, 3. నంది తిమ్మన

**సవరణ:** ఆగస్ట్ 10 సంచికలో మొదటి ప్రశ్నకు సమాధానం ‘సెరీకల్చర్’ బదులుగా ‘ఎపికల్చర్’ అని ఉండాలి. పొరపాటుకు క్షంతవ్యులం.

## భక్తాగ్రేసరులు

# ఒంటిమిట్ట వాసుదాసు



శ్రీరాముడిని శరణువేడి జీవితాన్ని భగవత్ సేవకు అంకితం చేసిన వారు ఒంటిమిట్ట వాసుదాసు (వావిలికొలను సుబ్బరావు). చిన్న వయసులోనే కుమారాభ్యుదయం వంటి ప్రౌఢ ప్రబంధాన్ని రాసిన ఆయన నాటి మద్రాసు (నేటి చెన్నై) రాజధాని కళాశాలలో (ప్రెసిడెన్సీ కాలేజీ) తెలుగు పండితుడిగా సేవలు అందించారు. భార్యా వియోగంతో ఆయన ఆధ్యాత్మిక మార్గాన్ని అనుసరించారు. శిథిలావస్థలోని ఒంటిమిట్ట కోదండ రామస్వామి ఆలయ పునర్నిర్మాణానికి పూనుకున్నారు. కొబ్బరి చిప్పను భిక్షాపాత్రగా చేతపట్టి ఊరూరా భిక్షాటన చేశారు. అలా సమకూరిన సొమ్మునంతా ఆలయ పూర్వవైభవానికి వెచ్చించారు. ‘నీ జన్మ ధన్యము కదే టెంకాయ చిప్పా’ అని శతకం రాశారు. వాల్మీకి రామాయణాన్ని నూట ఎనిమిదిసార్లు పారాయణం చేసి, ‘మందరం’ పేరుతో 24వేల పద్యాలతో తెలుగులో రాసి ఒంటిమిట్ట కోదండ రాముడికి అంకితం ఇచ్చారు. ‘ఆంధ్రవాల్మీకి’గా బిరుదును అందుకున్నారు. ★



# వారఫలాలు

**24-30 ఆగస్ట్ 2026**




సింహంభట్ల సుబ్బారావు

6300674054




**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

కుటుంబంలో సంతోషకరమైన వాతావరణం నెలకొంటుంది. వాహనాలు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారులకు నూతనోత్సాహం. ఉద్యోగులకు విధుల్లో ప్రతిబంధకాలు తొలగుతాయి. కళాకారులు, పారిశ్రామికవేత్తలకు నూతనోత్సాహం. రచయితలకు విశేష గుర్తింపు లభిస్తుంది. 28,29 తేదీల్లో వృథాఖర్చులు. శారీరక రుగ్మతలు. అన్నపూర్ణా దేవి స్తోత్రాలు పఠించండి.



**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

ఎంతటి కార్యక్రమమైనా విజయం సాధిస్తారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. అనుకోని కాంట్రాక్టులు లభిస్తాయి. వ్యాపారులకు ఆశించిన రీతిలో లాభాలు అందుకుంటారు. ఉద్యోగులకు పనిభారం చాలావరకూ తగ్గుతుంది. రాజకీయవేత్తలకు శుభవర్తమానాలు. క్రీడాకారులు, పరిశోధకుల కృషి ఫలిస్తుంది. 24,25 తేదీలలో శారీరక రుగ్మతలు. స్నేహితులతో విభేదాలు. విష్ణు సహస్రనామ పారాయణ చేయండి.



**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

కొన్ని సమస్యలు తీరి ఊరట చెందుతారు. ముఖ్యమైన కార్యక్రమాలు సాఫీగా సాగుతాయి. ప్రముఖులతో పరిచయాలు సంతోషం కలిగిస్తాయి. బంధువులతో సంబంధబాంధవ్యాలు మెరుగుపడతాయి. ఉద్యోగులకు ఉన్నతస్థితి దక్కవచ్చు. రాజకీయ, పారిశ్రామిక వర్గాలకు సంతోషకరమైన వాతావరణం. 26,27 తేదీల్లో స్నేహితులతో విభేదాలు. ఆకస్మిక ప్రయాణాలు. దుర్గాస్తోత్రాలు పఠించండి.



**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

ఇంటిలో శుభకార్యాలు నిర్వహిస్తారు. రాబడి గతం కంటే మెరుగుపడుతుంది. భూలాభాలు. చిన్ననాటి స్నేహితులతో ఆనందంగా గడుపుతారు. వ్యాపారులకు ఉత్సాహవంతంగా ఉంటుంది. ఉద్యోగులకు బాధ్యతలు తగ్గుతాయి. కళాకారులకు అవకాశాలు అనుకోకుండా దక్కుతాయి. క్రీడాకారులు, పరిశోధకులకు పూర్వవైభవం. 28,29 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. రుణయత్నాలు. వేంకటేశ్వరస్వామి స్తోత్రాలు పఠించండి.



**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

కొన్ని వివాదాలు మీ చొరవతో పరిష్కారమవుతాయి. ఆస్తి విషయంలో ఒప్పందాలు కుదురుతాయి. గృహ నిర్మాణయత్నాలు కలిసివస్తాయి. వ్యాపారులకు లాభాలు సంతృప్తినిస్తాయి. ఉద్యోగులకు విధుల్లో అవాంతరాలు తొలగుతాయి. కళాకారులకు సమస్యలు తీరతాయి. రచయితలకు పురస్కారాలు. 25,26 తేదీల్లో ఖర్చులు అధికం. దూరప్రయాణాలు. శివపంచాక్షరి పఠించండి.



**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

కాంట్రాక్టులు అనూహ్యంగా దక్కుతాయి. రాబడి గతం కంటే మెరుగుపడుతుంది. ప్రముఖులతో పరిచయాలు. వాహనాలు, భూములు కొంటారు. వ్యాపారులకు విస్తరణ కార్యక్రమాలు ఫలప్రదమవుతాయి. ఉద్యోగులకు విధి నిర్వహణలో ప్రశంసలు అందుతాయి. రాజకీయవేత్తలకు పూర్వవైభవం. 27,28 తేదీల్లో వృథా ఖర్చులు. స్నేహితులు, బంధువులతో విభేదాలు. కనకధారా స్తోత్రాలు పఠించండి.



**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

వ్యతిరేకులు కూడా అనుకూలురుగా మారతారు. చిన్ననాటి విషయాలు గుర్తుకు తెచ్చుకుంటారు. వ్యాపారులకు లక్ష్యాలు నెరవేరతాయి. ఉద్యోగులకు మరింత అనుకూల సమయం. పారిశ్రామికవేత్తల ప్రయత్నాలలో పురోగతి. రచయితలు, పరిశోధకులకు శుభవార్తలు. 26,27 తేదీల్లో శారీరక రుగ్మతలు. కుటుంబసభ్యులతో వివాదాలు. ఆంజనేయ స్తోత్రాలు పఠించండి.



**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

ఆలోచనలు స్థిరంగా ఉండవు. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. కాంట్రాక్టులు తృటిలో చేజారతాయి. వ్యాపారులకు లాభాలు కష్టసాధ్యమే. ఉద్యోగులకు కొన్ని మార్పులు ఉండవచ్చు. రాజకీయవేత్తలకు అంచనాలలో పొరపాట్లు. రచయితలు, క్రీడాకారులకు గందరగోళ పరిస్థితులు. 29,30 తేదీల్లో శుభవార్తలు. వాహనసౌఖ్యం. వస్తు లాభాలు. నవగ్రహస్తోత్రాలు పఠించండి.



**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

పరిచయాలు విస్తృతమవుతాయి. నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు అందుతాయి. దేవాలయాలు సందర్శిస్తారు. వ్యాపారులకు అనూహ్య లాభాలు అందుతాయి. ఉద్యోగులకు ఇబ్బందులు తొలగుతాయి. పారిశ్రామికవేత్తలు లక్ష్యాలు సాధిస్తారు. క్రీడాకారులు, కళాకారులకు అవకాశాలు పెరుగుతాయి. 27,28 తేదీల్లో బంధువులనుంచి ఒత్తిడులు. స్వల్ప రుగ్మతలు. శ్రీరామస్తోత్రాలు పఠించండి.



**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

ఉద్యోగులకు అనుకూలమైన వాతావరణం. కాంట్రాక్టులు దక్కుతాయి. వాహనసౌఖ్యం. వ్యాపారులకు విధుల్లో ప్రోత్సాహకరంగా ఉంటుంది. ఉద్యోగులకు ఉన్నత హోదాలు రావచ్చు. రాజకీయవేత్తలు, కళాకారులకు విశేషంగా కలిసివస్తుంది. పరిశోధకులు విజయాల బాటలో పయనిస్తారు. 24,25 తేదీల్లో శ్రమ తప్పదు. అనుకోని ప్రయాణాలు. ఆదిత్య హృదయం పఠించండి.



**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

ఆశించినంత ఆదాయం సమకూరి ఉత్సాహంగా గడుపుతారు. వాహనాలు, ఆభరణాలు కొంటారు. ప్రముఖులతో పరిచయాలు ఉత్సాహాన్నిస్తాయి. ఇళ్లు, వాహనాలు కొనుగోలు. వ్యాపారులకు సంతోషకరమైన సమాచారం. ఉద్యోగులకు సహచరుల సాయం, రాజకీయవేత్తలకు కొత్త పదవులు దక్కుతాయి. 28,29 తేదీలలో బంధువులతో తగాదాలు. ఆరోగ్యసమస్యలు. శివాష్టకం పఠించండి.



**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

గృహ నిర్మాణాలు చేపడతారు. కొన్ని వ్యూహాలు ఫలిస్తాయి. స్థిరాస్తి కొనుగోలులో అవాంతరాలు తొలగుతాయి. నిరుద్యోగులకు ఉద్యోగలాభం. వ్యాపారులు లాభాలు గడిస్తారు. ఉద్యోగులకు విధి నిర్వహణలో ప్రోత్సాహకరంగా ఉంటుంది. కళాకారులకు ఒత్తిడులు తొలగుతాయి. క్రీడాకారులు, కళాకారులకు 27,28 తేదీల్లో స్వల్ప రుగ్మతలు. కుటుంబంలో కొద్దిపాటి సమస్యలు. అంగారక స్తోత్రాలు పఠించండి.

# పదరసం-578

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | | ■ | 3 | ■ | 4 | 5 | 6 | ■ |
| 7 | | ■ | 8 | | 9 | ■ | 10 | | |
| | ■ | 11 | | ■ | | ■ | ■ | | ■ |
| 12 | 13 | | ■ | 14 | | 15 | | ■ | 16 |
| 17 | | ■ | 18 | | ■ | | ■ | 19 | |
| | ■ | 20 | ■ | 21 | 22 | ■ | 23 | ■ | |
| ■ | 24 | | ■ | 25 | | 26 | | | |
| 27 | | ■ | 28 | ■ | 29 | | ■ | 30 | ■ |
| | ■ | 31 | | 32 | ■ | 33 | | | 34 |
| 35 | | ■ | 36 | | | | ■ | 37 | |

## ఆధారాలు

అడ్డం

1. సర్పం (3)
4. కెరటం (3)
7. గర్భిణుల వేడుక (2)
8. వేడుక (3)
10. పంపిణీ (3)
11. రెండు పక్షాలు (2)
12. గరుడుడి తల్లి (3)
14. వ్యాకరణ విశేషం (4)
17. గెలుపే (2)
18. మీనం(2)
19. నాగలి (2)
21. ఆకాశం (2)
24. మధువు (2)
25. సుమారు, దాదాపు (4)
27. వీరు కాదు (2)
29. ముసలితనం (2)
31. కారం కాయ (3)
33. ధనాధిపతి (4)
35. మంచు (2)
36. విల్లును ధరించినవాడు (4)
37. చోటు, ప్రదేశం..అటు నుంచి (2)

**నిలువు**

1. రాయలవారి ఆస్థానం (6)
2. జోడి, ఇద్దరు (2)
3. బంగారం (2)
5. కలపను కోసే సాధనం (2)
6. బుట్టలే...(3)
8. ఒక లోహం, పద్యం (2)
9. బియ్యం (3)
11. తల్లి, జనని (2)
13. అందం, మెరుగు (2)
14. అపకీర్తి, అపవాదం (4)
15. రుద్రభూమి, అడవి (2)
16. అద్దకం (4)
20. తైలం (2)
22. పర్వతపుత్రి (3)
23. మరునాడు, ఉదయం (2)
24. రథం (2)
26. శ్రీకృష్ణుడి సారథి (4)
27. వరాహ ముఖంతో దర్శనమిచ్చే దేవత (3)
28. దీంతో తలగోక్కోవడం ఎందుకు? (3)
30. ఆచార్యుడు, బోధకుడు (3)
32. అనేక (2)
34. రజ్జువు (2)

## పదరసం - 577 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 మ | 2 హి | మ | ■ | 3 మి | ధు | 4 నం | ■ | 5 య | మ |
| ■ | డిం | ■ | 6 కుం | డ | ■ | 7 ద | ళ | ము | ■ |
| 8 అం | బి | 9 క | ■ | 10 త | 11 సం | కం | ■ | 12 నో | ము |
| ప | ■ | 13 మ | హి | ■ | త | ■ | 14 అ | త్రి | ■ |
| 15 శ | క | లం | ■ | 16 ప | ■ | 17 శి | ల | ■ | 18 పు |
| య్య | ■ | ■ | 19 ప | డ | వ | ■ | 20 కా | 21 వ | లి |
| ■ | ■ | 22 ప్ర | తి | మ | ■ | 23 గో | పు | రం | ■ |
| 24 జ | ల | గ | ■ | 25 ర | హ | దా | రి | ■ | 26 పో |
| యం | ■ | 27 తి | 28 ట్టు | ■ | ■ | వ | ■ | 29 ఏ | గు |
| 30 తి | స్తు | ■ | గు | ■ | 31 అ | రి | కా | లు | ■ |

సి ని మా

# బాంధవ్యాల విలువ తెలిపే 'విశ్వనాథ్ అండ్ సన్స్'

**తమిళ స్టార్ హీరో సూర్యకు కొన్నేళ్ళుగా సరైన సక్సెస్ లేదు. అయితే ఈ యేడాది మేలో వచ్చిన 'కరుప్పు' (తెలుగులో 'వీరభద్రుడు') మంచి విజయాన్ని సాధించి, సూర్యను సక్సెస్ ట్రాక్ ఎక్కించింది. అతని మరో సినిమా 'విశ్వనాథ్ అండ్ సన్స్' తాజాగా విడుదలైంది.తెలుగువారైన సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించగా, తెలుగు దర్శకుడు వెంకీ అట్లూరి దానిని తెరకెక్కించారు. కుటుంబ ప్రేక్షకులు మెచ్చే అంశాలు ఉండటంతో ఈ చిత్రం విజయపథంలో సాగుతోంది. దాంతో సూర్య బ్యాక్ టు బ్యాక్ హిట్స్ అందుకున్నట్టు అయ్యింది.**

సంజయ్ విశ్వనాథ్ (సూర్య) దేశంలోనే పెద్ద వ్యాపారవేత్త. దానికి తోడు రైఫిల్ షూటింగ్‌లో ఒలింపిక్స్ గోల్డ్‌మెడల్ కూడా అందుకుంటాడు. నలభై సంవత్సరాలు దాటినా సంజయ్ పెళ్లి మాట ఎత్తడు. అతని తల్లి నిర్మలాదేవి (రాధిక)కి అదే బెంగ.తనకో మనవడిని ఇస్తే వాడితో కాలక్షేపం చేస్తానని ఓసారి సంజయ్‌కు గట్టిగా చెబుతుంది. దాంతో సంజయ్ అమెరికా వెళ్లి సరోగసీ ద్వారా ఓ పిల్లాడికి జన్మనిచ్చి, తెచ్చి తల్లి చేతిలో పెడతాడు. అయితే ఆ నెలల బిడ్డకు క్యాన్సర్ అని, బోన్ మ్యారో ద్వారా చికిత్స చేయాలని డాక్టర్లు చెబుతారు. పిల్లాడికి జన్మనిచ్చిన మ్యాడీ (మమితా బైజు)కి డబ్బు ఆశ చూపించి, అమెరికా నుంచి ఇండియాకు తీసుకొస్తాడు.

ఇదిలా ఉంటే, సంజయ్ అవివాహితుడిగా ఉండపోవడానికి అతని తండ్రి విజయ్ విశ్వనాథ్ (రాజీవ్ మీనన్) కారణం. ఆయన నటి అంజలి (రవీనా టాండన్)ని రెండో పెళ్లి చేసుకుంటాడు. దాంతో సంజయ్‌కి పెళ్లి మీదే నమ్మకం పోతుంది. అయితే... పిల్లాడి బోన్ మ్యారో కోసం ఇండియా వచ్చిన మ్యాడీ.. సంజయ్ మంచితనం కారణంగా అతనితో ప్రేమలో పడుతుంది. కానీ తమ మధ్య ఇరవై సంవత్సరాల వ్యత్యాసం ఉండటంతో ఆమె ప్రేమను సంజయ్ తిరస్కరిస్తాడు. పెళ్లంటనే గిట్టని సంజయ్... మ్యాడీని పెళ్లి చేసుకున్నాడా? అమెరికాలో మెడిసన్ చదువుతున్న మ్యాడీ ఎందుకు సరోగసీకి అంగీకరించింది? తండ్రి రెండో భార్య అంజలి అంటే పడని సంజయ్ చివరకు ఆమెకు దన్నుగా ఎందుకు నిలిచాడు? అనేదే మిగతా కథ.

నిజానికి ఈ కథకు 'విశ్వనాథ్ అండ్ సన్స్' అనే పేరు సెట్ కాదు. ఇందులో విశ్వనాథ్‌కు ఒక్కడే కొడుకు, అయితే ఆయనకు ఇద్దరు భార్యలు కాబట్టి, 'విశ్వనాథ్ అండ్ వైఫ్స్' అంటే కరెక్ట్‌గా ఉండేది. చిత్రం ఏమంటే...ఈ సినిమా హీరోయిన్ మెడికో. పెళ్లికి ముందే సరోగసీకి సిద్ధపడుతుంది. ఉండేది అమెరికాలో కాబట్టి అక్కడ ఇవన్నీ కామన్ అని మనం రాజీ పడిపోవాలి. అలానే నలభయ్ సంవత్సరాలు పైబడిన హీరో మల్టీ మిలియనర్ కావడంతో శారీరక అవసరాలు తీర్చుకోవడానికి ప్రతి నెలాఖరులోనూ ఇష్టమైన దేశం వెళ్లి, అక్కడ రెండు రోజులు లైఫ్‌ను ఎంజాయ్ చేసి, ఏమీ తెలియనట్టుగా తిరిగి వచ్చేస్తుంటాడు. హీరో తండ్రి తన కంపెనీకి బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండానికి వచ్చిన హీరోయిన్‌తో




ప్రేమలో పడి రెండో పెళ్లి చేసుకుంటాడు. ఇలా కథ లోతుల్లోకి వెళితే... ఎక్కడా నైతికత అనేది కనిపించదు. కానీ ఈ లోటుపాట్లు ప్రేక్షకుల దృష్టిలోకి రాకుండా, ఒకవేళ వచ్చినా వాటి ప్రభావం పాత్రలపై పడకుండా, దర్శకుడు వెంకీ అట్లూరి ఈ పాత్రలన్నింటి చుట్టూ ఓ పాజిటివ్ వైబ్స్ తాజాగాను క్రియేట్ చేసి తెర మీద ప్రెజెంట్ చేశాడు.

శారీరక అవసరాలకోసం విదేశాలకు వెళ్లే సంజయ్ విశ్వనాథ్‌లో ఓ గొప్ప మానవతావాదిని చూపిస్తాడు. సరోగసీకి సిద్ధపడి, డబ్బుల కోసమే ఇండియాకు వచ్చిన మ్యాగీని అనాథగా చూపి, చదువుకోసమే ఆమె అలాంటి తీవ్ర నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందనే జాలి కలిగేలా చేస్తాడు. అలానే విశ్వనాథ్ భార్యలిద్దరినీ కూడా చాలా పాజిటివ్‌గా చూపిస్తారు. ఈ మొత్తం కథలో స్వచ్ఛమైన పాత్ర అంటే నిర్మలాదేవిగా రాధిక పోషించినదే! భర్త వేరే పెళ్లి చేసుకున్నా, తన సవతిని కూడా చేరదీసి ఆమె గురించి, ఆమె బిడ్డ గురించి పట్టించుకునే అతి మంచి మనిషి. అలానే ఈ సినిమాకు ప్రధాన బలం కథనం, సంభాషణలు. సినిమా ప్రారంభం నుంచి ముగింపు వరకూ ఎక్కడా బోర్ కొట్టకుండా చకచకా సన్నివేశాలన్నీ సాగిపోతుంటాయి. ప్రథమార్థంలో తన కంపెనీ డ్రైవర్ కు సంజయ్ ఇచ్చే గౌరవంతో అతని పాత్ర అమాంతంగా అంబరాన్ని తాకింది. ఆ తర్వాత కూడా అతను చిన్న చిన్న అసంతృప్తులను అధిగమించి, చివరకు సవతి తల్లికి గౌరవాన్ని కట్టబెట్టడానికి చేసే ప్రయత్నంతో అదో ఆదర్శనీయమైన పాత్ర అయి పోయింది. ఇలా అరమరికలు మరిచిపోయి,అంతా ఒకటిగా కలిసి మెలిసి ఉండాలని చెప్పే కథలు ఈ మధ్య కాలంలో రావడం లేదు. ఒకవేళ వచ్చినా అవి బలవంతపు సందేశాత్మక చిత్రాలుగా మిగిలిపోతున్నాయి. అలాంటి సమయంలో యూత్‌ను ఆకర్షించే ప్రేమకథతోనూ, కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే బంధాలు, అనుబంధాలతోనూ 'విశ్వనాథ్ అండ్ సన్స్' తెరకెక్కడంతో చక్కని ప్రేక్షకాదరణ పొందుతోంది.

నటీనటుల విషయానికి వస్తే సంజయ్ విశ్వనాథ్ పాత్రలో సూర్య ఒదిగిపోయాడు. చలాకీ అమ్మాయిగా మమితా బైజు, మ్యాడీ పాత్రకు సంపూర్ణ న్యాయం చేకూర్చింది. రాధిక తన నటనతో సినిమాను నిలబెట్టింది. రవీనా టాండన్ తన గ్రేస్‌తో ఆకట్టుకుంది. సీనియర్ డైరెక్టర్ కోదండరామిరెడ్డి పెద్ద కుమారుడు సునీల్ రెడ్డి కామెడీని చక్కగా పండించాడు. ఇతర ప్రధాన పాత్రలను రాజీవ్ మీనన్, వైవా హర్ష, కాళీ వెంకట్, హారిక, సుధ, సర్వదమన్ బెనర్జీ, నాజర్, రఘుబాబు, హైపర్ ఆది, భవానీ తదితరులు చేశారు. జీవీ ప్రకాశ్ సమకూర్చిన నేపథ్య సంగీతం బాగానే ఉంది కానీ పాటలు ఏమంత గొప్పగా లేవు. నిమిష్ రవి కెమెరా పనితనం బాగుంది. ప్రథమార్థంతో పోల్చితే ద్వితీయార్థ కథ అక్కడక్కడా గాడి తప్పింది. కొన్ని సన్నివేశాలు గతంలో చూసినట్టుగానే అనిపిస్తాయి. క్లయిమాక్స్ సైతం పెద్దంత గొప్పగా లేదు. అయితే ఈ మధ్య కాలంలో ఇలాంటి ఫ్యామిలీ డ్రామా ఏదీ రాకపోవడం ఈ సినిమాకు కలిసొచ్చిన అంశం.

**– అరుణ,** సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్

# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు




వెల : ₹.150/-





వెల : ₹.60/-




వెల : ₹.270/-





వెల : ₹.80/-





వెల : ₹.54/-




వెల : ₹.120




వెల : ₹.80





వెల : ₹.250/-





వెల : ₹.180/-




వెల : ₹.200/-





వెల:₹.999/- సెట్





వెల:₹.450/-




వెల :₹.200/-




వెల : ₹.900/-




వెల : ₹.350/-

**పై పుస్తకములకు మరియు కొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి..**

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

**సాహిత్య నికేతన్ :** కేశవనిలయం, బర్కత్‌పురా. 040-27563236, 9290127329, 8179163138

**సాహిత్య నికేతన్ :** వై.ఎం.ఐ.ఎస్. బిల్డింగ్, సిబిఐ ఆఫీస్ రోడ్, కోఠీ, హైదరాబాద్. 9440589722,

**సాహిత్య నికేతన్ :** ఏలూరు రోడ్, రామమందిరంవీధి, గవర్నరు పేట, విజయవాడ - 2. 8333812687

From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 78 Issue : 45




మిమ్మల్ని ఆలోచింపజేసే ఇంటర్వ్యూలు,
ఆసక్తిని రేకెత్తించే సామాజిక, సాంస్కృతిక అంశాలను
జాగృతి ఇప్పుడు యూట్యూబ్ ద్వారా అందిస్తోంది.
జాతీయ దృష్టికోణంతో వివిధ అంశాలపై
మంచి ఆలోచనలు మన ముందుంచుతోంది.
రండి, జాగృతి యూట్యూబ్ ఛానల్‌ను చూడండి, సబ్‌స్క్రైబ్
చేయండి, మీ అభిప్రాయాలు అందరితో పంచుకోండి.

www.youtube.com/@Jagrititv

చెప్పండి మెచ్చండి పంచండి